
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+20+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹6.00 సంపుటి: 12 సంచిక: 92

ఆదివారం 23-6-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


SUNDAY Special



## ఉరి తీయాల్సిందే

పసిపాపలను చిదిమేస్తున్న వారిని ఉరి తీయాల్సిందే అంటున్న లేడీ సూపర్‌స్టార్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

- ఫ్యామిలీలో



## హ్యాట్రిక్.. మ్యాజిక్

షమీ అద్భుత బౌలింగ్‌తో ప్రపంచ కప్‌లో భారత్‌కు నాలుగో విజయం. 11 పరుగులతో ఓడిన అఫ్గాన్.

- స్పోర్ట్స్‌లో

# అవినీతిపై రాజీలేని పోరు

### చంద్రబాబు అక్రమార్జన కోసం అవినీతిని వ్యవస్థీకృతం చేశారు

### అత్యంత పారదర్శకత తీసుకురావాలన్నదే నా తపన

### నిపుణుల కమిటీ సమావేశంలో సీఎం వైఎస్ జగన్

- ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అత్యంత అవినీతి రాష్ట్రంగా నిలిపారు
- సాగునీటి ప్రాజెక్టుల నుంచి నిరుపేదల ఇళ్ల వరకూ భారీగా అంచనాలు పెంచారు
- టైలర్ మేడ్ నిబంధనలతో కమీషన్లు ఇచ్చిన కాంట్రాక్టర్లకు పెద్దపీట వేశారు
- ఐదేళ్లలో దోపిడీ వల్ల ఖజానా అతలాకుతలం
- ఈ అవినీతిని చూసీచూడనట్లు కళ్లు మూసుకోవాలని కొందరు నాకు ఉచిత సలహా ఇచ్చారు
- చెడిపోయిన వ్యవస్థను బాగు చేయకపోతే రాష్ట్రం భవిష్యత్ అథోగతే
- అందుకే అవినీతిని కూకటి వేళ్లతో పెకలించడానికి నడుం బిగించా
- ఉన్నత స్థాయి నుంచి దిగువ స్థాయి వరకు ఎవరు అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు
- పారదర్శకంగా విచారించి 'రివర్స్ టెండరింగ్' ప్రాజెక్టులను సూచించండి

4లో



ప్రథమ ప్రాధాన్యంగా పోలవరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలి. ఆ తర్వాత పట్టణ నిరుపేదల ఇళ్లు, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వంశధార ప్రాజెక్టుల పనులపై విచారించండి. అనంతరం ప్రాధాన్యతల వారీగా వివిధ రంగాల్లో చోటు చేసుకున్న కుంభకోణాలపై విచారణ చేయండి.

*- నిపుణులతో సీఎం వైఎస్ జగన్*

కమీషన్ల దాహంతో

## గందరగోళంగా మార్చేశారు

- పోలవరంపై గత ప్రభుత్వ ప్రణాళికా రాహిత్యాన్ని ఎండగట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టులో రూ.వెయ్యి కోట్లకుపైగా అవినీతి జరిగింది
- టీడీపీ పాలనలో అక్రమాలపై విచారణ చేయాలని నిపుణుల కమిటీకి ఆదేశం
- రివర్స్ టెండరింగ్ నిర్వహించి అక్టోబర్‌లోగా కొత్త కాంట్రాక్టర్ ఎంపిక

2లో

ఉగాది రోజు 25 లక్షల

## ఇళ్ల స్థలాలు

- మహిళల పేరిటే పంపిణీ చేయాలి
- ఆర్థిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం

- వివరాలు 2లో

## 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

- విశాఖ కమిషనర్‌గా ఆర్‌కే మీనా
- అగ్నిమాపక శాఖ డీజీగా ఏఆర్ అనురాధ
- ఇంటెలిజెన్స్(ఎస్ఐబీ) డీఐజీగా సీహెచ్ శ్రీకాంత్
- ఇంటెలిజెన్స్ ఎస్పీగా కేవీ మోహన్‌రావు
- సీఐడీ ఎస్పీగా జీవీజీ అశోక్‌కుమార్

2లో

## భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ

ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర సాంఘిక సంక్షేమ శాఖకు బదిలీ

వ్యవసాయ శాఖ నుంచి విద్యా శాఖకు రాజశేఖర్

వ్యవసాయ శాఖ కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి











సదస్సులో ప్రసంగిస్తున్న హైకోర్టు ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్

## ప్రజలు కట్టే పన్నులకు జవాబుదారీతనం ప్రధానం

- ఆలిండియా ట్యాక్స్ సదస్సులో హైకోర్టు ఏసీజే జస్టిస్ ప్రవీణ్ కుమార్
- దేశాభివృద్ధిలో ఎకానమీ, ఫైనాన్స్, రెవెన్యూ కీలక అంశాలు

- వివరాలు 5లో

## గ్రామ-వార్డు వలంటీర్ల దరఖాస్తు కోసం ప్రత్యేక వెబ్‌పోర్టల్

- దీని ద్వారానే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి
- విధివిధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- జిల్లాల వారీగా వలంటీర్ల ఉద్యోగాల సంఖ్యను తేల్చేది కలెక్టర్లే
- రేపటి నుంచి జూలై 5 వరకూ దరఖాస్తులు స్వీకరణ
- పర్యవేక్షణకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 2 కమిటీలు

- వివరాలు 5లో



## జడ్జీలను పెంచండి

- ప్రధాని మోదీకి సీజేఐ జస్టిస్ గొగోయ్ లేఖలు

- వివరాలు 15లో

జూలై 1 నుంచి

## ఎంసెట్ కౌన్సెలింగ్

రేపు నోటిఫికేషన్ విడుదల

1 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

4 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు

11న సీట్ల కేటాయింపు

15 నుంచి తరగతులు

- వివరాలు 4లో

కాంగ్రెస్ పగ్గాలు

## గహ్లోత్‌కు?

- వివరాలు 15లో










# భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ

- ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర సాంఘిక సంక్షేమ శాఖకు బదిలీ
- వ్యవసాయ శాఖ నుంచి విద్యా శాఖకు రాజశేఖర్
- వ్యవసాయ శాఖ కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి
- శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**సాక్షి, అమరావతి:** పారదర్శక పరిపాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీగా పనిచేసి తెలుగుదేశం పార్టీ పెద్దలు చెప్పినట్లుగా అడ్డగోలుగా నిధులు విడుదల చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రవిచంద్రను సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్‌ను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. పలు జిల్లాల జాయింట్ కలెక్టర్లతోపాటు పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం అర్ధరాత్రి దాటాక ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెటింగ్, సహకార శాఖల ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న వై.మధుసూధన్‌రెడ్డికి వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శిగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.

**విశాఖ, విజయవాడ కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థలో అడ్డగోలుగా కన్సల్టెంట్లను నియమించి, నిధులు దుర్వినియోగం చేశారని అభియోగాలు ఎదుర్కొంటున్న ఆ సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వెంకయ్య చౌదరిని బదిలీ చేసి ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. యువజన సేవల విభాగం కమిషనర్‌గా ఉన్న భానుకుమార్‌ను ఏపీఎండీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌గా పనిచేస్తున్న కాంతిలాల్ దండేకు ఇంటర్మీడియట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పలువురు అధికారులను బదిలీ చేయడంతోపాటు వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. కొందరు అధికారులను బదిలీ చేసి పోస్టింగ్‌ల కోసం జీఏడీలో రిపోర్టు చేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఎల్వీ సుబ్రహ్మణ్యం జీవో జారీ చేశారు. కీలకమైన విశాఖపట్నం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు కూడా బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా ఉన్న సృజనను అక్కడే మహా విశాఖ కమిషనర్‌గా, చిత్తూరు జిల్లా జేసీ గిరీషను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. వైఎస్సార్, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్లు బదిలీ అయ్యారు.

## విద్యుత్ శాఖలో భారీ ప్రక్షాళన

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో అవినీతి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యుత్ శాఖలో భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. కొద్ది రోజుల క్రితం ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో సీఎండీ, జెన్‌కో ఎండీని మార్చేసింది. తాజాగా ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా(కమర్షియల్, ఫైనాన్స్, హెచ్ఆర్‌డీ, ఐటీ) కేవీఎన్ చక్రధరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఈ స్థానం కొంతకాలంగా ఖాళీగానే ఉంది. అంతకు ముందు ఆదాయపు పన్ను శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన దినేష్ పరుచూరి పదవీ కాలం ముగిసింది. పొడిగింపు కోసం ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తన బాధ్యతలను విజిలెన్స్ జేఎండీగా ఉన్న ఉమాపతికి అప్పగించి రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి ఉమాపతి రెండు పోస్టుల్లోనూ కొనసాగుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమాపతికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన కోరిందే తడవుగా పదవీ కాలాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. తొలుగా జేఎండీని నియమించింది. విజిలెన్స్ జేఎండీ పోస్టును ఏం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇక తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఎండీగా నాగలక్ష్మిని నియమించారు. విద్యుత్ సంస్థల్లో రెండు డిస్కమ్‌లున్నాయి. వీటిలో ఒకదానికి ఐఏఎస్ అధికారిని, మరో డిస్కమ్‌కు టెక్నికల్ వ్యక్తిని నియమిస్తున్నారు. ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ సీఎండీగా ఉన్న ఎంఎం నాయక్‌ను ఎక్సైజ్ శాఖకు బదిలీ చేశారు. దీంతో ఈ డిస్కమ్ సీఎండీ పోస్టు ఖాళీగానే ఉంది. ఈపీడీసీఎల్ సీఎండీగా ఎన్నికల ముందు విజయవాడ సీఈగా ఉన్న రాజబాపయ్యకు బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాన్ని కొత్త ప్రభుత్వం పున:సమీక్షిస్తోంది. ఈ కారణంగా ఈ డిస్కమ్‌కు ఐఏఎస్ అధికారి నాగలక్ష్మిని నియమించారు. సంప్రదాయ పునరుత్పాదక అభివృద్ధి సంస్థకు(నెడ్‌క్యాప్) కొత్తగా రమణారెడ్డిని నియమించారు. పవన విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో నెడ్‌క్యాప్ పాత్ర కీలకం. ఈ ఒప్పందాలపై ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ కారణంగా పూర్తిస్థాయి అధికారి అవసరమని భావించి నియామకం చేపట్టినట్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)కు టెక్నికల్ అధికారిని సీఎండీగా నియమిస్తే విద్యుత్ శాఖలో ప్రధాన ప్రక్షాళన పూర్తయినట్టే.

### బదిలీ అయిన అధికారులు

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| బి.రాజశేఖర్ | వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి | విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి |
| బి.ఉదయలక్ష్మి | ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి | కార్మిక ఉపాధి కల్పన ముఖ్యకార్యదర్శి |
| శశిభూషణ్ కుమార్ | వెయిటింగ్ | సాధారణ పరిపాలన (సర్వీసెస్) కార్యదర్శి |
| ఆర్.పి.సిసోడియా | సాధారణ పరిపాలన (రాజకీయ) ముఖ్యకార్యదర్శి | సాధారణ పరిపాలన (జీపీఎం అండ్ ఏఆర్) ముఖ్యకార్యదర్శి |
| ఎం.రవిచంద్ర | ఆర్థిక శాఖ కార్యదర్శి | సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి |
| ముఖేశ్ కుమార్ మీనా | సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి | గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి |
| వాణి మోహన్ | పురావస్తు కమిషనర్ | సహకార రిజిస్ట్రేషన్ కమిషనర్, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఎండీ |
| డి.వరప్రసాద్ | వెయిటింగ్ | కార్మిక శాఖ కమిషనర్ |
| భానుప్రకాశ్ | యువజన సర్వీసుల కమిషనర్ | ఏపీఎండీసీ ఎండీ |
| వెంకయ్య చౌదరి(ఐఆర్ఎస్) | ఏపీఎండీసీ ఎండీ | జీఏడీలో రిపోర్ట్ |
| హెచ్.అరుణ్‌కుమార్ | మహిళా శిశు సంక్షేమ ప్రత్యేక కమిషనర్ | వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ |
| ప్రవీణ్ కుమార్ | వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ | ఏపీ టూరిజం ఎండీ. ఏపీ టూరిజం అథారిటీ సీఈవో |
| కె.కన్నబాబు | వెయిటింగ్ | విపత్తుల నిర్వహణ ప్రత్యేక కమిషనర్ |
| ప్రసన్న వెంకటేశ్ | విపత్తుల నిర్వహణ ప్రత్యేక కమిషనర్ | విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ |
| ఎం.రామారావు | విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ | బీసీ సహకార ఆర్థిక సంస్థ వైస్ చైర్మన్ అండ్ ఎండీ |
| కార్తికేయ మిశ్రా | వెయిటింగ్ | వైద్య కుటుంబ సంక్షేమం, ఎన్‌హెచ్ఎమ్ మిషన్ డైరెక్టర్ |
| ఎ.మల్లికార్జున్ | తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ | ఆరోగ్యశ్రీ సీఈవో |
| ఎస్.నాగలక్ష్మి | ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ | ఏపీఈపీడీసీఎల్ (విశాఖపట్టణం) ఎండీ |
| పి.ఎస్.గిరీష | చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ | తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తుడా వైస్ చైర్మన్ |
| విజయరామరాజు | తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తుడా వీసీ | మార్క్‌ఫెడ్, ఆగ్రోస్ ఎండీ |
| కె.వి.ఎన్.చక్రధర్‌బాబు | శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ | ఏపీ ట్రాన్స్‌కో జెఎండీ |
| జి.సృజన | విశాఖపట్టణం జిల్లా జాయింట్ కలెక్టర్ | గ్రేటర్ విశాఖపట్టణం కమిషనర్ |
| ఎం.హరినారాయణన్ | గ్రేటర్ విశాఖపట్టణం కమిషనర్ | ఏపీఐఐసీ ఈడీ |
| పి.రంజిత్ బాషా | వెయిటింగ్ | గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ |
| గంధం చంద్రుడు | గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ | సాంఘిక సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ వీసీ అండ్ ఎండీ |
| ఎస్.షాన్‌మోహన్ | వెయిటింగ్ | ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ |
| ఎల్.శివశంకర్ | సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ | విశాఖపట్టణం జిల్లా జాయింట్ కలెక్టర్ |
| లక్ష్మీ షా | పార్వతిపురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ | తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ |
| ఎ.ఎస్.దినేశ్ కుమార్ | ఫైబర్ నెట్ సీఈవో అండ్ ఎండీ | గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ |
| హిమాన్షు శుక్లా | గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ | చేనేత జౌళి శాఖ డైరెక్టర్ |
| సి.నాగరాణి | చేనేత జౌళి శాఖ డైరెక్టర్ | జీఏడీలో రిపోర్టు |
| చిన వీరభద్రుడు | గిరిజన సంక్షేమ అదనపు డైరెక్టర్ | సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ |
| జి.శ్రీనివాసులు | సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ | జీఏడీలో రిపోర్టు |
| పి.రాజాబాబు | వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ | సెర్ప్ సీఈవో |
| కె.మాధవీలత | ఉపాధి కల్పన శిక్షణ డైరెక్టర్ | కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ |
| కృతికా శుక్లా | కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ | మహిళా శిశు సంక్షేమ డైరెక్టర్ |
| ఎం.గౌతమి | టీటీడీ డిప్యుటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ | వైఎస్సార్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్ |
| పి.కోటేశ్వరరావు | వైఎస్సార్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్ | జీఏడీలో రిపోర్టు |
| పి.ప్రశాంతి | కర్నూలు జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ | అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ |
| డి.మార్కండేయులు | జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ | చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ |
| వి.వినోద్ కుమార్ | రంపచోడవరం సబ్ కలెక్టర్ | పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ |
| సి.ఎం.సాయికాంత్ వర్మ | రాజమండ్రి సబ్ కలెక్టర్ | సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ |
| ఎం.ప్రతాప్(ఐపీఎస్) | ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ | ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ |
| ఎన్.రమణారెడ్డి(ఐఆర్‌పీఎస్) | వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ | నెడ్‌క్యాప్ ఎండీ |

# 21 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ నెల 5వ తేదీన 26 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన సంగతి తెల్సిందే. దీంతో 15 రోజుల వ్యవధిలో రెండు దశల్లో రాష్ట్రంలో 47 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. అప్పట్లో బదిలీ చేసిన వారిలో ఐదుగురు మరోసారి బదిలీ అయ్యారు. టీడీపీ హయాంలో ప్రత్యేకంగా డీజీపీ కార్యాలయంలో శాంతిభద్రతల కో ఆర్డినేషన్ ఐజీగా ఉన్న ఘట్టమనేని శ్రీనివాస్‌ను అనంతపురం పీటీసీకి బదిలీ చేయగా తాజాగా ఆయన్ను పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కోయ ప్రవీణ్, జీవీజీ అశోక్‌కుమార్, సర్వశ్రేష్ట త్రిపాఠి, విక్రాంత్ పాటిల్‌లను ప్రభుత్వం మరోసారి బదిలీ చేసింది.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| ఏఆర్ అనురాధ | వెయిటింగ్ | రాష్ట్ర విపత్తులు, అగ్నిమాపక శాఖ డీజీ |
| ఎన్.బాలసుబ్రమణ్యం | వెయిటింగ్ | జీపీడీ |
| ఎన్.శ్రీధర్‌రావు | రోడ్ సేఫ్టీ ఏడీజీ | పోలీస్ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ ఏడీజీ |
| ఆర్‌కే మీనా | గుంటూరు రేంజ్ ఐజీ | విశాఖపట్నం పోలీస్ కమిషనర్ |
| మహేష్‌చంద్రలడ్హా | విశాఖ సీపీ | పోలీస్ పర్సనల్ ఐజీ |
| కె.సత్యనారాయణ | రాష్ట్ర విపత్తులు, అగ్నిమాపక శాఖ డీజీ | పీటీవో ఐజీ |
| జి.శ్రీనివాసులు | ఎస్ఐబి ఐజీ | ఏపీఎస్‌పీ ఐజీ |
| వినీత్ బ్రిజ్‌లాల్ | పర్సనల్ ఐజీ | గుంటూరు రేంజ్ ఐజీ |
| ఘట్టమనేని శ్రీనివాస్ | అనంతపురం పీటీసీ | పోలీస్ హెడ్‌క్వార్టర్ |
| సీహెచ్ శ్రీకాంత్ | టెక్నికల్ సర్వీసెస్ డీఐజీ | ఇంటెలిజెన్స్(ఎస్ఐబి) డీఐజీ |
| జి.పాల్‌రాజు | వెయిటింగ్ | టెక్నికల్ సర్వీసెస్ డీఐజీ |
| ఎన్‌కేవీ రంగారావు | సీఐడీ డీఐజీ | విశాఖపట్నం రేంజ్ డీఐజీ |
| ఎస్.హరికృష్ణ | ఇంటెలిజెన్స్ ఎస్పీ | అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ఐజీ |
| కేవీ మోహన్‌రావు | విజయవాడ రైల్వే ఎస్పీ | ఇంటెలిజెన్స్ ఎస్పీ |
| జీవీజీ అశోక్‌కుమార్ | ఇంటెలిజెన్స్ ఎస్పీ | సీఐడీ ఎస్పీ |
| సర్వశ్రేష్ట త్రిపాఠి | సీఐడీ ఎస్పీ | అనంతపురం ఏపీఎస్‌పీ బెటాలియన్ కమాండెంట్ |
| కోయ ప్రవీణ్ | గుంతకల్లు రైల్వే ఎస్పీ | పోలీస్ హెడ్‌క్వార్టర్ |
| విక్రాంత్ పాటిల్ | వెయిటింగ్ | గుంతకల్లు రైల్వే ఎస్పీ |
| ఎస్.రంగారెడ్డి | అడ్మినిస్ట్రేషన్ ఏఐజీ | విశాఖ శాంతిభద్రతల డీసీపీ |
| కె.నారాయణనాయక్ | పీటీవో ఎస్పీ | విజయవాడ రైల్వే ఎస్పీ |
| ఎం.దీపిక | ఏసీబీ ఏఎస్పీ | కర్నూలు ఏఎస్పీ |

## ఉగాది రోజు 25 లక్షల ఇళ్ల స్థలాలు

- మహిళల పేరిటే పంపిణీ చేయాలి
- ఆర్థిక శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- నవరత్నాలను పక్కాగా అమలు చేయాలి
- నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయండి
- అవినీతికి పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదు



ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సీఎం వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి:** వచ్చే ఉగాది పండుగ రోజు అర్హులకు 25 లక్షల ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో రాజీ అన్నదే ఉండదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శనివారం ఆర్థిక శాఖపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల పేరిట 25 లక్షల ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి ప్రధానంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నవరత్నాల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నవరత్నాలను పక్కాగా అమలు చేయడానికి గ్రామ వలంటీర్లు, వార్డు వలంటీర్లు, గ్రామ సచివాలయాల ఏర్పాటుపై చర్చించారు. నవరత్నాల అమలుకు కావాల్సిన నిధులను ఎలా సమకూర్చుకోవాలన్న దానిపై సమీక్షించారు. కొన్ని శాఖల్లో అవినీతి వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, దీనికి తక్షణమే అడ్డుకట్ట వేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. అవినీతి విషయంలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకూ ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అవినీతికి పాల్పడితే ఏ స్థాయి అధికారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. అదే విధంగా నిధుల దుర్వినియోగం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై సమీక్ష నిర్వహించి, అందుకు కారకులైన వారిని గుర్తించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల వివరాలను ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పీవీ రమేష్, పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ సలహాదారుగా రిటైర్డు ఐఏఎస్ శామ్యూల్

- ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా ఎంపీ విజయసాయిరెడ్డి
- కేబినెట్ హోదాలో రెండు కీలక నియామకాలు చేసిన ప్రభుత్వం



శామ్యూల్



విజయసాయిరెడ్డి

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం కేబినెట్ హోదా గల రెండు కీలక నియామకాలు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సలహాదారుగా రిటైర్డు ఐఏఎస్ అధికారి ఎం.శామ్యూల్ నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు ఉంటారు. జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవరత్నాలు కార్యక్రమం అమలు, పర్యవేక్షణ కమిటీకి ఆయన వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. నవరత్నాల అమలుకు సంబంధించి ఆయా శాఖలను కూడా శామ్యూల్ సమీక్షిస్తారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని ఢిల్లీ ఏపీ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయసాయిరెడ్డి ఇప్పటికే వైఎస్సార్ పార్లమెంటరీ పార్టీ నేతగానూ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగానూ ఉన్న విషయం విదితమే. పార్టీలో క్రియాశీలంగా ఉంటూ సంస్థాగత నిర్మాణంలోనూ ఆయన కీలక భూమిక పోషిస్తున్నారు. ఏపీ భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా విజయసాయిరెడ్డి నియామకం ఆఫీస్ ఆఫ్ బెనిఫిట్ (ఒకటే ఆర్థిక ప్రయోజనం) కిందకు మాత్రమే వస్తుందని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఈ పదవికి విజయసాయిరెడ్డి రెమ్యూనరేషన్ తీసుకోరని తెలిపాయి.

**జీవీడీ, తలశిలకు కేబినెట్ హోదా**

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ కమ్యూనికేషన్స్ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్, ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురామ్‌లకు కేబినెట్ హోదాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పదవిని చేపట్టిన తేదీ నుంచి ఈ హోదా అమల్లోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం పేర్కొన్నారు.

## కమీషన్ల దాహంతో

# గందరగోళంగా మార్చేశారు

- పోలవరంపై గత ప్రభుత్వ ప్రణాళికా రాహిత్యాన్ని ఎండగట్టిన సీఎం వైఎస్ జగన్
- స్పిల్ వే నిర్మాణం పూర్తి కాకుండానే హడావుడిగా కాఫర్ డ్యామ్ పనులు
- వరద సమయం ఆసన్నమవడంతో ఆ పనులు మధ్యలోనే ఆపేశారు
- వరదతో జూలై నుంచి అక్టోబర్ వరకూ పనులు ఆపేయాల్సిన దుస్థితి
- 'పోలవరంలో నామినేషన్‌దే డామినేషన్' కథనాన్ని ప్రస్తావించిన ముఖ్యమంత్రి
- జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టులో రూ.వెయ్యి కోట్లకుపైగా అవినీతి జరిగింది
- టీడీపీ పాలనలో అక్రమాలపై విచారణ చేయాలని నిపుణుల కమిటీకి ఆదేశం
- రివర్స్ టెండరింగ్ నిర్వహించి అక్టోబర్‌లోగా కొత్త కాంట్రాక్టర్ ఎంపిక
- నవంబర్ నుంచి కొత్త కాంట్రాక్టర్‌తో శరవేగంగా పోలవరం పనులు
- నిపుణుల కమిటీతో భేటీలో ముఖ్యమంత్రి దిశా నిర్దేశం



సాక్షి, అమరావతి

రాష్ట్ర ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు అధికారంలో ఉండగా కమీషన్ల దాహంతో గందరగోళం చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఒక్క పోలవరం ప్రాజెక్టులోనే చంద్రబాబు అనేక కుంభకోణాలకు పాల్పడి తన అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకున్నారని చెప్పారు. శనివారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిపుణుల కమిటీతో భేటీ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో పోలవరం నిర్మాణంలో చోటు చేసుకున్న అక్రమాల గురించి వైఎస్ జగన్ ప్రస్తావించారు. 'పోలవరంలో నామినేషన్‌దే డామినేషన్' శీర్షికన ఈనెల 20వతేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చదివి వినిపించారు. ఈ కుంభకోణంపై తొలుత విచారణ చేయాలని నిర్దేశించారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా 'రివర్స్ టెండరింగ్' ద్వారా కొత్త కాంట్రాక్టర్‌ను అక్టోబర్ నాటికి ఎంపిక చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నవంబర్ నాటికి కొత్త కాంట్రాక్టర్‌తో పోలవరం పనులను ప్రారంభించి శరవేగంగా పూర్తి చేస్తామని ప్రకటించారు.

### నివేదిక రాగానే రివర్స్ టెండరింగ్..

పోలవరం పనుల్లో జీవో 22, 63లను వర్తింపజేసి తాజా ధరల కంటే అధికంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి చంద్రబాబు భారీ ఎత్తున కమీషన్లు వసూలు చేసుకున్నారని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. పోలవరం జలవిద్యుదుత్పత్తి ప్రాజెక్టు టెండర్లలో రూ.వెయ్యి కోట్లకుపైగా అవినీతి జరిగిందని స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని నిపుణుల కమిటీని ఆదేశించారు. నివేదిక రాగానే అంచనా వ్యయాన్ని అలానే ఉంచి రివర్స్ టెండరింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఎక్కువ మంది కాంట్రాక్టర్లు పోటీ పడేలా నిబంధనలు రూపొందించి టెండర్లు పిలుస్తామన్నారు. తక్కువ ధరకు పనులు చేయడానికి ముందుకొచ్చిన కాంట్రాక్టర్లకు అప్పగించి తద్వారా ఆదా అయ్యే నిధులను ప్రజల కోసం వినియోగిస్తామని ప్రకటించారు. ప్రజాధనం ఆదా కావడానికి దోహదం చేసిన అధికారులు, నిపుణులను ప్రజల సమక్షంలో సన్మానిస్తామని చెప్పారు.

### నాలుగు నెలల్లోగా విచారణ పూర్తి కావాలి...

రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పోలవరాన్ని కేంద్రమే నిర్మించి అప్పగించాల్సి ఉండగా చంద్రబాబు కమీషన్ల కోసం ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి మరీ ప్రాజెక్టు బాధ్యతలను దక్కించుకున్నారని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. ప్రణాళికా రాహిత్యం, చిత్తశుద్ధి లోపం, కమీషన్ల దాహంతో పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టులో స్పిల్ వే, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ప్రధాన జలాశయం) రెండు భాగాలుగా నిర్మించాల్సి ఉంటుందన్నారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్ పూర్తి చేసిన తర్వాత.. గోదావరి వరద ప్రవాహాన్ని వాటి మీదుగా మళ్లించే ఏర్పాట్లు పూర్తయ్యాక ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ కట్టడానికి వీలుగా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు నిర్మించాలని చెప్పారు. అయితే చంద్రబాబు అధికారంలో ఉండగా స్పిల్ వేను పూర్తి చేయకుండా కాఫర్ డ్యామ్‌ల పనులను హడావుడిగా ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఎగువ కాఫర్ డ్యామ్ పనులు 80 శాతం మేర, దిగువ కాఫర్ డ్యామ్ పనులు 60 శాతం మేర పూర్తి చేశారని, కానీ గోదావరికి వరదలు వచ్చే సమయం ఆసన్నమవడంతో వాటిని మధ్యలోనే ఆపేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జూలై నుంచి అక్టోబర్ వరకు గోదావరికి భారీగా వరదలు రానున్నందున కాఫర్ డ్యామ్, స్పిల్ వే, స్పిల్ ఛానల్ మీదుగా మళ్లించాల్సి వస్తుందన్నారు. దీనివల్ల జూలై నుంచి అక్టోబర్ వరకూ నాలుగు నెలలపాటు పనులు చేయడానికి వీలు లేకుండా పోయిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ప్రణాళికతో పోలవరం పనులను చేపట్టి ఉంటే ఈ దుస్థితి దాపురించేది కాదన్నారు. పోలవరంలో చోటుచేసుకున్న అక్రమాలపై నాలుగు నెలల్లోగా విచారణ పూర్తి చేయాలని నిపుణుల కమిటీకి సూచించారు.

### అక్రమాలకు కేంద్ర బిందువుగా పోలవరం..

పోలవరం జలాశయం(హెడ్ వర్క్స్) పనులను ఈపీసీ విధానంలో రూ.4,054 కోట్లకు దక్కించుకున్న ట్రాన్స్‌ట్రాయ్(జేవీ) ఒప్పందం ప్రకారం 2018 మార్చి నాటికే పనులు పూర్తి చేయాల్సి ఉందని నిపుణుల కమిటీతో భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సత్తాలేని రాయపాటి సాంబశివరావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్‌కి పనులు ఎలా అప్పగిస్తారంటూ ప్రతిపక్షంలో ఉండగా విమర్శలు చేసిన చంద్రబాబు ఆయన టీడీపీలో చేరగానే మాట మార్చారని దుయ్యబట్టారు. పోలవరం పనులను దక్కించుకున్న మరుసటి రోజే హెడ్ వర్క్స్ అంచనా వ్యయాన్ని చంద్రబాబు రూ.5,385.91 కోట్లకు పెంచేసి అక్రమాలకు కేంద్ర బిందువుగా మార్చేశారని చెప్పారు. పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి 2018 ఫిబ్రవరి వరకు రూ.2,362.22 కోట్ల బిల్లులు చెల్లించి కమీషన్లు వసూలు చేసుకున్నారని మండిపడ్డారు. ట్రాన్స్‌ట్రాయ్‌తో ఈపీసీ ఒప్పందాన్ని రద్దు చేసుకోకుండా ఎల్ఎస్-ఓపెన్ విధానంలో మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. గేట్ల పనులను రూ.387.56 కోట్లకు బీకెమ్ సంస్థకు నామినేషన్‌పై అప్పగించారని చెప్పారు. ట్రాన్స్‌ట్రాయ్‌కి చెల్లించిన బిల్లులు, నామినేషన్ పద్ధతిలో అప్పగించిన పనుల విలువను పరిశీలిస్తే హెడ్ వర్క్స్ అంచనా వ్యయం రూ.5,825.15 కోట్లు అవుతుందన్నారు. సవరించిన అంచనా వ్యయం కంటే హెడ్ వర్క్స్ పనుల విలువ రూ.439.24 కోట్లు అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోందని 'సాక్షి' కథనాన్ని ప్రస్తావించారు.

### కాలువల్లోనూ అక్రమాల ప్రవాహం..

అక్రమాలు హెడ్‌వర్క్స్‌కే పరిమితం కాలేదని, పోలవరం కుడి కాలువ పనుల అంచనా వ్యయాన్ని రూ.2,240.86 కోట్ల నుంచి రూ.4,375.77 కోట్లకు, ఎడమ కాలువ పనులు రూ.1,954.74 కోట్ల నుంచి రూ.3,645.15 కోట్లకు పెంచుతూ 2016 డిసెంబర్ 6వతేదీన చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేయించారని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. అనంతరం ఎడమ కాలువలో ఎనిమిది ప్యాకేజీల కాంట్రాక్టర్లపై 60 సీ నిబంధన కింద వేటు వేసి కమీషన్లు చెల్లించేవారికి నామినేషన్‌పై పనులు అప్పగించారని చెప్పారు.

### వాస్తవాలు వెల్లడించండి..

అధికారులు నిపుణుల కమిటీకి సహకరించి పోలవరం ప్రాజెక్టులో అక్రమాలను బహిర్గతం చేయాలని ముఖ్యమంత్రి జగన్ కోరారు. 'అప్పట్లో చంద్రబాబు ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు ఆయన ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టారు. పోలవరం పనుల్లో చంద్రబాబు అక్రమాలకు సహకరించారు. కాంట్రాక్టర్ల నుంచి చంద్రబాబు భారీ ఎత్తున కమీషన్లు వసూలు చేసుకున్నారు. వాస్తవాలు చెప్పండి. మిమ్మల్ని (అధికారులను) రక్షించే పూచీ నాది. ప్రజాధనం ఆదా చేసిన వారిని ప్రజల సమక్షంలో సన్మానిస్తాం' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గత నాలుగేళ్ల పది నెలల వ్యవధిలో చంద్రబాబు పాలనలో సాగునీటి ప్రాజెక్టులపై చేసిన ఖర్చును సద్వినియోగం చేసుకుని ఉంటే ప్రాజెక్టులన్నీ పూర్తై కాలువల్లో నీళ్లు గలగలా పారుతుండేవని ముఖ్యమంత్రి చెప్పారు. చంద్రబాబు అక్రమాలకు పాల్పడటం వల్ల ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదన్నారు.

ఇదం జగత్



# జీవో నం.550 ప్రకారమే వైద్యసీట్ల భర్తీ

- రిజర్వుడ్ కేటగిరి అభ్యర్థులు ఓపెన్ కేటగిరీ సీటు వదులుకుంటే.. అదే రిజర్వుడ్ కేటగిరి అభ్యర్థికే ఆ సీటు
- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్ణయం
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే నిర్ణయమన్న అధికారులు



**సాక్షి, అమరావతి:** ఎంబీబీఎస్, దంతవైద్య సీట్ల భర్తీకి ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఏడాది జీవో నం.550 ప్రకారమే వైద్య సీట్ల భర్తీ జరుగుతుందని చెప్పింది. గతేడాది సీట్ల భర్తీలో గందరగోళం నెలకొన్న పరిస్థితి తెలిసిందే. జీవో నం.550ను సవాలు చేస్తూ ఒక వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడంతో జీవో నం.550ను కాదని వైద్యసీట్లు భర్తీచేశారు. దీంతో పలు సంఘాల నేతలు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎదుట నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. సకాలంలో కౌంటరు దాఖలు చేయకపోవడంతో అప్పటి సర్కారు తీవ్ర విమర్శలపాలైంది. సీట్ల భర్తీ విషయంలో ఎక్కడా చిన్న తేడా కూడా రాకూడదని ముందే ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో ఈ ఏడాది స్పష్టతతో ముందుకెళుతున్నట్టు అధికారులు చెప్పారు. గతంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.550ను విడుదల చేసింది.

**జీవో నం.550 ఏం చెబుతోందంటే..**

2001 జూలై 30న ఉన్నత విద్యాశాఖ ఈ జీవో జారీ చేసింది. దీని సారాంశం ఏమిటంటే..

- రిజర్వుడు కేటగిరీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఎవరైనా ఓపెన్ కేటగిరీలో సీటు పొంది.. దాన్ని వదిలేసుకుని తన (రిజర్వుడు) కేటగిరిలో మెరుగైన కళాశాలలో సీటు పొందొచ్చు. తొలుత ఓపెన్ కేటగిరిలో పొందిన సీటును ఖాళీ చేసినట్లయితే ఆ సీటును... ఆ అభ్యర్థి కేటగిరికి చెందినవారికి ఇవ్వాలనేది జీవో సారాంశం. ఉదాహరణకు వెంకట్ ఎస్సీ అభ్యర్థి. ఆయనకు ఓపెన్ కేటగిరిలో 3200 ర్యాంకుతో శ్రీకాకుళం రిమ్స్‌లో సీటు వచ్చింది. మలి దశ కేటగిరి కౌన్సెలింగ్‌లో గుంటూరు మెడికల్ కళాశాలలో సీటు వచ్చిందనుకుందాం. అప్పుడు వెంకట్ ఓపెన్ కేటగిరి సీటును వదులు కోవాలి. ఓపెన్ కేటగిరి కింద వెంకట్ పొందిన సీటును ఎస్సీ కేటగిరికి చెందిన అభ్యర్థితోనే నింపాలే తప్ప.. ఓపెన్ కేటగిరిలో తదుపరి 3201 మెరిట్ ర్యాంకు వచ్చిన అభ్యర్థికి ఇవ్వడానికి వీల్లేదు.
- గతేడాది దీన్ని సవాలు చేస్తూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. కాగా ఆ తర్వాత తిరిగి సర్కారు హైకోర్టులో కౌంటరు వేసింది. ఇటీవలే సుప్రీంకోర్టు సైతం జీవో నం.550నే అమలుచేయాలని సూచించింది. కాగా ఈ ఏడాది ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కోటా తొలిసారి వచ్చింది. 360 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. శ్రీకాకుళం రిమ్స్, అనంతపురం వైద్య కళాశాలలు మినహా అన్ని ప్రభుత్వ వైద్యకళాశాలల్లోనూ సీట్లు పెంచుతూ కేంద్రం నిర్ణయించింది.

**ప్రభుత్వం నుంచి స్పష్టత రావాలి**

ఈ ఏడాది నుంచి తొలిసారిగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఇప్పటికే దీనిపై సీట్లు పెరిగినట్టు మా దృష్టికొచ్చింది. ఈ వర్గాలకు కోటా అమలుపై ఇంకా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేస్తాం. ఇప్పటికే ఓపెన్ కేటగిరికి కౌన్సెలింగ్ నోటిఫికేషన్ ఇచ్చాం. ఈ నెల 28వ తేదీ వరకూ గడువుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జూలై ఒకటో తేదీ నుంచి నాలుగైదు రోజుల పాటు జరుగుతుంది. ఆ తర్వాత ఆప్షన్స్ ఇస్తాం. ఈ ఏడాది ఎంబీబీఎస్, దంతవైద్య, హోమియో, ఆయుర్వేద, యునాని సీట్లు కూడా మేమే భర్తీ చేస్తున్నాం.

– డా.శంబంగి అప్పలనాయుడు, రిజిస్ట్రార్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం.

## దిగొస్తున్న సిమెంట్ ధరలు

**ప్రస్తుతం 50 కేజీల బస్తా ధర రకాన్ని బట్టి రూ.290–రూ.355 మధ్య అమ్మకం**

**సాక్షి, అమరావతి:** సిమెంట్ ధరలు 15 రోజులుగా తగ్గుతూ వస్తున్నాయి. రాష్ట్రంలోని సిమెంట్ డీలర్లు బస్తాకు రూ.20నుంచి రూ.25 వరకు ధర తగ్గించారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్రాండ్, రకాన్ని బట్టి 50 కేజీల సిమెంట్ బస్తా రూ.290 నుంచి రూ.355కు విక్రయిస్తున్నారు. సిమెంట్ వినియోగం 20 శాతం తగ్గడంతో అమ్మకాలు నిలుపుకోవడం కోసం ధరలను తగ్గిస్తున్నట్టు డీలర్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి–మే నెలల మధ్య సిమెంట్ ధరలు భారీగా పెరిగాయి. ఇప్పుడు ఆ గరిష్ట స్థాయిని కాపాడుకోవడం కష్టంగా ఉందని, దీనికి తోడు వర్షాకాలం ప్రారంభం కావడం, ఇసుక సరఫరాపై నూతన ప్రభుత్వం తాత్కాలిక పరిమితులు విధించడంతో డిమాండ్ ఒక్కసారిగా తగ్గిందని ప్రధాన డీలర్ ఒకరు 'సాక్షి'కి వివరించారు. వర్షాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో మరో రెండు మూడు నెలల పాటు ధరలు ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వాస్తవానికి సిమెంట్ కంపెనీలేవీ ధరలు తగ్గించలేదని, అమ్మకాలు నిలుపుకోవడం కోసం తమ మార్జిన్లు తగ్గించుకుని విక్రయిస్తున్నట్టు మరో డీలరు తెలిపారు. మార్జిన్లు తగ్గించడం వల్ల కలిగిన నష్టాలను కంపెనీల దృష్టికి తీసుకెళ్లి ధరలు తగ్గించాల్సిందిగా కోరతామని డీలర్లు చెబుతున్నారు. ఏటా వర్షాకాలంలో ధరలు తగ్గడం సహజమని, అదేవిధంగా ఇప్పుడూ ధరలు తగ్గుతున్నాయని మేస్త్రీలు చెబుతున్నారు. ఇదిలావుంటే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ సిమెంట్ ధరలు గరిష్ట స్థాయిలోనే ఉన్నాయని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ ఆనంద్ రాఠీ తన నివేదికలో పేర్కొనడం గమనార్హం.

# టీటీడీ ప్రతిష్టను పెంచుతాం

- స్వామి ఆభరణాల విషయంలో అవకతవకలుంటే చర్యలే
- అర్చకుల వివాదాన్ని ఆగమ శాస్త్రానికి లోబడి పరిష్కరిస్తాం
- పీఠాధిపతుల సలహాలు స్వీకరిస్తాం
- వారం రోజుల్లో పూర్తిస్థాయి పాలక మండలి ఏర్పాటు
- నేటి నుంచే టీటీడీలో ప్రక్షాళన ప్రారంభం
- టీటీడీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారానంతరం వైవీ సుబ్బారెడ్డి



**టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వైవీ సుబ్బారెడ్డి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్**

తిరుమల

**తి**రుమల శ్రీవారి ఆలయానికి సంబంధించి ఆగమ శాస్త్రాలు, సంప్రదాయాలు, నియమాలను గౌరవిస్తూ టీటీడీ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచుతామని తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. టీటీడీ మీద వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ ఉంటుందని ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం 50వ చైర్మన్‌గా శనివారం ప్రమాణ స్వీకారానంతరం మీడియాకు తెలిపారు. వారం రోజుల్లో పూర్తిస్థాయి పాలక మండలి ఏర్పాటవుతుందన్నారు. అంతకుముందు.. శ్రీవారి ఆలయంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కొత్త చైర్మన్‌తో ఉదయం 11.47గంటలకు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించిన వైవీ సుబ్బారెడ్డి.. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. తులాభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

**సామాన్య భక్తులకూ ప్రాధాన్యత..**

కలియుగ దైవం కృపవల్ల సీఎం వైఎస్ జగన్ ఈ బాధ్యతను తనకు అప్పగించినందుకు ముఖ్యమంత్రికి వైవీ సుబ్బారెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అందరినీ కలుపుకుని సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ వారికి మెరుగైన సేవలు అందించమని సీఎం చేసిన సూచనలను పాటిస్తానన్నారు. ఇక్కడ ప్రతి పైసా పేద ప్రజలది, భక్తులదని.. అలాంటిది ప్రతిపైసా స్వామి సేవకే వెచ్చిస్తామన్నారు. తిరుమల నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తానని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అర్చకుల వయోపరిమితిపై పీఠాధిపతుల సలహాలు తీసుకుని బోర్డులో చర్చించి చివరిగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. స్వామివారి ఆభరణాల విషయంలో వస్తున్న ఆరోపణల్లో వాస్తవం ఉందని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఆలయ ప్రతిష్టను దేశ విదేశాలకు విస్తరించేలా, ప్రభుత్వ ప్రతిష్టను పెంపొందించేలా వైవీ సుబ్బారెడ్డికి శక్తినివ్వాలని కోరుతూ శ్రీవారిని ప్రార్థించానన్నారు. వైవీని టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమించడం హర్షించదగ్గ విషయమని డెప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు.

## బాలికపై గ్యాంగ్ రేప్

- నాలుగు రోజులపాటు ఆరుగురు యువకుల లైంగిక దాడి
- ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

**ఒంగోలు:** ఇల్లొదిలి వచ్చిన ఓ బాలికను ట్రాప్ చేశాడో యువకుడు. మాయమాటలు చెప్పి ఆమెను ఒక గదిలో నిర్బంధించాడు. అతడితోపాటు మరో ఐదుగురు యువకులు ఆమెపై నాలుగు రోజులపాటు లైంగిక దాడికి పాల్పడ్డారు. శనివారం అనుమానాస్పద స్థితిలో కనిపించిన బాలికను ఒంగో లు పోలీసులు గుర్తించి.. ఆరా తీయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నగరానికి చెందిన ఓ బాలిక తన తాతకు అనా రోగ్యంగా ఉండటంతో అతనికి సాయంగా అక్కడి ఆస్పత్రిలో ఉంది. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన రాము అనే టాక్సీ డ్రైవర్ అనారోగ్యంతో ఉన్న ఓ వ్యక్తిని అదే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంలో ఆ డ్రైవర్ బాలికతో మాట లు కలిపాడు. ఆ పరిచయంతో ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకోవడం ప్రారం భించారు. ఈ విషయం తల్లికి తెలియడంతో కూతుర్ని ఇటీవల మందలిం చింది. దీంతో ఆగ్రహించిన బాలిక ఇల్లు వదిలిపెట్టి ఒంగోలుకు పయనమైంది. బస్టాండ్‌కు చేరుకుని టాక్సీ డ్రైవర్ కోసం వాకబు చేసింది. బస్టాండ్‌లోని ఒక చిరు దుకాణంలో పనిచేసే యువకుడు ఇదంతా గమనించాడు. ఆ బాలికతో మాటలు కలిపాడు. ఆమె సెల్‌ఫోన్ చార్జింగ్ అయిపోవడంతో ఆ యువకుడి షాపులోనే చార్జింగ్ పెట్టుకుంది. ఈ క్రమంలో అతను బాలికకు మాయ మాటలు చెప్పాడు. టాక్సీ డ్రైవర్ ఆచూకీ లభించేంత వరకు తాను ఆశ్రయం కల్పిస్తానని నమ్మించడంతో అతని వెంట నడిచింది. నగరంలోని రద్దీ ప్రాంతంలో గల ఒక రూమ్‌కు బాలికను తీసుకెళ్లిన ఆ యువకుడు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టడంతో పాటు మరో ఐదుగుర్ని ఆమెపై వరుస లైంగిక దాడులకు పురిగొల్పాడు. చివరకు శనివారం ఒంగోలు బస్టాండ్‌లో వదిలిపెట్టి వెళ్లిపోయారు. పోలీసులు విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. నిందితులలో ఇరువురు ఇంటర్మీడియెట్ చదివిన యువకులు ఉన్నట్టు తెలుస్తుండగా.. మరో నలుగురు యువకులు ఇంజనీరింగ్ విద్యార్థులని ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రకాశం జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ మాట్లాడుతూ ఇప్పటికే తమ సిబ్బందిని రంగంలోకి దించామని, ఆరుగురు నిందితులను గుర్తించామన్నారు.ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

## వీఎంసీ చివరి సమావేశం రసాభాస

- ఎన్టీఆర్ చిత్రపటం తొలగింపుపై మేయర్ ఆగ్రహం
- వైఎస్సార్ చిత్రపటం ఏర్పాటు చేయాలని డిమాండ్
- ఇరు పక్షాల మధ్య వాగ్వివాదం
- నెలాఖరులోగా వైఎస్సార్ చిత్రపటం ఏర్పాటు చేస్తామని హామీ



**అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం**

**విజయవాడ:** విజయవాడ నగర పాలక సంస్థ ఆఖరి కౌన్సిల్ సమావేశం రసాభాసగా ముగిసింది. ఎన్టీఆర్ చిత్రపటం తొలగింపుపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేయగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం ఏర్పాటు చేయాలని కౌన్సిల్‌లో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సభ్యులు పట్టుబట్టారు. 2014 జూలై 2న కొలువు దీరిన కౌన్సిల్ ఇప్పటివరకు 30 సర్వసభ్య సమావేశాలు నిర్వహించింది. శనివారం మేయర్ కోనేరు శ్రీధర్ అధ్యక్షతన 150 అంశాలతో ఉన్న ఎజెండాపై సమావేశంలో చర్చ జరిగింది. తొలుత కౌన్సిల్ హాల్‌లో ఉన్న ఎన్టీఆర్ చిత్రపటం తొలగింపుపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన చిత్రపటాన్ని తిరిగి వెంటనే ఏర్పాటు చేయాలని మేయర్ ఆదేశించారు. ఎన్టీఆర్ చిత్రపటం ఏర్పాటు చేస్తే దివంగత వైఎస్సార్ చిత్రపటం కూడా ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ సభ్యులు పట్టుబట్టారు. దీనిపై ఇరుపక్షాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ నెలాఖరులోగా వైఎస్సార్ చిత్రపటం ఏర్పాటు చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు. మేయర్ వైఖరిపై టీడీపీలోని కార్పొరేటర్లు ముప్పా వెంకటేశ్వరరావు, ఏదుపాటి రామయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాటు మేయర్ టీడీపీ కార్పొరేటర్లను గౌరవించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత పథకం కింద విజయవాడలో నిర్మిస్తున్న స్ట్రాం వాటర్ డ్రెయిన్ పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా ఉన్నాయని సభ్యులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

**ఎక్స్‌అఫీషియో సభ్యులుగా మంత్రులు ప్రమాణ స్వీకారం..**

అంతకుముందు వీఎంసీ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో మేయర్ ప్రమాణ స్వీకారం చేయించారు. నగర పాలక సంస్థ అభివృద్ధికి కృషిచేస్తామని, వీఎంసీలోని సమస్యల జాబితా, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, బకాయిల వివరాలు తమకు ఇస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## చట్టసభల్లో రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం

- ఓబీసీ రిజర్వేషన్లపై రాజ్యసభలో వైఎస్సార్ సీపీ ప్రైవేట్ బిల్లుపై హర్షామోదాలు
- దేశంలో 2,400 ఓబీసీ కులాలుండగా.. 2,200 కులాలకు ప్రాతినిధ్యమే లేదు

**సాక్షి, అమరావతి:** చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ అంశంపై రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ తరపున ఎంపీ వి.విజయసాయిరెడ్డి ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టగా.. దీనికి 10 పార్టీలు మద్దతు పలుకుతూ చర్చలో పాల్గొన్న విషయం తెలిసిందే. లోక్‌సభ, శాసనసభల్లో జనాభా దామాషా ప్రకారం ఓబీసీలకు ప్రాతినిధ్యం కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లు–2018ని ఆమోదించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో మొదటినుంచీ పట్టుపడుతూ వస్తున్నారు. దేశంలో 2,400 ఓబీసీ కులాలు ఉంటే 2,200 కులాలకు పార్లమెంట్ ఉభయ సభలు, శాసనసభల్లో ప్రాతినిధ్యం లభించడం లేదనే విషయాన్ని రాజ్యసభలో శుక్రవారం ఆయన ఎత్తిచూపారు. ఓబీసీ రిజర్వేషన్ల అంశంపై పలువురు నేతలు ఏమన్నారంటే..

**ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి**

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై వైఎస్సార్‌సీపీకి చిత్తశుద్ధి ఉంది. దీనిపై రెండేళ్ల క్రితం ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టారు. అది శుక్రవారం చర్చకు వచ్చింది. పది పార్టీల నేతలు దీనిపై చర్చించి సానుకూలత వ్యక్తం చేశారు. ఉభయ సభలు తప్పకుండా ఓబీసీ బిల్లును ఆమోదించి రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలి.

– హెచ్‌డీ నర్సేగౌడ, మాజీ మంత్రి

**ఓబీసీ బిల్లును ఆమోదించాలి**



చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగ సవరణ ద్వారా అమలు చేయాలని కోరుతూ 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. ఆ తరువాత 2010లో కూడా ఈ డిమాండ్‌ను కేంద్రం ముందుంచింది. 2014 జూన్ 15న తెలంగాణ రాష్ట్రం సైతం మరో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఓబీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఉన్నాయి. జనాభాలో సగభాగం బీసీలు ఉన్నారు. కాబట్టి ఓబీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి.

– ఆర్ కృష్ణయ్య, జాతీయ అధ్యక్షుడు, బీసీ సంఘం

**బీసీలకు వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యత ఇచ్చింది**



చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోయినా వైఎస్సార్‌సీపీ బీసీలకు పెద్దపీట వేసింది. ఉప ముఖ్యమంత్రి పదవులను సైతం బీసీలకు ఇచ్చింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏలూరులో జరిగిన బీసీ గర్జనలో బీసీలకు పెద్దపీట వేస్తామని ప్రకటించి ఆచరణలోకి తీసుకువచ్చారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేస్తే బీసీలకు మరింత పటిష్టంగా రాజకీయ రిజర్వేషన్లు అమలవుతాయి.

– జంగా కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

## నలుగురు ఎంపీలది ఫిరాయింపే

- మా ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం అమలు చేయాల్సిందే
- టీడీపీ నాయకుల సమావేశంలో కళా వెంకట్రావు
- గంటాను ప్రత్యేకంగా సమావేశానికి పిలిచిన నేతలు

**సాక్షి, అమరావతి:** నలుగురు టీడీపీ రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరడం ఫిరాయింపేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు తెలిపారు. తాజా రాజకీయ పరిణామాలపై ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో శనివారం ఆయన అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యసభలో మెజారిటీ కోసమే బీజేపీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ప్రజావేదికలో చంద్రబాబుకు సంబంధించిన వ్యక్తిగత సామగ్రిని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బయట పెట్టడం సరికాదన్నారు. ప్రతిపక్ష నేతగా ఉండవల్లిలోని ప్రజావేదికను వాడుకునేందుకు తనకు కేటాయించాలని చంద్రబాబు లేఖ రాశారని, దీనిపై సమాధానం ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం కక్ష సాధింపేనని విమర్శించారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ నలుగురు ఎంపీల విలీనం అనైతికం, అప్రజాస్వామికమేనన్నారు. దీనిపై న్యాయ పోరాటానికి సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. నీతివంతమైన పాలన అందిస్తామని చెప్పిన బీజేపీ.. టీడీపీ ఎంపీలను చేర్చుకోవడం తప్పేనని మాజీ మంత్రి దేవినేని ఉమా తప్పుబట్టారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రుణమాఫీ మిగిలిన విడతలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేయాలని యనమల పేర్కొన్నారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలు నెరవేరుస్తూనే గత ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. ఇదిలా ఉండగా బీజేపీలోకి వెళతారని ప్రచారం జరగుతుండడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఈ సమావేశానికి ప్రత్యేకంగా పిలిచారు. కొందరు నేతలు పార్టీ మార్పు గురించి అడగ్గా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదని సమాచారం. చంద్రబాబుతో మాట్లాడాలని, టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడాలని చెప్పినా తాను వ్యక్తిగతంగా మాట్లాడతానని చెప్పి వెళ్లిపోయినట్లు తెలిసింది. మీడియాతో కూడా మాట్లాడకుండా వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. సమావేశంలో ఎమ్మెల్యేలు మద్దాలి గిరి, ఎమ్మెల్సీలు, వీవీవీ చౌదరి, బాబూ రాజేంద్రప్రసాద్, అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు పెందుర్తి వెంకటేశ్, శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

**చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**

ఇదిలా ఉండగా తాజా రాజకీయ పరిణామాలపై విదేశీ పర్యటనలో ఉన్న చంద్రబాబు పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజావేదికను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం సరికాదని ప్రచారం చేయాలని, దీనిపై నేతలందరూ మీడియా సమావేశాలు పెట్టాలని ఆయన సూచించినట్లు తెలిసింది.

**ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ ఓవర్ యాక్షన్**

ఉండవల్లిలోని కృష్ణా నది కరకట్ట దిగువన ఉన్న ప్రజావేదిక వద్ద టీడీపీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ కాసేపు ఓవర్ యాక్షన్ చేశారు. కలెక్టర్ల సమావేశం నిమిత్తం ప్రజావేదికలో ఏర్పాట్లు చేస్తుండగా అక్కడకు వచ్చిన రాజేంద్రప్రసాద్.. చంద్రబాబు సామాన్లు, టీడీపీ కార్యాలయం నమూనాను ఎవరు బయట పెట్టారని అధికారులను ప్రశ్నించారు. తమ అనుమతి లేకుండా వస్తువులు ఎలా బయటపెడతారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తాము నిబంధనల ప్రకారమే విధులు నిర్వహిస్తున్నామని అధికారులు సమాధానం చెప్పారు. గతంలో కలెక్టర్ల సమావేశం ప్రజావేదికలో జరిగేదని, ఇప్పుడు కూడా అలానే ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్పుకొచ్చారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజావేదికలో కలెక్టర్ల సమావేశం పెడితే ఇబ్బందవుతుందని తెలిపారు. ఇక్కడ రోడ్లు, స్థలం ఇరుకుగా ఉంటాయన్నారు. చంద్రబాబు కట్టిన ప్రజావేదికలోనే కలెక్టర్ల సమావేశం పెట్టాలా.. వేరే చోట పెట్టుకోకూడదా అని ప్రశ్నించారు. ఒకప్పుడు ప్రజావేదిక జర్నలిస్ట్‌లకు షెల్టర్‌గా ఉండేదని చెప్పగానే, విలేకరులు ఆయన మాటలకు అడ్డుపడుతూ.. తమని ఎన్నడూ ప్రజా వేదికలోకి రానివ్వలేదన్నారు.

## నున్నలో గ్యాస్ పైపు లైన్ లీక్

**నున్న (విజయవాడ రూరల్):** విజయవాడ సమీపంలోని నున్న గ్రామంలో పైప్‌లైన్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) లీకైన ఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గృహాలకు నేరుగా పైపుల ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు గెయిల్ సంస్థకు చెందిన పీఎన్‌జీ పైపు లైన్ నున్న గ్రామం మీదుగా వేశారు. ఆ ప్రాంతంలో ఓ వ్యక్తి తన స్థలంలోని ముళ్ల చెట్లు, పొదలను జేసీబీ సాయంతో శనివారం తొలగిస్తుండగా గ్యాస్ పైపులైన్‌కు తగిలింది. దీంతో పెద్ద శబ్దంతో పగిలిపోయి మంటలు రేగాయి. ఏమి జరిగిందో తెలియక సమీపంలోని గృహస్తులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న సింగ్ నగర్ అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను నియంత్రించారు. సంబంధిత గెయిల్ సంస్థ మేనేజర్ రామకృష్ణకు సమాచారం అందించగా ఆయన తమ సిబ్బందితో విరిగిన పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office: Rajendranagar: Hyderabad-30, Telangana State, India
Advt. No.8588/AGRICET/2019 Date: 23-06-2019
AGRICET & AGRIENGGCET - 2019
NOTIFICATION
Online applications are invited from Diploma holders in Agriculture / Seed Technology for admission into First year B.Sc. (Hons.) Agriculture Degree Programme and Diploma holders in Agricultural Engineering for admission into First Year B.Tech (Ag. Engg) Degree Programme for the academic year 2019-20 through AGRICET & AGRIENGGCET - 2019 Entrance Tests, respectively. For further details, please visit the website www.pjtsau.edu.in
Dr. S.SUDHEER KUMAR, REGISTRAR.

MBBS
Ministry Of Health Of Russia
SMOLENSK STATE MEDICAL UNIVERSITY
Invites Indian students for direct Government Admissions
Recognized by India, WHO, USA & UK, Min. Qual.-50% in XII in PCB
UNIVERSITY- Founded in 1920, Very high standards of education, English Medium in all years, 1250 Indian students (460 Girls) studying, 101 got degree in 2019. Closed campus, 8 hospitals (6000 Beds). MCI SCREENING TEST- Our graduates of 2008 to 2018 have given BEST results among graduates of all foreign medical colleges (Official web sites of Indian Embassy, Moscow and NBE, New Delhi who conducts Screening Test confirm this).
HOSTELS- 2 and 4 seated big rooms, separate blocks for boys and girls.
INDIAN MESS - Mess with Indian food cooked by Indian cooks.
Fee (Tuition+Hostel+Med.Ins.) - USD 6500/year (App. Rs. 4,50,000/-)
(25% subsidy available if full fee of 6 years paid in 1st year)
and one time payment of Rs.1,50,000/- (By Bank Draft only) which includes – Admission, student visa fee, air ticket Delhi - Moscow.
Bank loans are available. Scholarship for topper students.
Contact: Dr. Aeron, Tel: Russia +79605805555
Official Internet Site:www.sgmu.info
Information Center in A.P. (Parents of Students)
Mrs. M. Sujatha Naidu - 9491772471

|| JAI SRI GURUDEV ||
Sri Adichunchanagiri Shikshana Trust (R)
ADMISSIONS FOR BAMS
Eligibility: NEET-General Merit-134 & above
OBC, SC & ST - 107 above & 12th Std/PUC-II-PCB - 50%
SRI KALABYRAVESHWARASWAMY AYURVEDIC Medical College, Hospital & Research Centre
(Recognised by Govt of India & Affililated to RGUHS, Banglore)
No.10, Pipeline Road, RPC Layout, Vijayanagar,Banglore-560104
Admissions For PG :Shalya, Shalakya, Prasuti & Stri Roga Kayachikitsa & Panchakarma - Eligibility 50th Percentile (AIAPGET)
PhD: Kayachikitsa & Panchakarma - Eligibility - RGUHS Entrance Test
Ph: 080-23407806; 9845109556, 9449831620
Website: www.skamc.org E-mail: skamcbangalore@gmail.com
ADICHUNCHANAGIRI AYURVEDIC MEDICAL COLLEGE, HOSPITAL & RESEARCH CENTRE
(Recognised by Government of India & Affiliated to RGUHS, Bangalore)
Survey No. 112, Nagaruru, Nelamangala, Bengaluru - 562123
Ph: 9886414563; 7022842650, 9449831620
Website: www.amc.org.in E-mail: principal@amc.org.in



ప్రపంచంలోనే పురాతనమైన ఐస్‌ల్యాండ్ పార్లమెంటు 930వ సంవత్సరంలో జూన్ 23న ప్రారంభించారు.



# ఎవరెస్ట్‌పై వాతావరణ కేంద్రాలు..



ప్రపంచంలోనే అతి ఎత్తయిన ఎవరెస్ట్ పర్వతంపై అత్యాధునిక వాతావరణ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ వీటిని నెలకొల్పింది. ఈ కేంద్రాలు ఎవరెస్ట్ ప్రాంతంలో వాతావరణం ఎలా ఉందన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తాయని, ఇది పర్వతారోహకులు, పరిశోధకులు, స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, పర్వతారోహణలో ప్రమాదాల నివారణకు ఉపయోగపడుతుందని జియోగ్రాఫిక్ సొసైటీ డైరెక్టర్ ఫయి జంక్స్ తెలిపారు. ఎవరెస్ట్‌పై సముద్ర మట్టం నుంచి 8,430 మీటర్ల ఎత్తులోని బాల్కనీ ప్రాంతంలో ఒక వాతావరణ కేంద్రాన్ని, 7,945 మీటర్ల ఎత్తులో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పోర్ట్‌సే (3,810 మీ.), ఎవరెస్ట్ బేస్ క్యాంప్ (5,315 మీ.), క్యాంప్–2 (6,464మీ.)లలో కూడా వాతావరణ కేంద్రాలు నెలకొల్పారు. ఈ కేంద్రాలు ఎవరెస్ట్ ఉష్ణోగ్రత, అక్కడి తేమ, వాతావరణ ఒత్తిడి, గాలి వేగం, గాలి దిశలకు సంబంధించి సమాచారాన్ని అందిస్తాయి. బాల్కనీ కేంద్రం ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వాతావరణ కేంద్రంగా రికార్డులోకెక్కనుంది.

# డబ్బులుంటే ఇచ్చేస్తారట

పర్సు పోయిందనుకోండి.. అందులో డబ్బు ఉంటే ఎవరైనా ఏం చేస్తారు.. ఆ డబ్బులు తీసుకుని పర్స్ పడేస్తారు. ఒకవేళ డబ్బులేమీ లేకపోతే.. ఆ ఏముంది.. 'బ్రదర్ మీ పర్సు కింద పడింది.. తీసుకోండి అని తిరిగిచ్చేస్తారు'అంతే కదా.. మీరనుకునేది. పర్సులో డబ్బు ఎంత ఎక్కువ ఉంటే నిజాయితీ అంత తక్కువ ఉంటుందని మనం అనుకుంటాం. కానీ అది నిజం కాదట. పోగొట్టుకున్న పర్సులో ఎంత ఎక్కువ డబ్బు ఉంటే అంత నిజాయితీ ఉంటుందట. దాదాపు 40 దేశాల్లో 355 నగరాల్లో జరిపిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. డబ్బులకు, మానవ సైకాలజీకి మధ్య సంబంధం గురించి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్‌కు చెందిన పరిశోధకులు అధ్యయనం చేశారు. వీరితో పాటు యూనివర్సిటీ ఆఫ్ జురిచ్, యూనివర్సిటీ ఆఫ్ ఉతాకు చెందిన పరిశోధకులు కూడా పాల్గొన్నారు. నిజాయితీగా ఉన్న దేశాల్లో స్విట్జర్లాండ్, నార్వే టాప్‌లో ఉండగా, పెరూ, మొరాకో, చైనా చివరి స్థానంలో ఉన్నాయి. ఈ అన్ని దేశాల్లో మాత్రం ఒకే విషయం కామన్‌గా ఉందట. అదేంటంటే డబ్బులు ఎక్కువగా ఉంటే ఆ పర్స్‌ను తిరిగి ఇచ్చేస్తారని తేలిందట. సాధారణంగా ఎవరైనా పర్స్ పోగొట్టుకుంటే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 శాతం మంది తిరిగి ఇస్తారట. అయితే అందులో డబ్బులు ఉంటే మాత్రం 51 శాతం మంది పర్స్ తిరిగిచ్చేస్తున్నారట. ఈ పరిశోధన నిర్వహించేందుకు చాలా డబ్బు వెచ్చించారట. బ్యాంకులు, థియేటర్లు, మ్యూజియంలు, పోస్ట్ ఆఫీస్‌లు, హోటల్స్, పోలీస్ స్టేషన్స్, కోర్టులు తదితర 17 వేలకు పైగా ప్రాంతాల్లో దాదాపు డబ్బులను పర్సులో పెట్టి జారవిడిచారట. అందుకోసం దాదాపు రూ.4 కోట్లకు పైగా డబ్బు వెచ్చించారట. అయితే చాలా మంది అందులో డబ్బు ఎక్కువగా ఉందని తిరిగిచ్చారట. అదండీ విషయం.. డబ్బు అందరినీ చెడ్డవారిని చేయదండోయ్!



# అవినీతిపై రాజీలేని పోరు



శనివారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఇంజనీరింగ్ నిపుణుల కమిటీ సభ్యులతో సమావేశమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> వంద రూపాయల వస్తువు రూ.80కే వస్తుందంటే.. రూ.80కే కొంటామా? లేక రూ.వందకు కొంటామా? కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన చంద్రబాబు సర్కార్ మాత్రం రూ.వందకే కొనుగోలు చేసింది.

> రాజధానిలో తాత్కాలిక సచివాలయం నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.పది వేలు ఖర్చు చేశారు. ఇటీవల మరమ్మతుల కోసం గోడలను పరిశీలిస్తే ఒక్క ఇటుక కూడా కనిపించ లేదు. ప్లైవుడ్‌తో గోడలు కట్టారు.

**చంద్రబాబు అక్రమార్జన కోసం అవినీతిని వ్యవస్థీకృతం చేశారు**
**అత్యంత పారదర్శకత తీసుకురావాలన్నదే నా తపన**
**చెడిపోయిన వ్యవస్థను బాగు చేయకపోతే రాష్ట్రం భవిష్యత్ అధోగతే**
**నిపుణుల కమిటీ సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలో చంద్రబాబు వ్యవస్థీకృతం చేసిన అవినీతిని కూకటి వేళ్లతో పెకలించడమే లక్ష్యంగా పోరాటం ప్రారంభించానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నంత అవినీతి దేశంలో మరెక్కడా ఉండదని ఢిల్లీలో చర్చ జరుగుతోందన్నారు. దేశంలో అత్యంత అవినీతి సీఎంగా చంద్రబాబు పేరు తెచ్చుకున్నారని, ఆయన తీరు వల్లే జాతీయ స్థాయిలో రాష్ట్ర పరువు, ప్రతిష్టలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను కూడా కళ్లు మూసుకుంటే రాష్ట్రం భవిష్యత్ అధోగతిపాలవుతుందన్నారు. దేశంలోనే అత్యున్నత పారదర్శక విధానాలకు ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంగా మార్చే వరకు విశ్రమించే ప్రశ్నే లేదని తెగేసి చెప్పారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ పనుల్లో అక్రమాలపై విచారణ చేయడానికి ప్రభుత్వం ఈనెల 14న నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ కమిటీ సభ్యులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదటిసారి సమావేశమయ్యారు. నిపుణుల కమిటీ ఏర్పాటు చేయడానికి దారితీసిన పరిస్థితులను వివరించారు. రాష్ట్రంలో 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక.. అక్రమార్జన కోసం అవినీతిని వ్యవస్థీకృతం చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో అప్పటి వరకు పని చేస్తున్న కాంట్రాక్టర్లపై 60సీ నిబంధన కింద వేటు వేయడం.. మిగిలిపోయిన పని అంచనా వ్యయాన్ని అమాంతం పెంచేయడం.. కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లకు కుదిరితే నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడం, కుదరకపోతే టైలర్ మేడ్ నిబంధనలతో టెండర్ నిర్వహించి అప్పగించడం.. అవసరం లేకపోయినా జీవో 22, జీవో 63 ద్వారా అదనపు నిధులు దోచిపెట్టడం ద్వారా చంద్రబాబు భారీ ఎత్తున దోచుకున్నారని, ఈ దోపిడీ వల్ల రాష్ట్ర ఖజానా అతలాకుతలమైందని వివరించారు.

### ప్రజా ధనాన్ని మిగిల్చే అధికారులకు సన్మానం

చెడిపోయిన వ్యవస్థను బాగు చేయడానికి తాను సిద్ధమైతే, అవినీతిని పట్టించుకోకుండా కళ్లు మూసుకోవాలని కొందరు తనకు ఉచిత సలహాలు ఇచ్చారని సీఎం వైఎస్ జగన్ వివరించారు. ఈ వ్యవస్థలో మార్పు తీసుకురాకపోతే రాష్ట్రానికి భవిష్యత్ ఉండదని, అందుకే అత్యంత పారదర్శకత కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. 'కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన చంద్రబాబు భారీ ఎత్తున కమీషన్లు దండుకుని.. అంచనా వ్యయాన్ని పెంచాలని ఒత్తిడి చేస్తే అధికారులు ఏం చేస్తారు.. ఆ ఒత్తిళ్లకు తలొగ్గి అంచనా వ్యయాన్ని పెంచేశారు.. ప్రజాధనాన్ని ఒకరు దోచేస్తే ఆ తప్పు అధికారులపై పడుతోంది' అని చెప్పారు. ఉన్నత స్థానంలో ఉన్న వారు నిజాయితీగా ఉంటే దిగువ స్థాయిలో ఉన్న వారు కూడా అలాగే ఉంటారని అభిప్రాయపడ్డారు. అవినీతిని నిర్మూలించడం కోసం తాము కృత నిశ్చయంతో పని చేస్తున్నామని, ఇదే అంశాన్ని కార్యదర్శుల నుంచి విభాగాల అధిపతుల(హెచ్‌వోడీ) వరకూ స్పష్టం చేశానని.. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలూ తప్పవని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ ఒత్తిడి వల్ల అంచనా వ్యయం పెంచేసి.. ఖజానాకు జరిగిన నష్టాన్ని బయటపెట్టి.. ప్రజాధనాన్ని మిగిల్చే అధికారులకు ప్రజల సమక్షంలో ఘనంగా సన్మానం చేస్తామని పునరుద్ఘాటించారు.

### కళ్లు.. చెవులూ మీరే..

చెడిపోయిన వ్యవస్థను బాగు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం కోసం అనేక తర్జనభర్జనలు పడ్డామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. 'విభిన్న రంగాల్లో అత్యంత నిష్ణాతులు, నిజాయితీపరులు, నిబద్ధత కలిగిన వారైన మీ ఏడుగురిని నిపుణుల కమిటీకి ఎంపిక చేశాం. మా ప్రభుత్వ కళ్లూ, చెవులూ మీరే. నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ చేయండి. ఏ ప్రాజెక్టులు అవసరమో.. ఏవి అనవసరమో తేల్చి చెప్పండి.. రివర్స్ టెండరింగ్ నిర్వహించాల్సిన ప్రాజెక్టులు ఏవో సూచించండి.. విచారణకు అవసరమైన సాంకేతిక, మానవ వనరులు.. ఇతరత్రా అన్ని వసతులు సమకూర్చుతాం' అంటూ నిపుణుల కమిటీకి దిశానిర్దేశం చేశారు. అత్యంత ప్రధానమైన ప్రాజెక్టులకు విచారణ పేరుతో ఆటంకం కలిగించకూడదన్నారు. సాగునీటి ప్రాజెక్టులే కాదు.. పీఎంఏవై పథకం కింద పట్టణ పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు మొదలు.. రాజధాని వరకు చంద్రబాబు భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని వివరించారు. పట్టణ పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్రం వాటా రూ.1.50 లక్షలు.. వెరసి రూ.మూడు లక్షలతో ఇళ్లు నిర్మించి ఇవ్వవచ్చని చెప్పారు. ఇసుక, భూమి ఉచితంగా ఇస్తున్న నేపథ్యంలో చదరపు అడుగు రూ.1,100కే నిర్మించి ఇవ్వవచ్చని, అయితే కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన చంద్రబాబు చదరపు అడుగు రూ.2,200 చొప్పున పనులు కట్టబెట్టడం వల్ల పేదలపై భారం పడిందన్నారు. ఉచితంగా రావాల్సిన ఇంటికి ఒక్కో లబ్ధిదారుడు నెలనెలా రూ.మూడు వేల చొప్పున బ్యాంకుకు కిస్తులు కట్టాల్సిన దుస్థితిని కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టులకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించేందుకు నమూనా టెండర్ డాక్యుమెంట్‌ను రూపొందించి ఇవ్వాలని కోరారు.

> అత్యంత పారదర్శకంగా నిర్వహించిన టెండర్లపై ఎవరైనా ఆరోపణలు చేసినా, అసత్య కథనాలు ప్రచురించినా పరువు నష్టం దావా వేస్తాం. జ్యుడిషియల్ కమిషన్‌కు సాంకేతిక సలహాలు అందించడం కోసం నిపుణుల కమిటి సేవలు వినియోగించుకుంటాం. ప్రతి 15 రోజులకు ఒకసారి మీతో భేటీ అవుతా. విచారణ పురోగతిని సమీక్షించి ఏవైనా సమస్యలుంటే అప్పటికప్పుడు పరిష్కరిస్తా.

### జ్యుడిషియల్ కమిషన్ నేతృత్వంలో టెండర్లు

విచారణ అనంతరం రివర్స్ టెండరింగ్ చేయాల్సిన ప్రాజెక్టులను సూచిస్తే, వాటి అంచనా వ్యయాన్ని అలానే ఉంచి.. ఎక్కువ మంది కాంట్రాక్టర్లు పోటీ పడేలా నిబంధనలు సడలించి టెండర్ నోటిఫికేషన్ జారీ చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల ప్రజాధనం ఎంత ఆదా అయిందో ప్రజలకు వివరిస్తామన్నారు. ఇందుకు కారణమైన నిపుణులు, అధికారులకు ప్రజల సమక్షంలో సన్మానం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొత్తగా భారీ ఎత్తున ప్రాజెక్టులు.. మౌలిక సదుపాయాల కల్పన పనులు తదితరాలు చేపడతామని.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వంటి ప్రసారమాధ్యమాలు లేనిపోని ఆరోపణలు చేయడానికి సిద్ధంగా ఉంటాయన్నారు. రాష్ట్రంలో నిర్వీర్యమైన టెండర్ల వ్యవస్థకు జీవం పోసేందుకు జ్యుడిషియల్ కమిషన్ నేతృత్వంలో టెండర్లు నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. ఇప్పటికే హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కలిసి ఇందుకోసం జడ్జిని కేటాయించాలని కోరామని గుర్తు చేశారు. రూ.వంద కోట్ల కంటే ఎక్కువ విలువైన పనుల టెండర్ డాక్యుమెంట్‌ను జ్యుడిషియల్ కమిషన్‌కు పంపుతామని.. దాన్ని ఏడు రోజులపాటు పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని.. ప్రజలు చేసే సూచనల ఆధారంగా టెండర్ డాక్యుమెంట్‌లో జ్యుడిషియల్ కమిషన్ మార్పులు చేర్పులు చేసి ఎనిమిది రోజుల్లోగా సర్కార్‌కు అందిస్తుందని చెప్పారు. జ్యుడిషియల్ కమిషన్ ఖరారు చేసిన డాక్యుమెంట్‌తోనే టెండర్లు నిర్వహిస్తామని, దీని వల్ల అక్రమాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిపుణుల కమిటీ సభ్యులు రిటైర్డు ఈఎన్సీలు ఎల్.నారాయణరెడ్డి, అబ్దుల్ బషీర్, స్ట్రక్చరల్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు పి.సూర్యప్రకాశ్, రిటైర్డు ఈఎన్సీ సుబ్బరాయశర్మ (రహదారులు, భవనాల శాఖ), రిటైర్డు ఈఎన్సీ ఎఫ్‌సీఎస్ పీటర్ (రహదారులు, భవనాల శాఖ), ఏపీ జెన్‌కో రిటైర్డ్ డైరెక్టర్ ఆదిశేషు, సీడీవో రిటైర్డు సీఈ ఐఎస్ఎన్ రాజు, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డి, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 1 నుంచి ఎంసెట్ కౌన్సెలింగ్

## రేపు నోటిఫికేషన్ విడుదల

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఎంసెట్–2019 కౌన్సెలింగ్ జూలై 1 నుంచి ప్రారంభం కానుంది. దీనికి నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. ఎంసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాలను జూలై 1 నుంచి పరిశీలిస్తారు. అదే నెల 4 నుంచి విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. 11న సీట్లు కేటాయించి 15 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి ఏర్పాట్లు చేపట్టింది. ఏపీ ఎంసెట్‌ను ఏప్రిల్ 20 నుంచి 24 వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇంజనీరింగ్ విభాగంలో 1,85,711 మంది పరీక్ష రాయగా 1,38,160 మంది, అగ్రి, మెడికల్ విభాగంలో 81,916 మంది పరీక్ష రాయగా 68,512 మంది అర్హత సాధించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో ఎంపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే 95,220 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తైంది. తక్కిన విద్యార్థులు జూలై 1 నుంచి జరిగే కౌన్సెలింగ్‌లో ఆయా హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలి. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినవారు మళ్లీ హాజరవ్వాల్సిన అవసరం లేదు. ఈ మేరకు విద్యార్థుల ఫోన్ నెంబర్లకు సంక్షిప్త సమాచారాన్ని పంపినట్లు ఉన్నత విద్యా మండలి వర్గాలు వివరించాయి.

**కౌన్సెలింగ్ ఇలా..:** ధ్రువపత్రాల పరిశీలన పూర్తికానివారు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు టెన్త్, ఇంటర్ మార్కుల మెమోలు, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, రెసిడెన్స్ సర్టిఫికెట్ (స్టడీ సర్టిఫికెట్ లేనివారు) తీసుకువెళ్లాలి. సాంకేతిక కారణాలతో వెరిఫికేషన్ పెండింగ్‌లో ఉన్న 30 వేల మంది వరకు మాత్రమే పరిశీలన చేయించుకోవాలి. తమ ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందా, లేదా అనే విషయం తెలుసుకోవడానికి విద్యార్థులు 'హెచ్‌టీటీపీ:// ఏపీఎస్‌సీహెచ్ఈ.ఓఆర్‌జీ/సీఈటీఎస్‌టీఏటీయూఎస్. పీహెచ్‌పీ' వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూసుకోవాలి. ధ్రువపత్రాల పరిశీలన పూర్తికాని వారు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 24 హెల్ప్‌లైన్ కేంద్రాల్లో పరిశీలన చేయించుకున్న అనంతరం ప్రాసెసింగ్ ఫీజు రూ.1,200 (ఎస్సీ, ఎస్టీలకు రూ.600) చెల్లించాల్సి ఉంటుంది. ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులై ఉండి పొరపాటున 'నో' అని నమోదు చేసిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెరిఫికేషన్ చేయించుకుని సరిచేయించుకోవాలని అధికారులు సూచించారు.

**302 ఇంజనీరింగ్, 127 ఫార్మసీ కళాశాలలకు అనుమతి..:** 2019–20 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో 302 ఇంజనీరింగ్, 127 ఫార్మసీ కళాశాలలకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. ఈ కళాశాలల్లో 1,53,331 ఇంజనీరింగ్ సీట్లకు, 11,139 ఫార్మసీ సీట్లకు ఆమోదం తెలిపింది. ప్రైవేటు కాలేజీల్లో 1,40,763 సీట్లుండగా ఇందులో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు చెందిన 12 కాలేజీల్లో ఇంజనీరింగ్ సీట్లు 3,670 ఉండగా, 6 ఫార్మా కాలేజీల్లో 360 సీట్లు ఉన్నాయి. కాగా.. ఈ ఏడాది అత్యధిక శాతం సీట్లు భర్తీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. గత ప్రభుత్వం కాలేజీల ఫీజులను అమాంతం పెంచేసి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మాత్రం రూ.35 వేలకే పరిమితం చేయడంతో విద్యార్థులపై అధిక భారం పడింది. దీంతో ఇతర రాష్ట్రాల్లోని కాలేజీల్లో విద్యార్థులు చేరిపోయేవారు.

**గతేడాది సీట్ల భర్తీ ఇలా..**

| కోర్సు | వర్సిటీ కాలేజీలు | సీట్లు | భర్తీ | ప్రైవేటు కాలేజీలు | సీట్లు | భర్తీ |
|---|---|---|---|---|---|---|
| ఇంజనీరింగ్ | 20 | 4,834 | 4,642 | 285 | 1,34,142 | 79,372 |
| ఫార్మసీ | 7 | 410 | 406 | 112 | 11,360 | 8,703 |
| మొత్తం | 27 | 5,244 | 5,048 | 397 | 1,45,502 | 88,075 |

# శనగ.. రైతుకు సెగ



**రుణం చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు**
**రైతులకు నష్టం కలిగించవద్దన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్**

**సాక్షి, అమరావతి:** శనగ పండించిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గిట్టుబాటు ధర మాట అటుంచితే.. రైతుకు కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదు. ఫలితంగా లక్షలాది టన్నుల శనగలు గిడ్డంగుల్లో మూలుగుతున్నాయి. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అమ్మితే నష్టపోతామని భావించిన రైతులు పంటను తాకట్టు పెట్టి బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటే.. బ్యాంకులు వేలం నోటీసులు పంపిస్తున్నాయి. కొన్నిచోట్ల తాకట్టు పెట్టిన శనగల్ని వేలం కూడా వేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నూతన ప్రభుత్వం జోక్యం చేసుకుని తమను ఆదుకోవాలని శనగ రైతులు కోరుతున్నారు.

### ఇదీ పరిస్థితి

ప్రత్యేకించి రాయలసీమలోని కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాలతోపాటు దక్షిణ కోస్తాలోని ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో రబీ సీజన్‌లో వర్షాధారిత పంటగా రైతులు శనగ సాగు చేస్తారు. 2015–16లో తీవ్ర వర్షభావ పరిస్థితులు ఏర్పడటంతో ప్రభుత్వమే ఈ పంటను సాగు చేయమని ప్రోత్సహించింది. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు కొంటామని భరోసా ఇచ్చింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. 2016–17లో 4 లక్షల హెక్టార్లలో శనగ సాగు చేస్తే.. 2017–18 నాటికి అది 5.23 లక్షల హెక్టార్లకు చేరింది. 2018–19లో 4,78,125 హెక్టార్లలో సాగయ్యింది. రబీలో పండే శనగలకు క్వింటాల్‌కు రూ.4,620 చొప్పున కేంద్రం కనీస మద్దతు ధర ప్రకటించగా.. వ్యాపారులు, మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు క్వింటాల్ రూ.3,100 నుంచి రూ.3,500 మధ్యనే కొనుగోలు చేస్తున్నాయి. దీనివల్ల రైతులు భారీగా నష్టపోతున్నారు.

### పేరుకుపోతున్న నిల్వలు

వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం శనగల దిగుబడి ప్రస్తుత సంవత్సరానికి 65 లక్షల క్వింటాళ్లకు పైగా ఉంటుంది. ఇందులో కనీసం సగం కూడా ఇంతవరకు అమ్ముడు కాలేదని రైతులు చెబుతున్నారు. గిరాకీ లేదన్న సాకుతో వ్యాపారులు మొహం చాటేశారు. ప్రభుత్వ సంస్థలు రైతుల గడప తొక్కలేదు. ఫలితంగా నాలుగు ప్రధాన జిల్లాలలో 37.99 లక్షలకు పైగా క్వింటాళ్ల శనగ నిల్వలు పేరుకుపోయాయి. వైఎస్సార్ కడప జిల్లాలో ప్రస్తుతం 34 గిడ్డంగులలో 15,21,517 క్వింటాళ్లు, అనంతపురం జిల్లాలోని 11 గిడ్డంగులలో 3,35,697 క్వింటాళ్లు, కర్నూలు జిల్లాలో 25కి పైగా గిడ్డంగులలో 13.97 లక్షల క్వింటాళ్లు, ప్రకాశం జిల్లాలో 5.45 లక్షల క్వింటాళ్లు నిల్వ ఉన్నట్టు అధికార వర్గాల సమాచారం.

### వ్యాపారులవే ఎక్కువ?

గిడ్డంగుల్లో నిల్వ ఉన్న శనగలపై రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. రైతులు దాచుకున్న వాటికంటే వ్యాపారులు దాచినవే ఎక్కువన్న వాదన వినిపిస్తోంది. వాటిని మినహాయించి రైతుల్ని ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రైతులు శనగల్ని తాకట్టు పెట్టి వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపునకు మరికొంత వ్యవధి ఇవ్వాలని, అప్పటివరకు వేలం వేయకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

### ముఖ్యమంత్రి జగన్ హామీ

శనగల వేలం ఆరు నెలలపాటు వాయిదా వేయాలని విజయవాడలో ఇటీవల జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. శనగ రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు రాని పక్షంలో ప్రభుత్వమే చొరవ చూపి క్వింటాల్‌కు ధర నిర్ణయించి మార్కెట్ వ్యత్యాస ధర కింద ఇస్తామని ప్రకటించారు. దీనిపై రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం ఇచ్చే సాయం పూర్తిగా సాగుదార్లకే అందాలని, వ్యాపారులకు ఇవ్వకూడదని కోరుతున్నారు.

కనీస మద్దతు ధర రూ.4,620
మార్కెట్‌లో చెల్లిస్తున్న గరిష్ట ధర రూ.3,500
గిడ్డంగుల్లో మూలుగుతున్న 38 లక్షల క్వింటాళ్లు

**శనగ సాగు ఇలా.. (హెక్టార్లలో)**

| జిల్లా | సాగు లక్ష్యం | 2018లో విస్తీర్ణం | 2019లో విస్తీర్ణం |
|---|---|---|---|
| విజయనగరం | 252 | 111 | 55 |
| విశాఖపట్నం | 73 | 57 | 179 |
| తూర్పు గోదావరి | 435 | 1,836 | 2,410 |
| పశ్చిమ గోదావరి | 62 | 23 | 23 |
| కృష్ణా | 1,352 | 2,302 | 2,915 |
| గుంటూరు | 15,240 | 32,815 | 24,889 |
| ప్రకాశం | 81,385 | 1,07,733 | 1,09,222 |
| నెల్లూరు | 8,602 | 10,034 | 10,993 |
| వైఎస్సార్ కడప | 87,731 | 99,141 | 1,01,874 |
| అనంతపురం | 68,442 | 74,222 | 78,214 |
| కర్నూలు | 1,86,711 | 1,95,351 | 1,47,349 |

# విత్తన కొరత పాపం గత సర్కారుదే

- వేరుశనగ విత్తన నిధులు రూ.380 కోట్లు పసుపు–కుంకుమకు మళ్లింపు
- బ్యాంకు రుణాలతో విత్తనం కొనుగోలు చేసిన ఆయిల్‌ఫెడ్, సీడ్ కార్పొరేషన్
- పాత బకాయిలు విడుదల చేసిన కొత్త ప్రభుత్వం
- పంపిణీ లక్ష్యం 6 లక్షల క్వింటాళ్లు, 4 లక్షల క్వింటాళ్ల పంపిణీకి చర్యలు

**సాక్షి, అమరావతి:** గత ప్రభుత్వ తీరు వల్ల రాష్ట్రంలో ఇప్పుడు తీవ్రమైన వేరుశనగ విత్తన కొరత ఏర్పడింది. వేరుశెనగ విత్తన కొనుగోలుకు ఆయిల్ ఫెడ్, ఏపీ సీడ్ కార్పొరేషన్ సిద్ధం చేసుకున్న రూ. 380 కోట్ల నిధులను చంద్రబాబు ప్రభుత్వం పసుపు–కుంకుమ పథకానికి మళ్లించడంతో సీజను ముంచుకు వచ్చినా ఆ సంస్థలు విత్తనాల పంపిణీ చేయలేకపోయాయి. దీంతో వేరుశనగ పండించే రైతులు, ముఖ్యంగా అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లాల్లోని వేరుశనగ రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన దిద్దుబాటు చర్యలు చేపట్టి విత్తన పంపిణీని ప్రారంభించింది.

### ప్రతి యేటా...

ప్రతి ఏడాది రాష్ట్రంలో దాదాపు 13 లక్షల హెక్టర్లలో జూన్ నెలకెల్లా వేరుసెనగ సాగు ప్రారంభమవుతుంది. దీనికి అనువుగానే ప్రభుత్వం సబ్సిడీ విత్తనాల పంపిణీని ప్రారంభిస్తుంది. మొత్తం 26 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా ప్రభుత్వం ప్రతి ఏడాది 6 లక్షల క్వింటాళ్లను పంపిణీ చేస్తోంది. అయితే తెలుగుదేశం ప్రభుత్వ బాధ్యతారాహిత్యం వల్ల జూన్ 15 వరకు విత్తన పంపిణీ ప్రారంభం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు విత్తనాల ధరను రూ.7 వేలుగా నిర్ణయించి 40 శాతం సబ్సిడీతో రూ.4,260లకు అందిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో బాగుచేయని విత్తనాల ధరే రూ.6,300 ఉంది. మార్కెట్ ధర కంటే రూ. 2,000 తక్కువకు ప్రభుత్వ పంపిణీ సంస్థలు విత్తనాలు అందిస్తుండడంతో రైతులంతా విత్తనాల కొనుగోలుకు ఎగబడుతుండటంతో కొరత తీవ్రమైంది.

### బాబు బాధ్యతారాహిత్యం..

విత్తనాల కొనుగోలు కోసం ఉంచిన మొత్తాన్ని బాబు ప్రభుత్వం పసుపు–కుంకుమ పథకానికి మళ్లించింది. ఎన్నికలకు, ఫలితాలకు మధ్య 43 రోజుల వ్యవధి ఉండటంతో ఈ మధ్య కాలంలో విత్తన సంస్థలు విత్తనాల కొనుగోలుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోయాయి. ఫలితాల తరువాత పసుపు కుంకుమకు మళ్లిన నిధులు తిరిగి వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయిల్ ఫెడ్, ఏపీ సీడ్ కార్పొరేషన్లు విత్తన సేకరణకు వాణిజ్య బ్యాంకుల నుంచి రూ.70 కోట్ల రుణం తీసుకున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం విత్తన కొరత సమస్య పరిష్కారానికి ఆ సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.70 కోట్లను వెంటనే విడుదల చేసింది.

### పంపిణీ ప్రారంభం..

దీంతో ఈ సంస్థలు ఒకవైపున విత్తన సేకరణ జరుపుతూనే మరోవైపున పంపిణీ కార్యక్రమాలను ప్రారంభించాయి. అనంతపురం జిల్లాకు 3 లక్షల క్వింటాళ్ల విత్తనాల సరఫరాకు 1.50 లక్షల క్వింటాళ్లను సేకరించి పంపిణీకి చర్యలు తీసుకున్నాయి. కర్నూలు 35 వేల క్వింటాళ్లకు 20 వేల క్వింటాళ్లు, చిత్తూరు జిల్లాలో 52 వేల క్వింటాళ్లకు 40 వేల క్వింటాళ్లు, వైఎస్సార్ కడప జిల్లాలో 35 వేల క్వింటాళ్లు, ప్రకాశంలో 25 వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకుంది.జూలై 15 వరకు సాగుకు అవకాశం ఉండటంతో విత్తన కొరత సమస్య పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని ఆయిల్ ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

సాక్షి
రౌండప్
విజయవాడ । ఆదివారం । జూన్ । 23 । 2019
www.sakshi.com



ఫ్రాన్స్ దేశ రాజ్యాంగం 1793వ సంవత్సరం జూన్ 24న అమల్లోకి వచ్చింది.



# నైకీ షూస్ కొట్టుకొస్తున్నాయ్



ఐర్లాండ్ నుంచి బహమాస్ వరకు, ఇంగ్లండ్ నుంచి ఫ్రాన్స్ వరకు ఇప్పుడు ఏ బీచుల్లో చూసినా బూట్లే బూట్లు. ఎక్కడ పడితే అక్కడ సముద్రంలో నైకీ కంపెనీకి చెందిన షూస్, చెప్పులు కొట్టుకొస్తున్నాయి. అట్లాంటిక్ సముద్రం ఈ షూస్‌కి సెంటర్ అయిపోయింది. అసలిది జల సంద్రమా, షూస్ సంద్రమా అనిపించే స్థాయిలో వందల జతల చెప్పులు కొట్టుకొస్తున్నాయి. గతేడాది అక్కడ బీచ్‌లో సముద్ర జలాల నుంచి చెప్పులు కొట్టుకురావడం తొలిసారిగా గమనించారు. కొద్ది నెలల తర్వాత ఇంగ్లండ్‌లోని కార్నవాల్ బీచ్‌లలో కొన్ని షూస్ కనిపించాయి. ఇప్పుడు ఈ షూస్ ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ కనిపిస్తున్నాయి. బూట్లే కదా ఎవరైనా వాడదామా అనుకున్నా కుదిరే పని కాదు. సముద్ర జలాల్లో అవి ఎన్నాళ్లున్నాయో కానీ నానిపోయి, చిరిగిపోయి, మెత్తబడిపోయి ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. గత కొన్నాళ్లుగా బీచ్‌లలో విలువైన వస్తువుల్ని ఏరుకోవడానికి వచ్చిన వారికి ఈ బూట్లే కనిపిస్తున్నాయి. అసలు ఇవి ఎక్కడ నుంచి వస్తున్నాయి? ఎలా వస్తున్నాయి? అన్న ఆసక్తి వారిలో మొదలైంది. దీనిపై వాళ్లు పెద్ద అన్వేషణ చేశారు. చివరికి తేలిందేమిటంటే గతేడాది అమెరికాలో ఈ చెప్పులను 70 కంటైనర్లలో పెట్టి ఒక పెద్ద ఓడలో రవాణా చేశారు. నార్త్‌కరోలినా పోర్టు నుంచి బయల్దేరిన ఈ షిప్ ప్రమాదవశాత్తూ మునిగిపోయింది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే 9 కంటైనర్లను మాత్రమే విమానాల సాయంతో బయటకు తీశారు. మిగిలిన 61 కంటైనర్లు అలల్లో కొట్టుకుపోయి ఎటు పడితే అటు వెళ్లి బీచ్‌లలో ప్రత్యక్షం అవుతున్నాయి. అలా మొత్తం 29 వేల చెప్పుల జతలు కొట్టుకొచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు కొట్టుకొచ్చిన ఈ చెప్పుల్ని శుభ్రం చేయడానికి దశాబ్ద కాలం పడుతుందని చెబుతున్నారు. దీనిపై పర్యావరణ ప్రేమికులు, సముద్ర జలాల పరిరక్షణ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ షూస్ కారణంగా సముద్రంలో నివసించే జలచరాలకు ప్రమాదం ఏర్పడుతుందని, నీటి వనరులు కూడా కలుషితమవుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. నైకీ కంపెనీయే దీనికి బాధ్యత వహించి బీచ్‌లను శుభ్రం చేసే పని చేపట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## చంద్రబాబు పాలనలో రుణాల రీషెడ్యూల్ అరకొరే..

- కరువు బారిన పడ్డ రైతాంగాన్ని పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం
- గత మూడేళ్లలో అన్నదాతల సంక్షేమంపై నిర్లక్ష్యం
- బ్యాంకుల్లో అప్పులు పుట్టక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించిన రైతులు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా కరువు కాటకాలు సంభవించాయి. పంటలు చేతికిరాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాగు కోసం వారు తీసుకున్న రుణాలను రీషెడ్యూల్ చేసి, ఆదుకోవాల్సిన చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. రైతన్నలు తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు వాటిని రీషెడ్యూల్ చేసేందుకు నిరాకరించారు. రూ.వేల కోట్ల రుణాలు రీషెడ్యూల్‌కు నోచుకోలేదు. రుణాలు రీషెడ్యూల్ కాకపోవడంతో బ్యాంకుల్లో కొత్త అప్పులు పుట్టక అన్నదాతలు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి, పంటల సాగు కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకున్నారు. వాటిని తీర్చలేక అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

**కొత్త రుణాలు కలే**

ఆర్‌బీఐ నిబంధనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించగానే బ్యాంకర్లు ఆయా మండలాల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసి, కొత్తగా రుణాలను మంజూరు చేయాల్సి ఉంటుంది. రీషెడ్యూల్ చేసిన రుణాలపై ఏడాది పాటు మారటోరియం విధిస్తారు. రైతులు పంటలు కోల్పోతే ఆ మరుసటి ఏడాది రుణాలను తిరిగి చెల్లించలేని పరిస్థితి ఉంటుంది. అందుకే రీషెడ్యూల్ రుణాలపై ఏడాది పాటు మారటోరియం విధిస్తారు. తాము అధికారంలోకి రాగానే రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామని 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గద్దెనెక్కాక ఆ మాట మర్చిపోయారు. రైతుల రుణాలను చంద్రబాబు సర్కారు మాఫీ చేయకపోవడం రుణాల రీషెడ్యూల్‌పై తీవ్ర ప్రభావం చూపిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

**పంటలు నష్టపోయిన రైతులపై రుణాల బండ**

2016–17 ఆర్థిక సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం 286 కరువు మండలాలను ప్రకటించింది. ఆయా మండలాల్లో 8,74,163 మంది రైతుల ఖాతాలకు చెందిన రూ.6,962.52 కోట్ల రుణాలు రీషెడ్యూల్‌కు అర్హత కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. కానీ, కేవలం 48,483 మంది రైతుల ఖాతాలకు చెందిన రూ.396.86 కోట్ల రుణాలనే రీషెడ్యూల్ చేయడం గమనార్హం. ఆయా రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయలేదు. ఈ నెల 18న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్‌ఎల్‌బీసీ) సమావేశంలో ఈ విషయం తేటతెల్లమైంది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో 99,861 మంది రైతుల ఖాతాలకు చెందిన రూ.1027.58 కోట్ల రుణాలను రీషెడ్యూల్ చేయాల్సి ఉండగా, కేవలం 7,498 మంది రైతుల ఖాతాలకు చెందిన రూ.70.48 కోట్ల రుణాలనే రీషెడ్యూల్ చేశారు. 2018–19లో చంద్రబాబు ప్రభుత్వం 316 కరువు మండలాలను ప్రకటించింది. ఆయా మండలాల్లో పంటలు కోల్పోయిన 5,38,512 మంది రైతుల ఖాతాలకు చెందిన రూ.5582.91 కోట్ల రుణాలు రీషెడ్యూల్‌కు అర్హత కలిగి ఉన్నట్లు గుర్తించారు. కానీ, 33,143 మంది ఖాతాలకు చెందిన రూ.356.14 కోట్ల రుణాలనే రీషెడ్యూల్ చేసి చేతులు దులుపుకున్నారు. అసలే పంటలు కోల్పోయి కష్టాల్లో ఉన్న అన్నదాతలు చంద్రబాబు సర్కారు నిర్దయ వల్ల మరింత కుంగిపోయారు.

## గ్రామ- వార్డు వలంటీర్ల దరఖాస్తు కోసం

# ప్రత్యేక వెబ్‌పోర్టల్

http://gramavolunteer.ap.gov.in
http://wardvolunteer.ap.gov.in

**ఈ వెబ్‌పోర్టల్ ద్వారా మాత్రమే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి**

- నియామక విధివిధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- జిల్లాల వారీగా వలంటీర్ల ఉద్యోగాల సంఖ్యను తేల్చేది కలెక్టర్లే
- రేపటి నుంచి జూలై 5 వరకూ దరఖాస్తులు స్వీకరణ
- పర్యవేక్షణకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రెండు కమిటీలు




**సాక్షి, అమరావతి:** గ్రామ వలంటీర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించడానికి ప్రభుత్వం http://gramavolunteer.ap.gov.in పేరుతో ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. గ్రామ వలంటీర్ల నియామకాల విధివిధానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్‌పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వలంటీర్ల భర్తీకి సంబంధించి జిల్లాల వారీగా 2 తెలుగు దినపత్రికల్లో ప్రకటనలు జారీ చేసి.. ఈ నెల 24వ తేదీ నుంచి జూలై 5వ తేదీ వరకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోర్టల్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఏస్థాయిలోనూ అవినీతికి తావులేకుండా చేసే ఉద్దేశంతో పాటు కులమత, వర్గ, రాజకీయ భేదాలు లేకుండా అర్హులందరికీ పథకాలు చేరవేయడం కోసమే ప్రభుత్వం గ్రామ వలంటీర్ల వ్యవస్థను తీసుకొస్తున్నట్టు వలంటీర్ల భర్తీకి సంబంధించి జారీ చేసిన జీవో నంబరు 104లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గ్రామాల వారీగా ఉన్న కుటుంబాల సంఖ్య ఆధారంగా గ్రామ వలంటీర్లను ఏ జిల్లాలో ఎంత మందిని నియమించాలన్నది ఆ జిల్లా కలెక్టర్ నిర్ణయిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు. నియామక ప్రక్రియలో మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు అన్ని కేటగిరీలలో సగం మంది మహిళలకే అవకాశం కల్పిస్తామని స్పష్టంగా పేర్కొన్నారు.

**స్థానికతే ప్రధాన అర్హత...**

గ్రామ స్థానికతే వలంటీర్లుగా నియామకానికి ప్రాథమిక అర్హతగా ఉత్తర్వులో స్పష్టం చేశారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లోని వారు దరఖాస్తుకు కనీసం పదో తరగతి, మిగిలిన గ్రామాల్లో వారికి ఇంటర్ కనీస విద్యార్హతగా పేర్కొన్నారు. 18–35 ఏళ్ల మధ్య వయసు వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన అభ్యర్థులకు జూలై 11 నుంచి 25 తేదీ మధ్య ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

**వేతనాలకు ఏటా రూ.1,200 కోట్లు మంజూరు**

రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఆగస్టు 15వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. గ్రామ వలంటీర్లుగా నియమితులయ్యే వారికి నెలకు రూ. 5 వేల చొప్పున వేతనాలు చెల్లించడానికి ఏటా రూ.1,200 కోట్లు మంజూరుకు ప్రభుత్వం అనుమతి తెలుపుతున్నట్టు సీఎస్ ఉత్తర్వులో తెలిపారు. ఆగస్టు ఒకటి నాటికి రాష్ట్రంలోని ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును ఎంపికచేసి వారికి మండలాల వారీగా ఆగస్టు 5వ తేదీ నుంచి 10 వరకూ ప్రత్యేక శిక్షణ ఇస్తారు. అనంతరం 15వ తేదీ నుంచి వారందరూ కేటాయించిన విధుల్లో చేరతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**పర్యవేక్షణకు రెండు కమిటీలు ఏర్పాటు**

రాష్ట్ర స్థాయిలో వలంటీర్ల నియామక ప్రక్రియ పర్యవేక్షణకుగాను అధికారులతో రెండు కమిటీలను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నియమించారు. జిల్లాలో వలంటీర్ల ప్రక్రియ పర్యవేక్షించేందుకు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ సుధాకరరావు, కమిషనర్ ఓఎస్‌డీ దుర్గా ప్రసాద్, స్టేట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఏవో సాంబశివరావులతో కమిటీని నియమించారు. వలంటీర్ల నియామకంలో అధికారులకు తలెత్తే సందేహాలను ఈ కమిటీ నివృత్తి చేస్తుంది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో అవాంతరాలు ఏర్పడితే జిల్లా అధికారులు వాటిని తెలియజేసిన వెంటనే పరిష్కరించేందుకు పంచాయతీరాజ్ శాఖలో ఐటీ విభాగం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ నేతృత్వంలో ఆర్‌టీజీఎస్‌లో పనిచేసే ముగ్గురు నిపుణులతో కలిపి మరో కమిటీని నియమించారు.

**అర్బన్ వలంటీర్ల నియామకానికి శ్రీకారం**

నవరత్నాల పథకాలను పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు చేరవేయడానికి వార్డు వలంటీర్ల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడానికి అనుమతి ఇస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి 50 కుటుంబాలకు ఒక వార్డు వలంటీర్‌ను నియమించనున్నారు. నియామక ప్రవేశ పరీక్షల కోసం రూ.63.50 లక్షలను, శిక్షణ కార్యక్రమాలకు రూ.6.88 కోట్లను మంజూరు చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కోరింది. వలంటీర్లకు ప్రతినెలా గౌరవ వేతనంగా రూ.5 వేల చొప్పున చెల్లించేందుకు ఏడాదికి రూ.486 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసింది. వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థి డిగ్రీ పాసై, స్థానికుడై ఉండాలి. వీరి ఎంపిక కోసం మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, మెప్మా సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో http://wardvolunteer.ap.gov.in దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ వలంటీర్లకు సంబంధించిన షరుతులే వీరికీ వర్తిస్తాయి.

## రైతు సంక్షేమమే ధ్యేయం

- వ్యవసాయ శాఖ మంత్రిగా కన్నబాబు బాధ్యతలు



మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం 'వైఎస్సార్ రైతు భరోసా'పై తొలి సంతకం చేస్తున్న కన్నబాబు

**సాక్షి, అమరావతి:** వ్యవసాయ శాఖ మంత్రిగా కురసాల కన్నబాబు సచివాలయం రెండో బ్లాక్‌లో తనకు కేటాయించిన 208వ నంబర్ గదిలో శనివారం ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం అమలు ఫైల్‌పై తొలి సంతకం చేశారు. కన్నబాబు మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం అందించి అండగా నిలవాలని మేనిఫెస్టోలో చెప్పిన మాట నిజం చేస్తామన్నారు. ఈ రబీ నుంచి ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.12,500 చెల్లిస్తామని చెప్పారు. వడ్డీ లేని రుణాల కోసం రూ.3,530 కోట్లతో రూపొందించిన ఫైలును ఆర్థిక శాఖకు పంపినట్టు తెలిపారు. పంటల బీమాను పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రూ.2,163 కోట్లతో రూపొందించిన ఫైలును ప్రభుత్వానికి పంపినట్టు మంత్రి వివరించారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రూ.4 వేల కోట్లతో ప్రకృతి వైపరీత్యాల నిధి ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. సహకార సొసైటీల ఆధునీకరణ, అభివృద్ధికి రూ.120 కోట్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. కౌలు రైతులకు కూడా బీమా, రుణాలు, ఇతర రాయితీలు కల్పిస్తామని తెలిపారు. నకిలీ విత్తనాలు చలామణి అవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్న మంత్రి.. తక్షణమే అరికట్టి వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కౌలు రైతులకు ప్రత్యేక కార్డులు మంజూరు చేస్తామని, రైతులకు పంటల మీద హక్కులిచ్చేలా చర్యలు తీసుకుంటామని కన్నబాబు తెలిపారు.

## నేడు, రేపు వర్షాలు

**సాక్షి, విశాఖపట్నం:** రుతుపవనాల ప్రభావంతో ఆది, సోమవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. రాష్ట్రంలో రుతు పవనాలు చురుగ్గా కదులుతున్నాయి. మరోవైపు ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం వాయువ్య బంగాళాఖాతం వైపు మళ్లింది. దీని ప్రభావం వల్ల వచ్చే రెండు రోజులూ వర్షాలు పడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి నివేదికలో తెలిపింది.

## హైకోర్టు సీజేగా జస్టిస్ చౌహాన్ ప్రమాణం



జస్టిస్ చౌహాన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం కేసీఆర్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ ప్రమాణస్వీకారం చేశారు. శనివారం ఉదయం రాజ్‌భవన్‌లోని దర్బార్‌హాల్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆయనతో ప్రమాణం చేయించారు. గవర్నర్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కొత్త సీజేకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సతీమణి విమలా నరసింహన్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ఎండీ మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, వి.శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్ రెడ్డి, తెలంగాణ, ఏపీ, కర్ణాటక హైకోర్టుల న్యాయమూర్తులు, అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్ కలకత్తా హైకోర్టుకు బదిలీ కావడంతో, గత మార్చి 28 నుంచి సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన్ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ ఈ నెల 19న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నకిలీ వీసాలతో మోసం చేస్తున్న నలుగురుపై పీడీ యాక్టు

**శంషాబాద్ రూరల్:** నకిలీ వీసాలు తయారు చేసి గల్ఫ్ దేశాలకు జనాలను పంపిస్తున్న నలుగురు ఏజెంట్లపై పోలీసులు పీడీ యాక్టు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా పెనగలూరు మండలం నారాయణ నెల్లూరు వాసి టి.కాంటేశ్వర్, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం పెద్ద గొరవరం వాసి గడ్డం శశి అలియాస్ సత్యవెంకట పుష్పవతి, కృష్ణ జిల్లా విజయవాడ రూరల్ గొల్లపూడికి చెందిన చింతల సాయిరాంకుమార్, నెల్లూరు జిల్లా కలువోక మండలం వెంకట్‌రెడ్డిపల్లి వాసి పోతుల సురేందర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్నారు. కాంటేశ్వర్, పుష్పవతి, సురేందర్ ట్రావెల్ ఏజెంట్లుగా, సాయిరామ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వీరు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల వారికి నకిలీ వీసాలు ఇప్పించి కువైట్, యూఏఈ, ఖతార్ దేశాలకు పంపిస్తున్నారు. ఈ తరహా కేసులు వీరిపై పలు చోట్ల నమోదు కాగా.. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో 12 కేసులు నమోదయ్యాయి. శనివారం నలుగురుపై పీడీ యాక్టు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## 3.06 లక్షల మంది జర్నీ

**హైదరాబాద్ మెట్రో రికార్డు**



**సాక్షి, హైదరాబాద్:** వర్షం.. మెట్రోకు కాసుల వర్షం కురిపించింది. శుక్రవారం భారీ వర్షం కురవడంతో నగరంలోని రోడ్లన్నీ గంటల తరబడి ట్రాఫిక్‌జామయ్యాయి. దీంతో ప్రయాణికులు మెట్రోబాట పట్టారు. గతంలో 2.89 లక్షల మంది ఒక్కరోజే ప్రయాణించినట్టు రికార్డు ఉండగా శుక్రవారం ఆ రికార్డును అధిగమించి 3.06 లక్షల మంది ప్రయాణించారు. ముఖ్యంగా నగరంలోని హైటెక్‌సిటీ, దుర్గంచెరువు, మాదాపూర్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో గంటల తరబడి వాహనాలు ఎక్కడికక్కడా స్తంభించిన విషయం తెలిసిందే. దీంతో కొన్నిగంటలపాటు ఓలా, ఊబర్ సర్వీసులు నిలిచిపోయాయి. కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు కూడా రెగ్యూలర్ బస్సు, కార్ సర్వీసులను రద్దు చేశాయి. దీంతో ఐటీ ఉద్యోగులతోపాటు సామాన్య ప్రయాణికులంతా మెట్రోలో ప్రయాణించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని మెట్రో అధికారులు హైటెక్ సిటీ నుంచి నాగోల్ వరకు ప్రత్యేక రైళ్లను నడిపారు. సమయం పొడిగించి రాత్రి 11–45 గంటల వరకు చివరి రైల్‌ను నడిపారు. దీంతో ఒకేరోజు రికార్డు స్థాయిలో మెట్రోలో ప్రయాణించిన వారి సంఖ్య పెరిగింది.

**వారానికి 8 వేల నుంచి 10వేలు....**

హైదరాబాద్ మెట్రోకు ప్రజల నుంచి ఆదరణ బాగా పెరుగుతుంది. దీనిని రుజువు చేస్తు మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య ప్రతి వారం 8 వేల నుంచి 10 వేల వరకు పెరుగుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. అధిక శాతం మంది ప్రతి సారి క్యూలైన్‌లో నిల్చుని టికెట్ తీసుకునే అవసరం లేకుండా ప్రవేశపెట్టినటువంటి స్మార్ట్‌కార్డులను తీసుకుని ప్రయాణిస్తున్నారని అన్నారు.

**తెలంగాణ**

## 65కు పెంచుతూ ఆర్డినెన్స్ జారీ

- బోధనాసుపత్రుల వైద్యుల ఉద్యోగ విరమణ వయస్సు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ ఆసుపత్రుల్లోని వైద్యులు, ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసును 58 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచుతూ గవర్నర్ నరసింహన్ ఆర్డినెన్స్ జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే విరమణ వయసును పెంచాలని అప్పట్లో మంత్రి మండలి తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికలు రావడం, తర్వాత మళ్లీ సాధారణ ఎన్నికలు, అనంతరం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు... ఇలా ఎలక్షన్ కోడ్‌తో ఇప్పటివరకు అది ఆచరణలోకి రాలేదు. దీంతో ప్రభుత్వం అత్యవసరంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ప్రభుత్వ దంత వైద్య కళాశాలల అధ్యాపకులు, వైద్యులకు కూడా విరమణ వయస్సు 65ను అమలుచేస్తారు. ఇది తక్షణమే అమలులోకి వస్తుందని గవర్నర్ విడుదల చేసిన రాజపత్రంలో పేర్కొన్నారు. బోధనాసుపత్రుల్లో పలువురి ఉద్యోగ విరమణ వల్ల అనేక ఖాళీలు ఏర్పడటం, వాటిని భర్తీ చేయకపోవడంతో వైద్య విద్య ఇబ్బందుల్లో పడుతుందని ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. అంతేకాదు సకాలంలో పదోన్నతులు జరపకపోవడం వల్ల కూడా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేడర్‌లోని సీనియర్ బోధనా సిబ్బందిలో భారీగా తగ్గుదల కనిపిస్తుందని ఆర్డినెన్స్‌లో వివరించారు. అంతేకాదు సూపర్ స్పెషాలిటీల్లోని కొన్ని యూనిట్లలో బోధనా సిబ్బంది కొరత అత్యంత తీవ్రంగా ఉందని, ఫలితంగా కొన్ని విభాగాలు దాదాపు మూసివేత అంచునకు చేరిన పరిస్థితి నెలకొందని ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. బోధనా సిబ్బంది కొరతతో భారతీయ వైద్య మండలి, భారతీయ దంత వైద్య మండలీలు తనిఖీలకు వచ్చినప్పుడు పీజీ సీట్లతో సహా కొన్ని మెడికల్ కాలేజీల్లో ప్రస్తుతమున్న సీట్ల గుర్తింపునూ కోల్పోయే పరిస్థితి ఉందని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో విరమణ వయస్సును 58 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచామని వివరించారు. రాష్ట్ర శాసనమండలి ఇప్పుడు సమావేశంలో లేనందువల్ల వెంటనే చర్య తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నందున ఆర్డినెన్స్ జారీచేస్తున్నట్లు వివరించారు. కాగా, బోధనాసుపత్రుల్లో విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ శనివారం సచివాలయంలో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. మంత్రి హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు వారు తెలిపారు.

## ప్రజలు కట్టే పన్నులకు జవాబుదారీతనం ప్రధానం



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- ఆలిండియా ట్యాక్స్ సదస్సులో హైకోర్టు ఏసీజే జస్టిస్ ప్రవీణ్ కుమార్
- దేశాభివృద్ధిలో ఎకానమీ, ఫైనాన్స్, రెవెన్యూ కీలక అంశాలు
- పన్నుల పాలసీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి
- సక్రమ పన్నుల చెల్లింపునకు వారధిలా పనిచేయాలి: ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

**చంద్రగిరి రూరల్ (చిత్తూరు జిల్లా):** దేశాభివృద్ధిలో ఎకానమీ, ఫైనాన్స్, రెవెన్యూ అంశాలు కీలకమని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం చిత్తూరు జిల్లా తిరుపతి సమీపంలోని తిరుచానూరులో ఉన్న ఓ హోటల్‌లో జాతీయ ట్యాక్స్ సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి తొలిరోజు జస్టిస్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు కట్టే పన్నులకు జవాబుదారీతనం ఉండటం ప్రధానం అన్నారు. ట్యాక్స్ బెనిఫిట్స్‌పై అధ్యయనం నిరంతర ప్రక్రియ అని, అవగాహన కల్పనలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ ప్రముఖ పాత్ర పోషించడం అభినందనీయమని చెప్పారు. పన్నుల వల్ల సామాజికాభివృద్ధి, సామాజిక న్యాయం అందుతాయని చెప్పారు. పన్నుల పాలసీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. పన్నుల మినహాయింపు కూడా దేశాభివృద్ధిలో భాగమేనని చెప్పారు. పన్నుల చెల్లింపులో ఉన్న సాధక బాధకాలను పారదర్శకతతో చర్చించి కేంద్రానికి సమర్పించగలిగితే నూతన విధానాలకు అవకాశం కలుగుతుందన్నారు. నూతన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి అవగాహన సదస్సులు అమరావతిలో చేపట్టాలని, ఇలాంటి వాటి వల్ల న్యాయవాదులకు, ఆడిటర్లకు ఎంతో ఉపయోగమన్నారు. ఈ సూచనపై ఏపీ ఫెడరేషన్ స్పందించి.. త్వరలో అమరావతిలో సదస్సు నిర్వహణకు అంగీకారం తెలిపింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గంగారావు, జస్టిస్ సీతారామమూర్తి, జస్టిస్ దుర్గా ప్రసాదరావు, జస్టిస్ విజయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఆలిండియా ట్యాక్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ష్రాఫ్, జనరల్ సెక్రటరీ ఆనంద్ పాసారి, సౌత్‌జోన్ చైర్మన్ సీతాపతిరావు, సెక్రటరి సంజీవరావు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కృష్ణ మోహన్‌తో పాటు జిల్లాలోని పలువురు ఆడిటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

**సక్రమంగా పన్నులు చెల్లించేందుకు ప్రాక్టీషనర్లు వారధిగా పనిచేయాలి**

ప్రభుత్వానికి సక్రమంగా పన్నులు చెల్లించేందుకు ప్రాక్టీషనర్లు వారధిగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి నారాయణ స్వామి అన్నారు. జాతీయ ట్యాక్స్ సదస్సుకు ఆయన సాయంత్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్నుల సేకరణలో ప్రాక్టీషనర్ల కృషి అభినందనీయమని, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే శాఖలు సీఎం తనకు అప్పగించడం సంతోషమన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. పరోక్ష పన్నుల వసూల్లో జీఎస్‌టీ కీలకపాత్ర అని, చిన్న, సన్నకారు వ్యాపారస్థులను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకొస్తే వారికి బ్యాంకు రుణాలు మరింత సులభతరం అవుతుందన్నారు. అనంతరం 40 ఏళ్లకు పైగా సేవలందించిన ట్యాక్స్ ప్రాక్టీషనర్లు మహబూబ్ బాషా, నాగభూషణం, మోహన్ రాజు గుప్తా, ఫాల్గుణ కుమార్, రాజారెడ్డి, రామకృష్ణలను ఆయన ఘనంగా సత్కరించారు. సదస్సులో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సావనీర్‌ను తిరుపతి కేంద్రంగా నిర్వహించినందుకు లోగోను ఆవిష్కరించారు.

# ఇదేనా ప్రజాస్వామ్యం?

త్రికాలమ్


కె. రామచంద్రమూర్తి

చట్టాలు చేసిన పెద్దలు అవే చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ వర్ధిల్లుతున్న 'ప్రజాస్వామ్య' దేశం ప్రపంచంలో భారత్ ఒక్కటే. ఇతర ప్రజాస్వామ్య దేశాలలో అమలు చేయడానికే చట్టాలు చేస్తారు. మనలాగా ఉల్లంఘించడానికి కాదు. కొన్నేళ్ళుగా అత్యంత భ్రష్టుపట్టిన చట్టం ఫిరాయింపుల నిరోధక చట్టం. ఒకసారి ఎన్నికలు పూర్తయిన తర్వాత అధికారంలోకి వచ్చిన పార్టీని ప్రజలు విశ్వసిస్తున్నారని ప్రతిపక్షాల సభ్యులు చెప్పడం, తమ నియోజకవర్గం అభివృద్ధి కోసం అధికారపార్టీలో చేరుతున్నామంటూ బొంకడం నిస్సిగ్గుగా సాగుతున్న జాతరలో భాగమైపోయింది. గోవా నుంచి ఇద్దరు కాంగ్రెస్ సభ్యులను ఢిల్లీకి విమానంలో పిలిపించుకొని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా వారి మెడలో బీజేపీ కండువా వేసి స్వాగతం పలికితే, పార్టీ ఫిరాయించిన నలుగురు రాజ్యసభ సభ్యులతో ప్రధాని నరేంద్రమోదీ చిరునవ్వులు చిందిస్తూ కబుర్లు చెబుతుంటే, ప్రతిపక్ష సమావేశానికి హాజరైన కారణంగానే జేడీ (యూ) నేత శరద్‌యాదవ్‌పైన అనర్హత వేటు వేసిన ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడికి అర్జీ ఇచ్చిన కొన్ని గంటలలోనే టీడీపీ సభ్యులను బీజేపీ సభ్యులుగా పార్లమెంటు వెబ్‌సైట్‌లో పరిగణిస్తే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఎవరు రక్షించాలి? విభిన్నమైన పార్టీ (పార్టీ విత్ ఎ డిఫరెన్స్)అంటూ తరచు స్వోత్కర్షకు ఒడిగట్టే బీజేపీ అడ్డగోలు ఫిరాయింపులను అనుమతిస్తే ఏమని చెప్పాలి? పార్టీ ఫిరాయింపులపైన ఫిర్యాదు చేసే నైతిక హక్కు కానీ, ఫిరాయించేవారిని తప్పుపట్టే అధికారం కానీ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడికి వీసమెత్తు కూడా లేదు. అనైతిక, అవకాశవాద రాజకీయాలలో పండిపోయిన టీడీపీ అధినేతకు చట్టాల గురించీ, విలువల గురించీ మాట్లాడే స్థాయి లేదు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణాధారమైన సాధారణ ప్రజలకు తమ ప్రతినిధుల అక్రమాలనూ, అవినీతినీ ప్రశ్నించే హక్కు ఉన్నది. ప్రశ్నించవలసిన అవసరం, బాధ్యత కూడా ఉన్నాయి. తమ తీర్పును తుంగలో తొక్కి తాము ఓడించిన పార్టీలో తమ శాసనసభ్యుడు లేదా లోక్‌సభ సభ్యుడు చేరిపోవడం ఆ నియోజకవర్గం ప్రజలు సహించకూడదు. ఇది గోవాలో జరిగినా, తెలంగాణలో జరిగినా, ఆంధ్రప్రదేశ్‌లో జరిగినా ప్రజావంచనే.

### 'ఆయారాం, గయారాం'

'ఆయా రాం, గయా రాం' సంస్కృతి ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నదని గుర్తించిన రాజీవ్‌గాంధీ 1985లోనే ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చారు. చట్టసభలోని ఒక పార్టీ సభ్యులలో మూడింట ఒక వంతు మంది విడిపోతే అది చీలిక అవుతుంది కానీ ఫిరాయింపు కాదని ఈ చట్టం నిర్దేశించింది. ఈ లొసుగును ఉపయోగించుకొని అవకాశవాదులు పార్టీలు ఫిరాయించినా సభ్యత్వం కాపాడుకున్నారు. 1992లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వంపైన అవిశ్వాసతీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టినప్పుడు టీడీపీ లోక్‌సభ పక్షం చీలిపోయింది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు భూపతిరాజు విజయకుమార్‌రాజు నాయకత్వంలో ఆరుగురు లోక్‌సభ సభ్యులు చీలిపోయి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏడుగురు టీడీపీలో మిగిలారు. ఈ లోపం పూడ్చే ప్రయత్నంలో 2003లో వాజపేయి ప్రభుత్వం పిరాయింపుల నిరోధక చట్టం, 1985కు సవరణ చేసింది. సవరించిన చట్టం ప్రకారం లెజిస్లేచర్ పార్టీలో లేదా పార్లమెంటరీ పార్టీలో మూడింట రెండు వంతుల మంది పార్టీ మారాలని నిర్ణయించుకుంటే అది పార్టీ చీలిక అవుతుంది. అనర్హత వేటు పడదు. సవరించిన చట్టంలో కూడా మిగిలిపోయిన కీలకమైన లొసుగు ఏమిటంటే శాసనసభ్యులు పార్టీ ఫిరాయిస్తే, వారిపైన అనర్హత వేటు వేయమని సదరు పార్టీ నాయకత్వం సభాపతికి ఫిర్యాదు చేస్తే సభాపతి వెనువెంటనే నిర్ణయం తీసుకోవాలన్న నిబంధన లేదు. ప్రధానికీ లేదా ముఖ్యమంత్రికి విధేయులైన సభాపతులు అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఏళ్ళ తరబడి సభాపతి నిర్ణయం తీసుకోకుండా సాచివేత ధోరణి ప్రదర్శించినా ప్రశ్నించే వెసులుబాటు న్యాయవ్యవస్థకు లేదు. సభాపతిని కాదని వేటు వేసే అధికారం ఎన్నికల సంఘానికి సైతం లేదు. చట్టంలోని ఈ లోపాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడూ, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావూ (కేసీఆర్) సంపూర్ణంగా వినియోగించుకున్నారు. 2014–19లో ఆంధ్రప్రదేశ్‌లో 23 మంది శాసనసభ్యులనూ, ముగ్గురు లోక్‌సభ సభ్యులనూ వైఎస్‌ఆర్‌సీపీ నుంచి టీడీపీ ఫిరాయింపజేశారు. తెలంగాణలో టీడీపీని నిర్వీర్యం చేయడానికీ, ఆ తర్వాత ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయడానికి ఫిరాయింపుల నిరోధక చట్టంలోని లోపాన్ని కేసీఆర్ ఉపయోగించుకున్నారు. ఈ రోజున దేశంలో ఫిరాయింపులకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న, వ్యవహరిస్తున్న నాయకుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే. ఎవరు పార్టీ మారిన అనర్హత వేటు వేయవలసిందిగా సభాపతి తమ్మినేని సీతారాంను జగన్ అభ్యర్థించారు. ఫిరాయింపుల జాడ్యాన్ని నిరోధించకపోతే ఎన్నికలు అర్థరహితం అవుతాయి. పార్టీల భావజాలాలూ, సిద్ధాంతాలూ బూటకమై ప్రజలను వంచిస్తాయి.



### పరాజయ ప్రభావమా?

ఇక నలుగురు టీడీపీ రాజ్యసభ సభ్యుల పార్టీ ఫిరాయింపుల విషయానికి వస్తే, ఇందులో కనిపించేదంతా నిజమో, కాదో అనే అనుమానం కొందరు వెలిబుచ్చుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్న రోజులలోనూ, అధికారం చెలాయించిన కాలంలోనూ చంద్రబాబునాయుడితో అంటకాగిన సుజనాచౌదరీ, సీఎం రమేష్‌లు నిజంగా ఆయన అనుమతి లేకుండా, మరి కొందరు పెద్దల ఆశీస్సులు లేకుండా పార్టీని వీడి బిజేపీలోకి వెళ్ళి సంచలనం సృష్టించారంటే కొందరికి నమ్మశక్యంగా లేదు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని నాటి ప్రతిపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డి సమర్థంగా నిర్మిస్తున్నారనీ, ఆ కారణంగా ప్రజలలో ఆయన ప్రాబల్యం విశేషంగా పెరుతున్నదనీ గ్రహించిన చంద్రబాబునాయుడు ప్లేటు ఫిరాయించారు. అంతవరకూ ప్రశంసించిన ప్యాకేజీని పక్కన పెట్టారు. ప్రత్యేకహోదా సంజీవని కాదని అప్పటి వరకూ దబాయించి అదే నినాదం పేరుతో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి నిష్క్రమించారు. అప్పుడు సుజనా చౌదరి కేంద్ర ప్రభుత్వంలో సహాయమంత్రి అయినప్పటికీ ఆయనది కేబినెట్ మంత్రి అశోక్‌గజపతి రాజు కంటే ఎక్కువ పెత్తనం. బీజేపీ నాయకులతో సంబంధాలూ, హడావిడీ అంతా ఆయనదే. 2004 నుంచి 2014 వరకూ పార్టీ కార్యకలాపాలు సుజనాచౌదరి ఇంటి నుంచే జరిగేవి. పార్టీ కోసం చంద్రబాబునాయుడు హెరిటేజ్ బ్యాంకు ఖాతా నుంచి నయాపైసా తీయలేదు. సుజనాచౌదరి వంటి సంపన్న నాయకులే ఖర్చులు భరించారు. పార్టీలో లోకేశ్ ప్రాధాన్యం పెరిగిన కొద్దీ సుజనాచౌదరి ప్రాముఖ్యం తగ్గుతూ వచ్చింది. సుజన ఆధ్వర్యంలోని సుజనా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ బ్యాంకులకు 5,700 కోట్ల మేరకు టోపీ పెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, ఆదాయంపన్ను శాఖల అధికారులు తమ కార్యాలయాలపైనా, నివాసాలపైనా దాడులు చేయడం ఎన్‌డీఏ నుంచి టీడీపీ నిష్క్రమించిన కారణంగానేనని సుజనాచౌదరి, మరో రాజకీయ వ్యాపారి సీఎం రమేష్ భావిస్తున్నారు. 'నేను టీడీపీ ఎంపీని కనుకనే నన్ను టార్గెట్ చేశారు. మోదీనీ, బీజేపీని వ్యతిరేకించేవారిని వేధించే ప్రయత్నం ఇది. కేంద్రాన్ని ఎవరు ప్రశ్నిస్తే వారిపైన ఆదాయంపన్ను శాఖ దాడులు చేస్తున్నది,' అంటూ రమేష్ ఘాటుగా ఆరోపించి ఎన్నో మాసాలు కాలేదు. సుజనాచౌదరికీ, రమేష్‌కీ టీడీపీ ఎన్‌డీఏని వీడటం బొత్తిగా ఇష్టం లేదు. తమ నాయకుడు అపర చాణక్యుడనీ, మోదీ పరాజయం ఖాయమనీ, మోదీ వ్యతిరేకులను ఒక తాటిమీదికి తెచ్చి, రాహుల్‌గాంధీ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసి వెనక నుంచి ఆయనే చక్రం తిప్పుతాడనే ఆశతో ఎన్నికలు పూర్తయ్యే వరకూ కించిత్ ఆశాభావంతో మౌనంగా ఉండిన సుజన, రమేష్‌లు ఓట్ల లెక్కింపులో టీడీపీ గల్లంతు కాగానే తమ దారి తాము చూసుకోవాలనీ, ఆత్మరక్షణ కోసం బీజేపీలో చేరడం వినా గత్యంతరం లేదనీ తీర్మానించుకున్నారు. రాజ్యసభ సీటు కోసం భారీ ఖర్చు చేసిన టీజీ వెంకటేశ్‌కు పార్టీ పట్ల విధేయత ఉండాలనుకోవడం అత్యాశ. తెలంగాణలో టీడీపీ ఉనికి లేదు కనుక బీజేపీలోకి వెళ్ళాల్సి వచ్చిందని గరికపాటి మోహనరావు చెప్పవచ్చు. నలుగురికీ చెప్పుకోవడానికి ఏదో ఒక కారణం ఉంది.

### వ్యూహంలో భాగమా?

ఈ నలుగురు ఎంపీలు తామంతట తామే బీజేపీలోకి వెళ్ళారా లేక టీడీపీ అధినేత వ్యూహంలో భాగంగానే బీజేపీ పంచన చేరారా అనే ప్రశ్న ఒకటి వినిపిస్తున్నది. ఈ విధంగా అనుమానించడానికి చంద్రబాబునాయుడు మార్కు రాజకీయం కారణం. ఆత్మరక్షణతో పాటు తమ అధినేతపైన కేంద్ర దర్యాప్తు సంస్థలు విరుచుకుపడకుండా మోదీ, షాలను ప్రభావితం చేయడం కోసమే సుజన, రమేష్‌లను బీజేపీలోకి పంపించారనేది కొందరి వాదన. పార్టీలో చేరినంత మాత్రాన దర్యాప్తులు ఆగవంటూ బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ప్రకటించారు. విచారణ జరిగి తనను దోషిగా నిర్ధారిస్తే తనకు అభ్యంతరం లేదంటూ సుజనాచౌదరి 'ఇండియా టుడే'తో అన్నారు. అటువంటిది ఏమీ జరగదనే విశ్వాసం ఆయన మాటలలో ధ్వనించింది. 'చంద్రబాబునాయుడికి వ్యతిరేకంగా మీరు అప్రూవర్‌గా మారబోతున్నారా?' అంటూ ఒక న్యూస్‌చానల్ ప్రతినిధి ప్రశ్నించినప్పుడు 'అటువంటిది ఏమీ లేకపోగా, టీడీపీ ఏ మాత్రం ఉపయోగపడినా నేను సంతోషిస్తాను,' అని చౌదరి వ్యాఖ్యానించారు. మోదీ,షాలు ఏదీ మరచిపోరనీ, ఎవ్వరినీ క్షమించరనీ ప్రతీతి. అందుకే యూరోప్‌లో పర్యటిస్తూ కూడా చంద్రబాబునాయుడు అమరావతిలో పార్టీ నేతలతో ఫోన్‌లో మాట్లాడినప్పుడు తాను మోదీకి వ్యతిరేకంగా ఏమీ చేయలేదనీ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే పోరాడాననీ చెప్పుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ పూర్తయిన తర్వాత 42 రోజులకు కానీ ఓట్ల లెక్కింపు జరగలేదు. ఆ వ్యవధిలో విహార యాత్రకు వెళ్ళకుండా ఇప్పుడు ఎందుకు నారావారి కుటుంబం యూరోప్ వెళ్ళింది? ఆంధ్రప్రదేశ్ పోలింగ్ అనంతరం ఢిల్లీ, లక్నో, కోల్‌కతా, బెంగళూరు వగైరా నగరాలను చుట్టి మోదీ వ్యతిరేకులను కూడగట్టి ప్రతిపక్షంలో ఐక్యత సాధించిన నాయకుడుగా పేరు తెచ్చుకోవాలనే తాపత్రయంతో కాలికి బలపం కట్టుకొని తిరిగారు కనుక తీరిక లేక విహారయాత్రకు వెళ్ళలేకపోయారా? నలుగురు ఎంపీలు పార్టీ నుంచి బీజేపీలోకి గెంతే సమయంలో తాను విదేశీపర్యటనలో ఉండాలన్నది ముందే రాసిపెట్టుకున్న స్క్రిప్టా అంటూ సందేహం వెలిబుచ్చుతున్నవారు ఉన్నారు. రాజ్యసభలో మెజారిటీ లేకపోవడంతో బీజేపీ ముందరి కాళ్ళకు బంధం వేసినట్టు ఉన్నది. ప్రముఖ వార్తా సంస్థ ఐఏఎన్ఎస్ ఇస్తున్న లెక్క ప్రకారం నలుగురు టీడీపీ సభ్యుల చేరికతో రాజ్యసభలో బీజేపీ బలం 71 నుంచి 75కి పెరిగింది. ఎన్‌డీఏ ఎంపీల సంఖ్య 108కి చేరింది. ఇంకా 18 మంది ఎంపీలు చేరితే కానీ 245మంది సభ్యులు కలిగిన రాజ్యసభలో ఎన్‌డీఏకి సాధారణ మెజారిటీ సిద్ధించదు. రాజ్యాంగ సవరణ ఆమోదానికి అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ రావాలంటే మరో ఏడాది ఆగాలి. యూపీఏకి 66 స్థానాలు ఉండగా, ఎన్‌డీఏకీ, యూపీఏకీ చెందని పక్షాలకు చెందిన సభ్యుల సంఖ్య 66. తొమ్మిది స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాబోయే నవంబర్‌లో ఉత్తర ప్రదేశ్ నుంచి పది రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. పదికి పదీ గెలుచుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం బీజేపీకి ఉంది. 16వ లోక్‌సభ ఆమోదించిన రెండు తీర్మానాలు–సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్లు, 2018, ముస్లిం మహిళల (వివాహానికి సంబంధించిన హక్కుల పరిరక్షణ) బిల్లు, 2018 (త్రిపుల్ తలాఖ్ బిల్లు)– రాజ్యసభలో తగినంత బలం లేని కారణంగా మురిగి పోయాయి. 17వ లోక్‌సభలో మొదటి బిల్లుగా త్రిబుల్ తలాఖ్ బిల్లును న్యాయశాఖమంత్రి రవిశంకర్‌ప్రసాద్ తిరిగి శుక్రవారంనాడు ప్రవేశపెట్టారు. ఈ సారైనా ఈ బిల్లులు రాజ్యసభ ఆమోదం పొందకపోతే ఎన్‌డీఏ సర్కార్‌కు తలవంపులు తప్పవు. అందుకోసం నేపథ్యాలతో, నైతికతతో నిమిత్తం లేకుండా రాజ్యసభ సభ్యులు ఎవరైనా బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉంటే వారికి స్వాగతం చెప్పాలని అధినాయకత్వం నిర్ణయించుకున్నట్టు కనిపిస్తున్నది. కారణాలు ఏమైనా కావచ్చు, అధికారంలో ఉన్న జాతీయ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని చట్టుబండలు చేయడం రాజ్యాంగస్ఫూర్తిని మంటగలపడమే.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి బ.షష్ఠి రా.9.04 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం శతభిషం రా.10.11 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం తె.5.16 నుంచి 7.02 వరకు (తెల్లవారితే సోమవారం) దుర్ముహూర్తం సా.4.48 నుంచి 5.40 వరకు, అమృతఘడియలు... రా.2.10 నుంచి 3.44 వరకు.

**సూర్యోదయం** : 5.30
**సూర్యాస్తమయం** : 6.33
**రాహుకాలం** : సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం** : ప.12.00 నుంచి 1.30 వరకు

హెచ్.డి. దేవెగౌడ (జేడీఎస్)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కుమారస్వామి వచ్చి కూర్చున్నాడు. "నేనిక కూర్చోలేను నాన్నగారూ" అన్నాడు.

"ఇప్పుడైనా నువ్వు కూర్చొని ఉన్నావని ఎందుకు అనుకుంటున్నావు?" అన్నాను. చప్పున కన్నీళ్లు పెట్టుకున్నాడు. కుమారస్వామి చాలా సెన్సిటివ్. ఏదీ ఆపుకోలేడు. కన్నీళ్లను అసలే ఆపుకోలేడు. అభినందన సభల్లో చేతికి అందిన పుష్పగుచ్ఛం కూడా అతడిని ఏడిపిస్తుంది. అంత మృదు హృదయుడు సీఎంగా నిలబడగలిగాడంటే, అదీ కాంగ్రెస్ సపోర్ట్‌తో ఒక ఏడాది కాలాన్నయినా పూర్తి చేశాడంటే గొప్ప సంగతే."

"కళ్లు తుడుచుకో కుమారస్వామి" అన్నాను.

తుడుచుకోలేదు. తుడుచుకుని మాత్రం చేసేదేముంది అన్నట్లు ఉండిపోయాడు.

"ఈ కలివిడి ప్రభుత్వాలు ఇలాగే ఏడుస్తాయి కుమారస్వామీ" అన్నాను.

చివ్వున తలెత్తి, నా కళ్లలోకి చూశాడు!

"నన్నంటున్నారా, ప్రభుత్వాలను అంటున్నారా లేక ప్రభుత్వాలను అడ్డు పెట్టి నన్ను అంటున్నారా నాన్నగారూ.." అన్నాడు ఉద్వేగంగా.

"ఏమన్నాను కుమారస్వామి?" అన్నాను.

"అదే నాన్నగారూ.. 'ఇలాగే ఏడుస్తాయి' అన్నారు కదా. ఆ ఏడుస్తున్నది ఎవరూ అని" అన్నాడు.

"ఛ.. ఛ.. కుమారస్వామి. మనమెందుకు ఏడుస్తాం. సంకీర్ణ ప్రభుత్వాలను అంటున్నాను నేను" అన్నాను.

"అయినా సరే, నేనిక కూర్చోలేను నాన్నగారు. సిద్ధరామయ్య నాకు మినిమం రెస్పెక్ట్ కూడా ఇవ్వడం లేదు" అన్నాడు.

"సిద్ధరామయ్య రెస్పెక్ట్ ఇస్తున్నంత కాలం కూర్చొని, సిద్ధరామయ్య రెస్పెక్ట్ ఇవ్వడం లేదు కనుక లేచి వెళతాను అంటే దానర్థం మన మీద మనకు రెస్పెక్ట్ లేదని కుమారస్వామీ.." 



అన్నాను. నివ్వెరపోయి చూశాడు.

"మినిమం రెస్పెక్ట్ కూడా ఇవ్వని సిద్ధరామయ్యను కదా నాన్నగారూ మీరు అనవలసింది. మినిమం రెస్పెక్ట్‌ను కోరుకుంటున్న నన్ను అంటున్నారేమిటి?" అన్నాడు.

"సిద్ధరామయ్య ఎవరు?" అన్నాను.

"అర్థమయింది నాన్నగారూ. సిద్ధరామయ్య ఎవరు అన్నట్లుగానో, సిద్ధరామయ్య ఎవరైతే నాకేంటి అన్నట్లుగానో ఉండమనేగా మీరు చెబుతున్నారు" అన్నాడు!

కొంచెం కొంచెం తేరుకుంటున్నట్లుగా ఉన్నాడు. నా మాట అర్థమౌతోంది.

"సిద్ధరామయ్యకు డెబ్బై తొమ్మిది సీట్లు, నీకు ముప్పై ఏడు సీట్లు ఉండొచ్చు కుమారస్వామీ. అలాగని సిద్ధరామయ్య ఎవరో నీకు తెలిసి ఉండాల్సిన పని లేదు. సొంతకాళ్లపై నిలబడే బలం లేక, నువ్వు సిద్ధరామయ్య చేతులపై కూర్చొని ఉండొచ్చు. అలాగని కూడా సిద్ధరామయ్య ఎవరో నీకు తెలిసి ఉండాల్సిన పని లేదు. 'నువ్వెవరో నాకు తెలియదు' అన్నట్లుంటేనే.. 'నేనెవరో మీకు తెలుసు కదండీ' అని చెప్పకోడానికి వస్తారు ఎవరైనా. ఏమంటున్నాడూ.. కూలగొట్టేస్తానంటున్నాడా గవర్నమెంటుని! కూలగొట్టుకోనివ్వు" అన్నాను.

"అది కాదు నాన్నగారూ నా ఆవేదన.. మనతో పొత్తు పెట్టుకుంటే వాళ్ల పార్టీకి నష్టం జరుగుతోందని రాహుల్‌తో అంటున్నాడట. మనం అంత హీనం అయిపోయామా!" అన్నాడు.

"పట్టించుకోకు" అన్నాను.

"ఎందుకు పట్టించుకోకూడదు నాన్నగారూ?" అన్నాడు.

"కాంగ్రెస్ పార్టీకి ఒకరు నష్టం చేయడమేంటి కుమారస్వామీ? వాళ్లకు ప్రెసిడెంట్ లేకపోతే కదా!!" అన్నాను.

అప్పుడు కళ్లు తుడుచుకున్నాడు.

జూలైతో జేడీఎస్‌కి ఇరవై ఏళ్లు నిండుతాయి. కుమారస్వామిని జాతీయ అధ్యక్షుడిని చేస్తేనన్నా కాస్త కుదుట పడతాడేమో చూడాలి.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### మంగళసూత్రం



"నేను ఎప్పుడైతే పెళ్లి చేసుకుంటానో, వెంటనే చేసే మొట్టమొదటి పని గర్వంగా మంగళ సూత్రాన్ని మెడలో ధరించడమే. ఇంతకు ముందు ఈ మంగళసూత్ర ధారణ గురించి నేనేమీ ఆలోచించ లేదు. ఎప్పుడైతే స్వేచ్ఛావాదులు మంగళ సూత్రం అనేది బానిసత్వానికి చిహ్నమని అంటున్నారో అప్పటి నుంచి దానిపై ఆసక్తి పెరిగింది. అన్నింటిలానే దీనిపై కూడా వారు వ్యతిరేకతను పెంచుతున్నారు. స్వేచ్ఛావాదం అనేది ఓ మానసిక దౌర్భల్యం"

– శృతి టాండన్, నటి

### ఆత్మకథ




"నాకు పదేళ్ల వయసున్నప్పటి నుంచే నేను ఆత్మకథ రాయడం ప్రారంభించానని చెబితే అతిశయోక్తి అనుకోవద్దు. అప్పటి నుంచే నేను జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలను చవిచూశాను. నా జీవిత కథను పుస్తక రూపంలో మీతో పంచుకునే సమయం వచ్చింది. అది త్వరలోనే మీ ముందుకు వస్తుంది"

– అనుపమ్ ఖేర్, నటుడు

### బ్రాండ్



"ప్రపంచకప్ మ్యాచ్‌లు నెమ్మదిగా ఉత్కంఠను రేపే దిశగా సాగుతున్నాయి. భారత్ వికెట్లన్నీ కోల్పోకపోవడం గౌరవప్రదమే. ఎవరైనా గమనించారో లేదో, భారత్ ఆటగాళ్లు చైనా కంపెనీ అయిన ఒప్పో లోగోను ధరిస్తే, ఆఫ్ఘన్ ఆటగాళ్లు భారత్‌కు చెందిన అముల్ లోగో ధరించారు"

– హెర్మన్ ప్రీత్ సింగ్, పోలీస్ అధికారి

### తలాక్



"మేము ట్రిపుల్ తలాక్‌ను సమర్థించకపోవడానికి కారణం ఈ చట్టం ముస్లిం మహిళలను ఏ మాత్రం రక్షించకపోగా, ముస్లిం పురుషులను శిక్షిస్తుంది. విడాకుల వ్యవహారాన్ని నేరపూరితం చేస్తుంది. బాధ్యత లేకుండా తమ కుటుంబాలను వదిలి పెట్టే పురుషులను స్వేచ్ఛగా వదిలిపెడుతుంది. అది వివక్షా పూరితం"

– శశీథరూర్, కాంగ్రెస్ ఎంపీ

### దేశాంతరం



"చంద్రబాబు విహార యాత్రకు ఏ దేశం వెళ్లారో ఆ పార్టీ నాయకులకూ తెలియదు. స్విట్జర్లాండ్ వెళ్లారో స్వీడన్‌లో ఉన్నారో చెప్పలేనంత రహస్యమా? ఎల్లో మీడియా కూడా యూరప్ నుంచి ముఖ్య నాయకులతో ఫోన్లో మాట్లాడి ధైర్యం చెప్పారని రాసింది. యూరప్ అనేది దేశం కాదు. 44 దేశాలున్న ఖండమని అందరికీ తెలుసు"

– విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

## చైనా దిశగా ఏసియాన్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలపై పలు దేశాల్లో అసంతృప్తి పెరుగుతోంది. చివరకు చిరకాల మిత్ర దేశాలు సైతం దానికి దూరమయ్యే స్థితి ఏర్పడు తున్నదని థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో శనివారం ప్రారంభమైన ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఏసియాన్) శిఖరాగ్ర సదస్సులోని చర్చల శైలి గమనిస్తే అర్థమవుతుంది. ఇండొనేసియా, మలేసియా, సింగపూర్, థాయ్‌లాండ్, బ్రూనై, వియత్నాం వంటి దేశాలు సభ్యులుగా ఉన్న ఈ సదస్సులో పాల్గొన్నవారంతా ఆర్థికాభివృద్ధి, ప్రాంతీయ సుస్థిరత, పర్యావరణం వంటి అంశాలపై లోతైన చర్చలు జరిపారు. అమెరికా–చైనాల మధ్య వివాదాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థను అనిశ్చితిలోకి నెడుతున్నాయని అధినేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారంతో ముగిసే ఈ సదస్సులో ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(ఆర్‌సీఈపీ)పై స్థూలంగా అవగాహన కుదరవచ్చునని నిర్వాహకుల భావన. అమెరికా గతంలో ప్రతిపాదించిన ట్రాన్స్‌పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం(టీపీపీ) ట్రంప్ పాలనలో మూలనపడింది. ఇదే అదనుగా చైనా ఆర్‌సీఈపీని ప్రతిపాదించింది. ఇది తమ ఆర్థిక వ్యవస్థల్ని బలోపేతం చేస్తుందని సింగపూర్, ఫిలిప్పీన్స్, థాయ్ లాండ్ తదితర దేశాలు విశ్వసిస్తున్నాయి. నామమాత్ర చర్చలతో ముగిసే ఏసియాన్‌ను మర్యాదస్తుల సంఘంగా పిలిచేవారు. కానీ ఈసారి మాత్రం వివిధ అంశాలపై నిర్మొహమాటమైన చర్చలు సాగుతున్నాయని అంటున్నారు.

## 'భరోసా'తో రైతుకు పూర్వవైభవం

అభిప్రాయం


యాతం వీరాస్వామి

భారతదేశ ఆర్థిక వ్యవస్థను శతాబ్దాలుగా తమ భుజస్కంధాలపై మోసిన మన రైతన్నలు .. నేడు అర్ధాకలితో అలమటిస్తూ,అప్పులతో ఆత్మహత్యలకు పాల్పడడం అత్యంత దురదృష్టకరం. వేల ఏళ్ల నాటి మన వ్యవసాయ సంస్కృతికి నేడు ఎందుకీ దుస్థితి?

రైతు విత్తనాన్ని నేర్పుగా ఓర్పుతో పంచ భూతాలకు అనుసంధానిస్తాడు. ఆరుగాలం శ్రమించి ఆహారోత్పత్తి చేస్తాడు. పైరు, పచ్చని పంట పొలాలు, పరుగులు తీసే ఆల మందలు, మనసులు మురిసే మానవ సంబంధాలతో సుఖసంతోషాలమయమైన నాటి గ్రామసీమలలో రైతన్నలే హీరోలు. ఇతర వృత్తులవారు సందర్భానుసారం రైతన్నలకు సేద్య ప్రక్రియలో తమ వంతు సహకారాన్ని అందించే వారు. పంట చేతికొచ్చిన తర్వాత రైతులు తమకు వ్యవసాయంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సహాయం చేసిన వారికి తమ ఫలసాయంలో న్యాయమైన వాటా పంచి ఇచ్చే వారు. స్వతంత్ర భారత దేశాన్ని ఆహార కొరత నుండి గట్టెక్కించి, స్వయం సమృద్ధి సాధించిన 'హరిత విప్లవం', తదనంతర కాలంలో భారతీయ రైతుల పాలిట పెనుశాపంగా మారి ఆత్మహత్యలకు దారి చూపింది.

నేడు మనదైన సుసంపన్న సేద్య జ్ఞానాన్ని వదిలేశాం. కంపెనీల మాయాజాలానికి బలిపెట్టాం. పంట భూముల ఆరోగ్యంతో పాటు, మన ఆరోగ్యాన్ని చేజేతులా చేజార్చుకున్నాం. స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నా, ఇంకా పరాయి విత్తనాన్నే పట్టుకుని.. మన వారసత్వ విత్తన సంపదను వదిలేశాం. మనవైన ఆహార పంటలను కాదని వాణిజ్యానికి పనికొచ్చే విషపూరిత పంటలను పండిస్తున్నాం. రసాయనాలు కుమ్మరిస్తూ నేల తల్లి ఊపిరిని నిలువునా నాశనం చేస్తున్నాం. మన అన్నదాతల ఉసురును మనమే తీసుకుంటున్నాం. అంతేకాదు రైతు దుస్థితి 'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి' అన్నట్టుగా తాము పండించిన ఉత్పత్తులను గంపగుత్తగా టోకు ధరలకు కారు చౌకగా ధారపోసి, తమకు అవసరమైన వస్తువులను ముందుగానే నిర్ణయించి ముద్రించిన అధిక ధరలకు కొనుగోలు చేయక తప్పని దుస్థితిలో నేడు మన రైతన్న ఉన్నాడు. ఒకప్పుడు స్వచ్ఛమైన విషరహిత తాజా ఆహారోత్పత్తులను సమృద్ధిగా ఆస్వాదించిన మన పల్లె సీమలు, నేడు విష రసాయనాలు చల్లిన కూరగాయలు, మందులతో మగ్గిన పండ్లు, యాంటిబయోటిక్స్ సహాయంతో పెంచిన కోళ్లు, కోడిగుడ్లు, చేపలు, కల్తీ నూనెలు, సింథటిక్ పాలు వంటి ప్రమాదకరమైన ఆహారాన్ని తినవలసివస్తున్నది. దీంతో ఒకప్పుడు భాగ్యవంతుల జబ్బులుగా చెప్పుకునే రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ నేడు గ్రామ సీమలలో కష్టపడి బతికే సామాన్యుల ఇళ్లలోకి కూడా జొరబడ్డాయి. పేదింటిలో రోగం అంటే మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టే. సమాజంలో పేదరికం కంటే రోగం అత్యంత ప్రమాదకరం. దీంతో పాటు వ్యవసాయ రంగంలో అతివృష్టి అనావృష్టి వల్ల అన్నదాతలది కోలుకోలేని పరిస్థితి. అభివద్ధి పేరుతో నేటి పాలకులు రైతు ఆత్మాభిమానంపై దెబ్బ కొడుతున్నారు. నేటి ప్రభుత్వాలు నష్టాల్లో ఉన్న ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు నిధులు మంజూరు చేసి ఆదుకున్న సందర్భాలు ఉన్నాయి కానీ, కార్పొరేట్ సంస్థల భూములను ప్రభుత్వ అవసరాల కోసం స్వాధీనం చేసుకున్న సందర్భాలు ఎక్కడా లేవు!

ఈ నేపథ్యంలో.. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయాభివృద్ధి ద్వారా రైతు ఉన్నతికి పెద్ద పీట వేస్తూ ఆయన ప్రవేశపెట్టిన 'రైతుకు భరోసా' పథకం ద్వారా రైతులకు ఏటా పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 12,500 ఇస్తుంది. దీని ద్వారా 56 లక్షల రైతు కుటుంబాలు లబ్ధి పొందుతారు. మొత్తం సాయంగా రూ. 13,125 కోట్లు కేటాయించారు. వీటితో పాటు రైతులకు ప్రభుత్వం ద్వారా పంటల భీమా ప్రీమియం చెల్లింపు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు గ్రామ సచివాలయం ద్వారా సరఫరా. యజమానులకు నష్టం లేకుండా కౌలుదారులకు సాయం. గ్రామ వాలంటీర్ల ద్వారా ఇంటికే నాణ్యమైన రేషన్, పెన్షన్లు పంపిణీ. వడ్డీలేని రుణాలు ఇచ్చే ఏర్పాటు. రూ. 3000 కోట్లతో మార్కెట్ స్థిరీకరణ నిధి ఏర్పాటు. విపత్తులు ఎదుర్కొనడానికి రూ. 4000 కోట్లతో నిధి. అసెంబ్లీ నియోజకవర్గాల్లో శీతల గిడ్డంగులు, వేర్ హౌసింగ్ ఏర్పాటు. వ్యవసాయాధార పరిశ్రమలను ప్రోత్సహించడం. వ్యవసాయ కమిషన్ ఏర్పాటు. అలాగే ప్రకృతి సాగులో అవకతవకలు లేకుండా వ్యవసాయ శాఖతో అనుసంధానం చేయడం. సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించడం. చివరి భూమి వరకు కాలువల ద్వారా సాగునీరు అందించడం. పంట రుణాలు ఏపీ సహకార బ్యాంకు ద్వారా కల్పించడం. పంట భూమిపై ఉన్నప్పుడే రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం. దళారీ వ్యవస్థను నిర్మూలించడం. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేయడం. రైతు సంక్షేమానికి పెద్దపీట వేయడం వంటి అంశాలను ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో రాష్ట్రంలో అమలు చేయగల్గితే.. రైతువృద్ధి ద్వారా గ్రామీణ వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెంది, మరలా గ్రామాల్లో పూర్వ వైభవాన్ని చూడగలం. దీంతో రైతు భరోసా పథకం దేశానికే ఆదర్శం అవుతుంది.

వ్యాసకర్త రచయిత, విశ్లేషకులు
మొబైల్ : 95816 76918

## అప్రెంటీస్ టీచర్లకు ఇంక్రిమెంట్లు ఏవి?

వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్రెంటిస్ టీచర్లకు రెండు సంవత్సరాల అప్రెంటిస్ పిరియడ్‌కి గాను రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేశారు. కానీ ఆయన హఠాన్మరణం వలన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొణిజేటి రోశయ్య ఈ సమస్యను పరిశీలించారు. అయితే, ప్రభుత్వ ఖజానాకు ఆర్థిక భారం తగ్గించుకునే నేపథ్యంలో కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఇచ్చిన తప్పుడు సలహాల మేరకు ఆ రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను ఉపాధ్యాయులు ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీ నుంచి కాకుండా వారికి రెగ్యులర్ పే స్కేలు మంజూరు అయిన తేదీ నాటికి ఉన్న జీతానికి రెండు ఇంక్రిమెంట్లు కలిపారు. అందు వలన డి.యస్.సి 1996 అప్రెంటిస్ టీచర్లకు తీవ్ర అన్యాయం జరిగింది.

ఆ రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీ నుండి మంజూరు చేసి ఉంటే వారు అప్పటికే పొంది ఉన్న అదనపు క్వాలిఫికేషన్స్ ఇంక్రిమెంట్లు ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్లు రికవరీ జరిగి ఉండేవి కాదు. ఉద్యోగంలో చేరిన తరువాత రెండు సంవత్సరాలకు రెండు ఇంక్రిమెంట్లు కలపడం వల్ల పిఆర్‌సి 1993 రూల్స్ పరిధిలోకి రాని వాటిని రికవరీగా తిరిగి చెల్లించవలసి వచ్చింది. ఆర్థిక పరంగా ఎటువంటి లాభం లేనప్పటికీ తిరిగి చెల్లించాల్సి రావడం మా దురదృష్టం. మిగతావారికి ఎటువంటి ఇబ్బంది కలుగలేదు. అలాంటి వారు తెలుగుదేశం ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల ద్వారా అనేక సార్లు వినిపించినప్పటికీ అది చెవిటివాని ముందు శంఖంలాగా మారింది.

రాష్ట్ర నవ యువ ముఖ్యమంత్రి, వైయస్సార్ కుమారుడు, వైయస్ జగన్‌మోహన్ రెడ్డికి శుభాభినందనలు తెలియజేస్తూనే ఇకనైనా మా నోషనల్ ఇంక్రిమెంట్ల తేదీని మార్పించవలసిందిగా మనవి చేస్తున్నాము. రెండేళ్ల తరువాత అమలు చేయడానికి బదులుగా దాన్ని మేము ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీగా చేయవలసిందిగా కోరుతున్నాము.

మా కంటే వెనుక ఉద్యోగాల్లో చేరిన జూనియర్లు మా కంటే ఎక్కువ వేతనాన్ని పొందుతున్నారు. పైగా స్టెప్ అప్ సదుపాయం కూడా మాకు కలుగలేదు. స్టెప్ అప్ చేయించుకోవడానికి సబ్జెక్టు చూస్తున్నారు కానీ కేడర్ రిలయన్స్‌ను, సమర్థతను చూడటం లేదు. ఇలా తేదీని మార్చడంవల్ల ప్రభుత్వ ఖజానాకు పెద్దగా భారం పడదనేది తెలిసిన విషయమే. పైగా ఉపాధ్యాయులు అందరికీ సమ న్యాయం జరుగుతుంది. కేవలం మాకు రావలసిన అదనపు క్వాలిఫికేషన్ ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్లను మాత్రమే తిరిగి పునరుద్ధరించడం జరుగుతుంది. అదే సమయంలో సమన్యాయం చేసిన వారుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చరిత్రలో మిగిలిపోతారు. మా వృత్తిని ఎంతో ఆనందంగా చేసుకోవడానికి సహాయం చేసినవారవుతారు. మా సమస్యని నూతన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తప్పక పరిశీలించి తగిన న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్నాం. పదేళ్ల తరువాత అయినా మా సమస్యను పరిష్కరించగలరని ఆశ.

వీరగంట. భాస్కరరావు, ఇంగ్లీష్ మాస్టర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోటి హపాం గ్రామం, విజయనగరం జిల్లా

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ ఆదివారం
23-6-2019



ఆ భయం పోయింది
సినిమా పేజీలో...



హాలిడే కానీ వర్క్ డే!
సినిమా పేజీలో...



నగ్నంగా ఇరవై రోజులు!
సినిమా పేజీలో...

**లేడీ సూపర్ స్టార్ విజయశాంతి చివరిగా కనిపించిన చిత్రం 'నాయుడమ్మ' (2006). ఆ తర్వాత రాజకీయాల్లో బిజీ అయి, సినిమాలకు దూరం అయ్యారు. ఇన్నేళ్లల్లో మళ్లీ ఆమెను సినిమాలు చేయమని ఇండస్ట్రీ నుంచి బోలెడన్ని ఆఫర్లు వచ్చాయి. ఇప్పుడు విజయశాంతి తెర మీద కనిపించడానికి ఓకే అన్నారు. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న 'సరి లేరు నీకెవ్వరు' సినిమాలో కీలకంగా నిలిచే పాత్ర చేస్తున్నారు. సోమవారం విజయశాంతి బర్త్‌డే. ఈ సందర్భంగా నటిగా ఆమె కమ్‌బ్యాక్ గురించి స్పెషల్ ఇంటర్వ్యూ.**



● విజయశాంతి

నన్ను ఎవరైనా ఏమైనా అంటే 'పోరా' అంటా.
అంతకంటే ఎక్కువ చేస్తే పోరాడతా.
స్త్రీ అంటే ఆటబొమ్మ అయిపోయింది.
నిజజీవితంలో, సోషల్ మీడియాలో
ఎక్కడైనా సరే నిస్సిగ్గుగా, నిర్లజ్జగా,
నిర్భీతిగా మహిళల వ్యక్తిత్వాన్ని
వలువల్లా ఒలుస్తున్నారు.
చిన్న పిల్లలనీ చూడరు.
ముసలివాళ్లనీ చూడరు.
వాయీ వరసా చూడరు.
ఉసురు తీసుకుంటున్నారు.
దీనికొక్కటే సమాధానం.
వీళ్లని ఉరి తీయాలి.

# ఉరి తీయాల్సిందే

**● బర్త్‌డే ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?**

సెలబ్రేషన్ అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండదు. ఫ్యాన్స్, నన్ను అభిమానించే వాళ్లు విషెస్ పంపుతారు. నాకు మాత్రం సింపుల్‌గా ఉండటం ఇష్టం. మొదటినుంచీ అదే అలవాటు. ఈసారి బర్త్‌డే సోమవారం. అంటే శివుడి రోజు. నేను శివభక్తురాలిని. ఆ దేవుడే నన్ను మంచి స్థాయికి చేర్చాడని నమ్ముతాను.

**● టీనేజ్‌లోనే కెరీర్ స్టార్ట్ చేశారు. సపోర్ట్ లేకుండా ఇంతదాకా వచ్చిన మీ లైఫ్ జర్నీ గురించి?**

లైఫ్ జర్నీ చాలా వండర్‌ఫుల్‌గా సాగింది. ఒక క్రమశిక్షణ పెట్టుకొని ట్రావెల్ చేశాను. చిన్న వయసులోనే మా అమ్మానాన్న పోయారు. నన్ను గైడ్ చేయడానికి ఎవరూ లేరు. అమ్మానాన్న చనిపోవడం నాకు పెద్ద ఎదురుదెబ్బ అనుకుంటాను. పైగా ఒక్క సంవత్సరం గ్యాప్‌లోనే ఆరోగ్య సమస్యలతో ఇద్దరూ చనిపోయారు. వృత్తినే దైవంగా భావించాను. ప్రతి పాత్రకూ 100 శాతం న్యాయం చేయాలని చాలెంజ్‌గా తీసుకున్నాను. యాక్షన్, గ్లామర్, పెర్ఫార్మెన్స్.. మూడూ బ్యాలెన్స్ చేస్తూ సినిమాలు చేశాను.

**● ఒంటరిగా ఎలా కొనసాగాలనే భయం ఉండేదా?**

నా జీవితంలో ఎప్పుడూ భయం లేదు. కానీ ఎలా హ్యాండిల్ చేయాలా? అని ఆలోచించేదాన్ని. చిన్న వయసులో హీరోయిన్ అయిపోయాను. నాకు నేనుగా మిలిటరీ క్రమశిక్షణ పెట్టుకున్నాను. పని తప్ప వేరే ధ్యాస ఉండేది కాదు. అందుకే నన్ను 'పని రాక్షసి' అనేవారు. సంవత్సరానికి 17–18 సినిమాలతో బిజీగా ఉండేదాన్ని. రోజుకి ఆరేడు షిఫ్ట్‌లు చేసేదాన్ని. భోజనానికి టైమ్ ఉండేది కాదు. నైట్ షూట్ అంటే నిద్ర మాత్రమే కాదు.. ఒక్కోసారి భోజనం కూడా త్యాగం చేయాల్సి వచ్చేది. తింటే నిద్ర వచ్చేస్తుందని భయం. అప్పట్లో నెలా నెలన్నరలో సినిమా పూర్తి చేసేవాళ్లం. మహా అయితే 2 నెలలు. 'ప్రతిఘటన' సినిమాని నెలలోనే పూర్తి చేశాం. నా కెరీర్‌లో చెప్పుకోదగ్గ సినిమాల్లో 'ప్రతిఘటన' ఒకటి. అయితే దర్శకుడు టి. కృష్ణగారు ఆ సినిమాకి అడిగినప్పుడు డేట్స్ ఖాళీ లేవు. ఆయనేమో మా శాంతమ్మే చెయ్యాలి అన్నారు. ఇతర ప్రొడ్యూసర్స్‌తో మాట్లాడి, ఆ సినిమాకి కష్టం మీద డేట్స్ ఇవ్వగలిగాను. అలాగే 'పడమటి సంధ్యారాగం' సినిమా కోసం నెల రోజులు అమెరికా వెళ్లాను. తిరిగొచ్చేసరికి 3, 4 సినిమాలు వెయిటింగ్.

**● ఇంత వర్క్ చేస్తున్నాం అని రిగ్రెట్ అయిన సందర్భాలేమైనా?**

అస్సలు లేదు. అయితే రాత్రీ పగలూ, తిండీ నిద్రా.. ఇలా దేని గురించీ ఆలోచించకుండా పని చేయడంతో అప్పుడప్పుడూ హెల్త్ కొంత ఇబ్బంది పెట్టేది. కానీ రెండు రోజులు రెస్ట్ తీసుకుంటా అంటే ప్రొడ్యూసర్లు బాబోయ్ అనేవారు. ఇప్పుడు సిస్టమ్ వేరు అప్పటి సిస్టమ్ వేరు. అయితే కష్టం అనేది తెలిస్తేనే లైఫ్ వేల్యూ తెలుస్తుంది. అందుకే ఇంత హార్డ్ వర్క్ చేసినందుకు 'ఐయామ్ హ్యాపీ'.

**● మీ అమ్మానాన్న మీ సినిమా కెరీర్‌ను చూశారా?**

కొంతవరకూ చూశారు. 'ప్రతిఘటన' వరకూ మా అమ్మ ఉన్నారు. ఆ సినిమాకి నంది అవార్డు తీసుకోవడం చూశారు. నాన్నగారు 'నేటి భారతం' వంటి నా హిట్ సినిమాలను చూశారు. 'దేవాలయం' సినిమా సమయానికి నాన్నగారు పోయారు.

**● యాక్షన్ హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. సెట్‌లో గాయాలపాలై ఉంటారేమో?**

చాలా దెబ్బలు తగిలాయి. చచ్చిపోయి బతకడం వరకూ జరిగింది. పంచభూతాలను దాటి వచ్చాను. గాలి, నీరు, నిప్పు, ఆకాశం.. ఇలా అన్ని గండాలను దాటాను. ఇంకేం బ్యాలెన్స్ లేదనుకుంటా. ఇంకా భూమి మీద చేయాల్సిన పని ఉంది కాబట్టే దేవుడు నన్నింకా ఉంచాడు. ఒకసారి ఏకంగా ఓ సినిమాకి మంటల్లో చిక్కుకున్నాను. అదే సినిమాకి నీళ్లలో కొట్టుకుపోయా కూడా. ఫ్లైట్ యాక్సిడెంట్ గురించి తెలిసిందే. నేను చిరంజీవిగారు, బాలకృష్ణగారు అందరం ఉన్నాం. అందులోంచి బయట పడ్డాం. 'లేడీ బాస్'లో ట్రైన్‌కి సంబంధించిన సీన్ తీస్తున్నప్పుడు కొద్దిలో పెద్ద ప్రమాదం తప్పింది.

> ● సమాజం ఎటు పోతోందో తెలియడంలేదు. మొన్నటికి మొన్న తొమ్మిది నెలల పసి పాపపై అత్యాచారం చేసి, ప్రాణాలు బలిగొన్నాడు...
>
> అభం శుభం తెలియని పసి పాపపై పైశాచికత్వమా? ఆ సంఘటన వినగానే మనసు అదోలా అయిపోయింది. వీళ్లను ఏం చేస్తే ఆ పాప ఆత్మకు శాంతి లభిస్తుందా అనిపించింది. ఏం చేయక్కర్లేదు. నడిరోడ్డులో నిలబెట్టి కాల్చి పడేయాలి. ఉరి తీయాలి. ఎన్‌కౌంటర్ చేసి పడేయాలి. లేకపోతే ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. కేసులు పెట్టి, నెలలు, సంవత్సరాలు గడిచిపోతే విషయం 'డైల్యూట్' అయిపోతుంది. శిక్ష అనేది అప్పటికప్పుడు ఇచ్చేయాలి.

**● ఇలాంటివి జరిగినప్పుడు ఎందుకీ యాక్షన్ సినిమాలు అనిపించేదా?**

ఎప్పుడూ అనిపించలేదు. ఇంకా చాలెంజ్‌గా తీసుకున్నాను. హీరోయిన్ అంటే ఎప్పుడూ పాటలు, డ్యాన్స్, గ్లామరేనా? చెట్టు చుట్టూ తిరుగుతూ పాటలు పాడే క్యారెక్టర్సేనా? ఏదైనా కొత్తదనం ఉండాలి. హీరోలకంటే మనం ఏం తక్కువ? యాక్షన్ కూడా చేద్దాం అనుకున్నాను. ఏదీ ప్రత్యేకంగా నేర్చుకున్నది లేదు. సెట్లో చెప్పడం, చేయడం. నేను క్లాసికల్ డ్యాన్సర్‌ని. కూచిపూడి, భరతనాట్యం నేర్చుకున్నాను. ఫైట్లు అన్నీ ఆన్ ది స్పాట్. గాడ్స్ గిఫ్ట్ ఏంటంటే నేను ఏదైనా చూడగానే చేయగలను. కాలు విరిగినా బాధ పడలేదు. నిర్మాతలకు నష్టం కలగకూడదని ఆ గాయాలతోనే షాట్ పూర్తి చేసి వెళ్లిన రోజులున్నాయి. ఇంత కష్టపడ్డాను కాబట్టే ఆ దేవుడు నన్ను హైట్స్‌కు తీసుకెళ్లాడు. ఇప్పుడంటే చాలావరకు కంఫర్ట్‌బుల్ లైఫ్. అప్పట్లో మాకు గ్రాఫిక్స్ లేవు. 30 అడుగుల ఎత్తులో నుంచి దూకాలంటే దూకడమే. ధైర్యం ఉంటే దూకమనేవారు. అయితే ఫోర్స్ చేసేవారు కాదు. ధైర్యం చేసి, నేనే చేసేదాన్ని.





**● అంత కష్టపడ్డారు కాబట్టే 'లేడీ అమితాబ్' అనే ట్యాగ్ వచ్చింది. ఏదైనా సందర్భంలో అమితాబ్‌గారితో ఈ విషయం చెప్పారా?**

రివల్యూషనరీ సినిమాలు, యాంగ్రీ యంగ్ ఉమెన్ అనిపించే క్యారెక్టర్స్ చేశాను. ఆయన నా 'కర్తవ్యం' హిందీ వెర్షన్ 'తేజస్విని' సినిమా ప్రివ్యూ చూడ్డానికి వచ్చారు. ఓ సినిమా ఓపెనింగ్ అప్పుడు బోనీ కపూర్‌గారు అమితాబ్‌గారితో విజయశాంతిని సౌత్‌లో 'లేడీ అమితాబ్' అంటారు అన్నారు. 'తేజస్విని' హిట్ అయిపోతే ఇక నన్ను 'జెంట్ విజయశాంతి' అంటారా? అన్నారు (నవ్వుతూ).

**● ఒకప్పుడు హీరోతో సమానంగా, ఒక్కోసారి వారికన్నా ఎక్కువే పారితోషికం అందుకున్నారు, ఆ రికార్డ్‌ని సౌత్‌లో ఎవరూ బ్రేక్ చేయలేదు..**

నాకు అలాంటి పాత్రలు ఇచ్చిన దర్శక–నిర్మాతలు, వాటికి న్యాయం చేయడానికి నేను పడ్డ కష్టం, ఆ సినిమాలను అంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులు... అన్నీ కరెక్ట్‌గా కుదిరాయి. లేడీ ఓరియంటెడ్ సినిమాలకు ఎక్కువ ఇస్తారు. కానీ హీరోలతో కలిసి చేసిన సినిమాలకి కూడా కొందరి హీరోల కంటే ఎక్కువే తీసుకున్నాను.

**● మనది మేల్ డామినేటెడ్ ఇండస్ట్రీ. హీరోలతో పాటు సమానంగా తీసుకుంటే తట్టుకోగలిగారా? వాళ్లకన్నా ఎక్కువ కావాలని డిమాండ్ చేసేవారా?**

ఒక రేంజ్‌కి వచ్చాక మేం డిమాండ్ చేయొచ్చు, వాళ్లు కూడా ఇవ్వొచ్చు. స్టార్‌డమ్ పెరుగుతున్న కొద్దీ డిమాండ్ ఉంటుంది. నిర్మాతలు కూడా 'మేం అంత ఇస్తాం.. ఇంత ఇస్తాం' అని క్యూలో నిలబడేవాళ్లు. అందరికీ డేట్స్ ఇవ్వడానికి ఇబ్బంది అయ్యేది. ఇక హీరోలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని పట్టించుకునేదాన్ని కాదు.



● 'కర్తవ్యం'లో...

**● ఇప్పుడు 'సరి లేరు నీకెవ్వరు' సినిమా చేయడానికి ఎవరు ఒప్పించారు?**

విజయశాంతిని ఎవరూ ఒప్పించరు. నా నిర్ణయం నేనే తీసుకుంటాను. ఎన్నికలు అయిపోయాయి. గెలుపోటములు అన్నది రాజకీయాల్లో సాధారణం. ఇప్పుడు చిన్న గ్యాప్ దొరికింది. మళ్లీ సినిమాలు చేయాలని ఎప్పటినుంచో అడుగుతున్నారు. నేనే ఆసక్తిగా లేను. ఎప్పటినుంచో అడుగుతున్నవాళ్లల్లో దర్శకుడు అనిల్ రావిపూడి ఒకరు. ఒక్కసారి కథ వినండి అన్నారు. విన్నాను, బాగా నచ్చింది. కమ్ బ్యాక్‌కి ఇది బెటర్‌గా ఉంటుంది.



● 'ఒసేయ్ రాములమ్మ'లో...

అన్నీ రాములమ్మలు అన్నీ కర్తవ్యాలు అంటే కుదరవు. అయితే ఉన్నదాంట్లో ఇది బావుంది అనుకున్నాను. ఒప్పుకున్నాను.

**● ఈ సినిమాలో మహేశ్‌బాబుతో మీది ఏ రిలేషన్ ?**

రిలేషన్ ఏమీ ఉండదు. కానీ మా పాత్రలు రెండూ ప్యారలల్‌గా వెళ్తుంటాయి.

**● మీ పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉంటాయా?**

లేదు. విజయశాంతి నెగటివ్ షేడ్సా? నో. నేను పాజిటివ్ పర్సన్. చేసే పాత్రలూ అలానే ఉండాలని కోరుకుంటాను. ఇందులో నాది చాలా పాజిటివ్ పాత్ర. అందరికీ నచ్చుతుంది. నాకు డబ్బులు ముఖ్యం కాదు. స్క్రిప్ట్, డైరెక్టర్ అన్నీ కుదరాలి.

**● విజయశాంతి నెగటివ్ షేడ్సా అన్నారు? ఏం చేయరా?**

నెగటివ్ ఎందుకు? ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటే బెటర్ కదా.

**● వెనక్కి తిరిగి చూసుకుంటే ఆర్టిస్ట్‌గా ఇది చేయలేదు అని ఏదైనా అసంతృప్తి ఉందా?**

ఏదీ లేదు. నా సైడ్ నుంచి హ్యాపీ. కొత్తకొత్త ఐడియాలతో దర్శకులు వచ్చినప్పుడు ఇంకా కొత్తగా చేయాలనుకుంటాను. అలాంటివి వస్తే కచ్చితంగా ఆడుకుంటాను (నవ్వుతూ). ఆ నమ్మకం నాకుంది.

**● అమ్మానాన్నల తర్వాత మీకు అండగా నిలిచిన వ్యక్తి ఎవరు?**

నా భర్త శ్రీనివాస్ ప్రసాద్‌గారు.

**● అమ్మానాన్న ఉన్నప్పుడే ప్రసాద్‌గారిని కలిశారా?**

లేదు. నా లైఫ్ పార్ట్‌నర్‌ని నేనే ఎన్నుకొన్నాను. పెద్దవాళ్లు ఉంటే వాళ్లు పెళ్లి చేయాలి. కానీ వాళ్లు లేరు. వాళ్లు చనిపోయిన రెండు మూడేళ్లకు పెళ్లి చేసుకున్నాను. దానికి ప్రత్యేకంగా ప్రిపరేషన్‌లు ఏం లేవు. అలా అనుకున్నాం.. ఇలా పెళ్లి చేసుకున్నాం. 30 ఏళ్లుగా హ్యాపీగా ఉన్నాం. ఇన్నేళ్లుగా నా వెనకే ఉంటూ నన్ను గైడ్ చేస్తూ ఉన్నారు.

**● ఈయన మనకు కరెక్టా? కాదా? అని ఎలా ఊహించగలిగారు?**

అందుకే నేను దేవుడికి ధన్యవాదాలు చెప్పుకుంటాను. మంచి కెరీర్ ఇచ్చావు, మంచి భర్తను ఇచ్చావు అని. అన్నీ నాకు ఇచ్చాడు. దేవుడికి బాగా ఇష్టమైన కూతుర్ని అనుకుంటాను. లక్కీ ఉమెన్‌ను.

**● అప్పట్లో మీ ట్రాక్ స్పెషల్ కాబట్టి వేరే హీరోయిన్లతో పోటీ లేకపోవడం రిలీఫ్‌గా ఉండేదా?**

నేను కేవలం గ్లామర్ పాత్రలే చేయలేదు కాబట్టి మీరన్నట్లు పోటీ ఉండేది కాదు. నటిగా నా సామర్థ్యం చూపించే సినిమాలు చేయాలనుకున్నా. గ్లామర్ నాకు నచ్చేదే కాదు. కొన్నిసార్లు గొడవలు కూడా పడేదాన్ని.. ఈ డ్రెస్సేంటి అని.

**● సెట్ నుంచి వెళ్లిపోయిన సినిమాలున్నాయా?**

అలిగి కూర్చునేదాన్ని. నిర్మాతలు 'అమ్మా చేయండి.. బావుంటుంది' అనేవారు. ఏ బావుంటాయండీ. ఈ పిచ్చి బట్టలు.. గ్లామర్ అని విసుక్కున్నప్పటికీ చేసేదాన్ని.

**● హీరోకన్నా ఎక్కువ పారితోషికం అంటే.. అవకాశాలు తగ్గేలా చేయడానికి ట్రై చేయలేదా?**

అప్పటికే చేయి దాటిపోయింది. నాకు స్టారడమ్ వచ్చేసింది. అలా వస్తుందని వాళ్లూ అనుకోలేదు.. నేనూ అనుకోలేదు (నవ్వుతూ). కళ్లు మూసి తెరిచేలోపు పెద్ద స్థాయికి వెళ్లిపోయాను. పైగా నేను 'గివ్ అప్' చేయను.

**● ఇక వరుసగా సినిమాలు చేస్తారా?**

అన్నీ కుదిరాయి కాబట్టి ఈ సినిమా చేస్తున్నాను. మంచి పాత్రలొస్తే చూద్దాం.

**● అమ్మ, వదిన.. పాత్రలు చేస్తారా?**

నో. చాన్సే లేదు. డిఫరెంట్ పాత్రలుంటే చేస్తా. అమ్మ అయినా 'మదర్ ఇండియా' లాంటి పాత్ర అయితే చేస్తా. విజయశాంతి అంటే ఆడియన్స్‌కి అంచనాలుంటాయి. మామూలు సినిమాలు చేస్తే ఎలా? కెపాసిటీ ఉండి చేయకపోవడం ఎందుకు?

**● ఫైనల్లీ పేరులో 'విజయ' ఉన్నట్లే జీవితం విజయవంతంగా కొనసాగిస్తున్నందుకు రెండు మాటలు..**

చిన్నప్పటి నుంచి శివభక్తురాలిని. నా లైఫ్‌ని డిజైన్ చేసింది ఆయనే. మనం బొమ్మలం మాత్రమే. ఆయన కీ ఇచ్చి ఆడిస్తుంటాడు. డైరెక్టర్, ఆర్ట్ డైరెక్టర్ అన్నీ ఆయనే. బాధపెడతాడు, నవ్విస్తాడు. మంచి వాళ్లతో, గొప్పవాళ్లతో సినిమాలు చేసే అవకాశం ఇచ్చాడు. ఆ దేవుడే మంచి కెరీర్ ఇచ్చాడు. నా కెరీర్‌లో ఫ్లాప్స్ తక్కువ. హిట్సే ఎక్కువ. అందుకే ఆ దేవుడికి థ్యాంక్స్ చెబుతున్నా.

– డి.జి. భవాని

> **● స్త్రీ ఆత్మవిశ్వాసం కోల్పోవాలంటే ఆమె వ్యక్తిత్వం గురించి చెడుగా మాట్లాడతారు. ఇప్పుడు ఆ ధోరణి ఎక్కువ కావడం గమనించారా?**
>
> అవును. అలా మాట్లాడే కొంతమంది వల్ల సమాజం చాలా నాశనం అవుతోంది. 60 శాతం మంది బావుంటే 40 శాతం దారుణంగా ఉన్నారు. వాళ్లు చేసే కామెంట్స్ చాలా దరిద్రంగా ఉంటున్నాయి. ఏం మాట్లాడుతున్నారో వాళ్లకే తెలియడం లేదు. వేరే స్త్రీని అంటున్నాం అంటే వాళ్ల తల్లిని అంటున్నట్లే. గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి. ఉమెన్‌ను రెస్పెక్ట్ చేయడం నేర్చుకోవాలి. నిన్ను కన్నది కూడా ఓ ఆడదే కదా. ఇవాళ జరుగుతున్నవి చూస్తుంటే నా 'ప్రతిఘటన' సినిమా గుర్తొస్తోంది. అందులోని 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో...' పాట గుర్తొస్తోంది. ఏం చేస్తున్నారు? ఏం చేయదలచుకున్నారు? మంచి చేయండి. అది రాదా? నోరు మూసుకొని కూర్చోండి. నోటికొచ్చిన మాటలు అంటుంటే ఎవరు ఊరుకుంటారు? ప్రభుత్వాలు సోషల్ మీడియాకూ కొత్త చట్టం తీసుకురావాలి.





> **● ప్రస్తుతం సోషల్ మీడియా రూపంలో విచ్చలవిడితనం పెరిగింది. హీరోయిన్ అంటే టేకిట్ ఫర్ గ్రాంటెడ్ అయిపోయి ఎలా పడితే అలా కామెంట్ చేస్తున్నారు..**
>
> అవును. బ్యాలెన్స్ తప్పి మాట్లాడుతున్నారు. అసహ్యం వేస్తోంది. సోషల్ మీడియా వల్ల కొంత వరకూ మంచి జరుగుతోంది, కానీ ఎక్కువ చెడే జరుగుతోంది. సినిమాలకు సెన్సార్ ఎలా అయితే ఉందో సోషల్ మీడియా కామెంట్స్‌కు ఏదైనా సెన్సార్ ఉండాలి. ఏదైనా కొత్త చట్టం ప్రభుత్వం తీసుకురావాలి. ఏదైనా అనేస్తారా? తప్పు కదా? అనేవాళ్లు వాళ్ల ఇంట్లో అమ్మాయిలను అంటారా? అనరు. అంటే.. మీ ఇంటి ఆడవాళ్లు గొప్ప, మిగతావాళ్లు చులకనా? సంబంధం లేని స్టోరీలు అల్లేస్తారు. శాడిజం అది. గవర్నమెంట్ ఆలోచించాలి. క్యారెక్టర్ తప్పుబట్టి మెంటల్‌గా వీక్ చేద్దామనుకుంటారు. కానీ ఎవరూ వీక్ అవ్వరు. రెండు రోజులు పట్టించుకుంటాం. మూడో రోజు నుంచి 'పోరా' అనుకుంటాం. అవసరమైతే పోరాడతాం.
>
> **● మీ టైమ్‌లో సోషల్ మీడియా లేకపోవడం లక్కీ అనుకుంటున్నారా?**
>
> చాలా లక్కీ. మా అప్పుడు ఇంత నెగటివిటీ లేదు. ఇప్పుడు ఎవరికీ సేఫ్టీ లేదు. మహిళలకు గౌరవం తగ్గింది. ఇది మంచి పరిణామం కాదు.

## బ్యూటిప్స్

# వర్షాకాలం ప్యాక్స్



**కా**లానుగుణంగా వచ్చే మార్పులు ముఖసౌందర్యాన్ని దెబ్బతీయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

- రెండు టేబుల్ స్పూన్ల గంధంపొడి, అరకప్పు రోజ్‌వాటర్, టేబుల్ స్పూన్ పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో శుభ్రపరచాలి. ఈ ఫేస్‌ప్యాక్ రోజూ వేసుకోవడం వల్ల ముఖంపై మురికి, మచ్చలు తగ్గి చర్మకాంతి పెరుగుతుంది.
- రెండు టేబుల్ స్పూన్ల జొజోబా ఆయిల్(మార్కెట్లో లభిస్తుంది), రెండు టేబుల్ స్పూన్ల తాజా పెరుగు, టీ స్పూన్ తేనె ఈ మూడూ ఒక పాత్రలో వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి 10–15 నిమిషాలు ఉంచాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరచాలి. పొడి చర్మం గలవారికి ఇది మహత్తరమైన ఫేస్‌ప్యాక్.
- ఈ కాలం సహజసిద్ధమైన బ్లీచింగ్‌గా ఉపయోగపడేది దోస లేదా కీర. వీటిని గుజ్జు చేసి ముఖానికి, మెడకు, చేతులకు రాసుకోవాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. జిడ్డు చర్మం గల వారికి ఈ ప్యాక్ బాగా పని చేస్తుంది.

## మంచి పని

# స్టీలుతో ప్లాస్టిక్‌పై యుద్ధం

**నే**డు పార్టీలు, ఫంక్షన్లలో అలంకరణకు వాడే పువ్వుల దగ్గర నుంచి, ప్లేట్లు, గ్లాసుల వరకూ ప్రతీది ప్లాస్టిక్కే. మీ ఇల్లు, మా ఇల్లు అని తేడా ఏమీ లేదు. ఇలా పడేసిన ప్లాస్టిక్ చెత్త అంతా డంప్‌యార్డ్‌ల వద్ద గుట్టలుగా పేరుకుపోతోంది. అక్కణ్ణుంచి వెలువడే విషవాయువులు మన ఆరోగ్యాలను తినేస్తున్నాయి. భవిష్యత్తు తరాలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నాయి. ఈ సమస్య తలెత్తకుండా మరే మార్గం లేదా? 'ఉంది, మన జీవనశైలిని మార్చుకోవడం మన చేతుల్లోనే ఉంది పర్యావరణానికి హాని తలెత్తకుండా' అంటారు బెంగళూరుకు చెందిన లక్ష్మి శంకరన్. పార్టీలకు 'రెంట్ –ఎ – కట్లరీ' పేరుతో స్టీలు ప్లేట్లు, గ్లాసులు, కప్పులు.. అద్దెకు ఇస్తూ ప్లాస్టిక్ వాడకంపై యుద్ధాన్ని ప్రకటించారు. మన దగ్గర కూడా టెంట్‌హౌజుల్లో పెద్ద పెద్ద వంట పాత్రలు రెంట్‌కు తెస్తుంటారు. కానీ ప్లేట్లు, గ్లాసుల విషయంలో ఎవరూ అంతగా పట్టించుకోరు. సామాజిక స్పృహతో లక్ష్మి దంపతులు ఈ పనిని చేపట్టారు. 'పట్టణాలలో, నగరాలలో ప్లాస్టిక్ వినియోగమే ఎక్కువ. ఈ సమస్యను తగ్గించడానికి చేసిన ప్రయత్నమే ఇది. ఈ స్టీలు కట్లరీని రెంట్‌కి ఇవ్వడం ద్వారా వచ్చే డబ్బును స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇచ్చే ఏర్పాటు చేశాం' అని తెలియజేశారు.



● లక్ష్మీ శంకరన్

ఇంట్లో చేసే పూజాది కార్యక్రమాలు, పార్టీలు, కమ్యూనిటీ ఈవెంట్స్, కార్పొరేట్ ఫంక్షన్స్, గెట్ టు గెదర్స్ పార్టీలకు ఈ కట్లరీని రెంట్‌కు తీసుకెళ్లేవారి సంఖ్య పెరుగుతోందట. మూడేళ్లక్రితం పదివేల ప్లేట్ సెట్స్‌తో మొదలుపెట్టిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా చాలామంది మద్దతే లభిస్తుండటం విశేషం. ఈ స్ఫూర్తితో తమ ఇళ్లలో జరిగే పార్టీలకు స్టీల్ ప్లేట్ల సెట్స్‌ను అద్దెకు తెచ్చుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

# నిచ్చెన వెయ్యడం వరకే మనం! ఎక్కడం.. పిల్లలే నేర్చుకోవాలి!!

**కి**రణ్‌రావ్ ఒకప్పుడు ఆమిర్‌ఖాన్ భార్య. తప్పుగా అనుకోకండి. ఇప్పుడూ ఆమిర్‌ఖాన్ భార్యే. అయితే అంతకుమించిన గుర్తింపునే ఆమె సంపాదించుకున్నారు. 'ధోబీఘాట్', 'దంగల్' 'సీక్రెట్ సూపర్‌స్టార్', 'తాలాష్' సినిమాలు సూపర్‌హిట్ అయ్యాక, కిరణ్‌రావ్‌కి సూపర్‌హిట్ చిత్రాల దర్శక నిర్మాతగా పేరు వచ్చింది. ఏదైనా ఒక దాని మీద ఇండస్ట్రీలో మాటా మాట వచ్చిందంటే.. 'మనకెందులే' అని దూరంగా ఉండిపోరు కిరణ్. అది ఆమెకు ఉన్న ఇంకో ఐడెంటిటీ. బాలీవుడ్‌లో ఇప్పుడొక టాక్ నడుస్తోంది. నెపోటిజం ముందు పుట్టి బాలీవుడ్ తర్వాత పుట్టిందని! నెపోటిజం అంటే బంధుప్రీతి. కొత్తవాళ్లలో ఎంత టాలెంట్ ఉన్నా.. నిర్మాతలు గానీ, డైరెక్టర్లు గానీ.. సొంతవాళ్లనే పైకి తెస్తుంటారని ఒక అభిప్రాయం ఉంది. ''అవును నిజమే'' అన్నారు కిరణ్! ఏంటి నిజం? అభిప్రాయం ఉండడం నిజం అనా? ''కాదు. బంధుప్రీతి ఉంది అన్న మాట నిజం'' అని ఆమె అన్నారు. ''ఎక్కడ లేదు చెప్పండి బంధుప్రీతి? అన్నిచోట్లా ఉంది. అలాగే సినిమా ఇండస్ట్రీలోనూ ఉంది. అయితే ఇండస్ట్రీలో మనకు తెలిసినవాళ్లు ఉన్నారని టాలెంట్‌కి పదును పెట్టుకోకుండా ఎవరూ ముందుకు వెళ్లిపోకూడదు. వెళితే ఇబ్బందులు పడతారు. విమర్శలకు నొచ్చుకుంటారు. పిల్లల్ని వాళ్లు కోరుకునేలా తీర్చిదిద్దాలి తప్పితే, వాళ్లు చేయవలసిన వర్క్‌ని కూడా మనమే తీర్చిదిద్దే పని పెట్టుకోకూడదు. చివరికి నిలిచేది మాత్రం టాలెంటే. టాలెంట్ ఉంటే మన తరపున ఎవరూ మాట్లాడనక్కర్లేదు'' అన్నారు కిరణ్‌రావ్.



● కిరణ్‌రావ్

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



నేడు కొసరాజు జయంతి

**పల్లవి :**
భలేఛాన్స్... భలేచాన్సులే...
భలేచాన్సులే భలేచాన్సులే
లలలాం లలలాం లక్కీఛాన్సులే
భలేచాన్సులే...
ఇల్లరికంలో ఉన్న మజా...
ఇల్లరికంలో ఉన్న మజా అది అనుభవించితే
తెలియునులే
భలేచాన్సులే...

**చరణం : 1**
అత్తమామలకు ఒక్క కూతురౌ అదృష్ట
యోగం పడితే (2)
బావమరదులే లేకుంటే ఇంటల్లుడిదేలే అధి
కారం
భలేచాన్సులే...

**చరణం : 2**
గంజిపోసినా అమృతంలాగా కమ్మగ ఉంద
నుకుంటే
బహుకమ్మగ ఉందనుకుంటే
ఛీ ఛా ఛీ ఛా అన్నా చిరాకు పడక
దులపరించుకు పోయేవాడికి భలేచాన్సులే
॥ఇల్లరికం॥

**చరణం : 3**
జుట్టు పట్టుకొని బయటికీడ్చినా చూరు పట్టు
కొని వేలాడీ (2)
దూషణ భూషణ తిరస్కారములు ఆశీస్సు
లుగా తలచేవాడికి...
॥భలేచాన్సులే॥

**చరణం : 4**
అణిగీ మణిగీ ఉన్నామంటే అంతా మనకే
చిక్కేది (2)
మామలోభియై కూడబెట్టితే
మనకే కాదా దక్కేది
అది మనకే కాదా దక్కేది
ఇహ మనకే కాదా దక్కేది
అది మనకే ఇహ మనకే
అది మనకే మనకే మనకే
మనకే మ మ మ మనకే

**చిత్రం : ఇల్లరికం (1959)**
**రచన : కొసరాజు**
**సంగీతం : టి.చలపతిరావు**
**గానం : మాధవపెద్ది సత్యం**

కట్‌చేయండి...దాచేయండి...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | | | 1 | 5 | 4 | | 3 | 7 |
| | 3 | | | | 2 | 6 | 1 | |
| | 1 | 4 | | | | 9 | | |
| | | | 2 | 1 | 3 | | | |
| 9 | | 2 | | 6 | | 1 | | 3 |
| | | | 5 | 4 | 9 | | | |
| | | 1 | | | | 8 | 6 | |
| | 7 | 9 | 8 | | | | 5 | |
| 5 | 8 | | 4 | 9 | 1 | | | 2 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 8 | 9 | 5 | 6 | 1 | 4 | 3 | 2 |
| 1 | 6 | 3 | 8 | 4 | 2 | 5 | 7 | 9 |
| 5 | 4 | 2 | 7 | 9 | 3 | 1 | 8 | 6 |
| 4 | 3 | 8 | 6 | 2 | 9 | 7 | 1 | 5 |
| 2 | 5 | 6 | 1 | 7 | 4 | 3 | 9 | 8 |
| 9 | 1 | 7 | 3 | 5 | 8 | 2 | 6 | 4 |
| 8 | 2 | 4 | 9 | 3 | 7 | 6 | 5 | 1 |
| 3 | 9 | 5 | 4 | 1 | 6 | 8 | 2 | 7 |
| 6 | 7 | 1 | 2 | 8 | 5 | 9 | 4 | 3 |

## ఆ భయం పోయింది



● కాజల్

దుబాయ్‌లో మస్తుగా బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు కాజల్ అగర్వాల్. ఈ సందర్భంగా ఆమె అక్కడ ఉన్న ఓ ప్రైవేట్ జూలోకి వెళ్లారట. అక్కడి జంతువులతో సరదాగా టైమ్ స్పెండ్ చేశారు. ఈ విషయాన్నే కాజల్ చాలా ఎగ్జైటింగ్‌గా చెబుతున్నారు. ''కొన్ని జంతువులంటే నాకు చాలా భయం ఉండేది. వాటిని ఇంత క్లోజ్‌గా చూస్తానని అనుకోలేదు. ఇప్పుడు ఆ భయం పోయింది. ఇలా నా భయం దూరం కావడానికి సహకరించిన వారికి ధన్యవాదాలు. నా బర్త్‌డే సెలబ్రేషన్ విభిన్నంగా, మంచి అనుభూతితో జరిగినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు కాజల్. ఇక కాజల్ సినిమాల ప్రస్తావనకు వస్తే.. ఆమె తెలుగులో ఒక కథానాయికగా నటించిన 'రణరంగం' చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. శర్వానంద్ హీరో. అలాగే తమిళంలో కాజల్ నటించిన 'కోమలి, ప్యారిస్ ప్యారిస్' విడుదలకు సిద్ధమయ్యాయి. కమల హాసన్ 'ఇండియన్ 2'లో కథానాయికగా నటించనున్నారు. మరోవైపు 'మను చరిత్ర' అనే సినిమాను సమర్పిస్తున్నారు.



● సెలబ్రేషన్స్‌లో...

# రాక్షసుడు రెడీ

'రాక్షసుడు' అనగానే రామాయణ, మహా భారతాల్లోని విలన్లే గుర్తుకు వస్తారు. సినిమా వాళ్లకు అయితే గతంలో చిరంజీవి హీరోగా నటించిన సూపర్ హిట్ సినిమా గుర్తుకు వస్తుంది. ఇప్పుడు మరో సారి అదే టైటిల్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. ఏ స్టూడియోస్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కింది. హీరో హవీశ్ ప్రొడక్షన్‌లో రమేశ్ వర్మ దర్శకత్వం వహించారు. చిత్రీకరణ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సినిమా హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ అభిషేక్ పిక్చర్స్ ఫ్యాన్సీ రేటుకు సొంతం చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి జూలై 18న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు నిర్మాత కోనేరు సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''ఫిబ్రవరి 21న ప్రారంభమైన మా 'రాక్షసుడు' చిత్రం సింగిల్ షెడ్యూల్‌లో 85రోజుల పాటు షూటింగ్ జరుపుకుంది. ఇప్పుడే సినిమా రష్ చూశాను. అద్భుతంగా ఉంది. సినిమా మొదలు పెట్టిన రోజు నుండే ఓ మంచి సినిమా తీస్తున్నామనే ఫీలింగ్ ఉండేది. ఈ రోజు రష్ చూశాక బ్లాక్‌బస్టర్



● సాయి శ్రీనివాస్

సినిమా తీశాం అని నమ్మకంగా ఉంది'' అన్నారు. రమేశ్‌వర్మ మాట్లాడుతూ– ''నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన నిర్మాత సత్యనారాయణగారికి కృతజ్ఞతలు. మంచి టీమ్ కుదరడంతో అనుకున్న ప్రకారం సినిమాను ముగించగలిగాం'' అన్నారు.



● వీవీ వినాయక్

## ఆగస్టులో ఆరంభం

'ఆది, దిల్, ఠాగూర్, అదుర్స్, నాయక్, ఖైదీ నంబర్ 150' ఇలా ఎన్నో హిట్ సినిమాలకు దర్శకత్వం వహించిన దర్శకుడు వీవీ వినాయక్ ఇక నటుడిగా లొకేషన్‌లోకి అడుగుపెట్టనున్నారు. అవును.. వీవీ వినాయక్ లీడ్ రోల్‌లో ఓ సినిమా తెరకెక్కనుంది. 'దిల్' రాజు నిర్మిస్తారు. నరసింహ రావు దర్శకుడు. ఈ సినిమా పూజా కార్యక్రమం త్వరలోనే జరుగుతుందని తెలిసింది. అలాగే రెగ్యులర్ షూటింగ్‌ను ఆగస్టు రెండోవారంలో టీమ్ ప్లాన్ చేసిందని సమాచారం. సెట్లో నటీనటులతో ఎలా చేయాలో చెప్పి, చేయించుకున్న వినాయక్‌కి నటన పెద్ద కష్టం కాదని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు.

## అదే అంకిత భావంతో ఉన్నా



● కేఎస్ రామారావు

''యాభై ఏళ్ల క్రితం నా మూవీ మేకింగ్ స్టైల్ ఎలా ఉండో ఇప్పుడూ అలానే ఉంది. అలాగే పని జరగనప్పుడు వచ్చే కోపం కూడా అలానే ఉంది. కానీ పని విషయంలో మాత్రం అంకిత భావం తగ్గలేదు. టెక్నికల్‌గా చాలా అడ్వాన్స్‌డ్ స్టేజ్‌కి వచ్చాం. సినిమా క్వాలిటీ పెరగడంతో మంచి సినిమాలు రావడానికి అవకాశాలు ఎక్కువయ్యాయి'' అని నిర్మాత కేఎస్ రామారావు అన్నారు. ఐశ్వర్యారాజేష్, రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రధారులుగా భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి: ది క్రికెటర్'. తమిళంలో రూపొందిన 'కనా' చిత్రానికి ఇది తెలుగు రీమేక్. క్రియేటివ్ కమర్షియల్‌పై కేఎస్ రామారావు నిర్మించిన ఈ సినిమాను వచ్చేనెల రెండో వారంలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా కేఎస్. రామారావు చెప్పిన విశేషాలు.

● మా బ్యానర్‌లో రాబోతున్న మంచి సినిమా 'కౌసల్య కృష్ణమూర్తి'. తమిళంలో విడుదలైన 'కనా' సినిమాను చూశాను. ఈ చిత్రాన్ని ఎలాగైనా తెలుగు ప్రేక్షకులకు చూపించాలని 'కౌసల్య కృష్ణమూర్తి'గా రీమేక్ చేశాం. తండ్రీకూతుళ్ల అనుబంధానికి సంబంధించిన మంచి ఎమోషనల్ స్టోరీ. క్రికెట్ బేస్‌తో పాటు కంటెంట్ ఉన్న స్టోరీ. ఈ చిత్రం క్రికెట్ అభిమానులతోపాటు యూత్‌కి, ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్లు భీమనేని తెరకెక్కించారు.

● ఒక సాధారణ రైతుబిడ్డగా పుట్టి ఇండియా క్రికెట్ టీమ్‌లో ఆడాలని కష్టపడే ఓ యువతి పాత్రలో ఐశ్వర్య నటించింది. ప్యారలల్‌గా రైతుసమస్యలను కూడా ప్రస్తావించడం జరిగింది. ఐశ్వర్య రాజేష్ తండ్రి అమర్‌నాథ్ సీనియర్ హీరో. మన కమెడియన్ శ్రీలక్ష్మి మేనకోడలు తను. వీరిద్దరి వారసత్వ నటన ఐశ్వర్యకు వచ్చింది. ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్‌గారు అద్భుతమైన పాత్ర చేశారు. శివ కార్తికేయన్, 'వెన్నెల' కిశోర్, కార్తీక్‌రాజు క్యారెక్టర్స్‌కు మంచి ఇంపార్టెన్స్ ఉంది. జూలై 2న ప్రీ–రిలీజ్ ఈవెంట్‌ను జరపబోతున్నాం. ఈ కార్యక్రమానికి విమెన్ టీమ్ ఇండియా కెప్టెన్‌గా చేసిన మిథాలీరాజ్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొనున్నారు.

● పెద్దసినిమాలు చేస్తున్నప్పుడు ఎంత సంతృప్తిగా ఉంటానో 'పుణ్యస్త్రీ, మాతృదేవోభవ, ముత్యమంత ముద్దు' తీస్తున్నప్పుడూ అంతే సంతృప్తిగా ఫీలవుతాను. ఇవన్నీ కూడా సినిమాలపై ఇంకో వైపు నాకున్న ఇంట్రెస్ట్‌ను తెలియజేసే చిత్రాలు..'కౌసల్య కృష్ణమూర్తి' కూడా అలాంటిదే.

## అచ్చమైన ప్రేమకథ....



● శివాత్మిక, ఆనంద్

తెలంగాణ ప్రాంతంలో 80వ దశకంలో జరిగిన స్వచ్ఛమైన ప్రేమకథగా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది 'దొరసాని'. విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ, శివాత్మిక రాజశేఖర్‌లు హీరో హీరోయిన్‌లుగా పరిచయమవుతున్నారు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, బిగ్‌బెన్ సినిమాస్ నిర్మించారు. 'మధుర' శ్రీధర్‌రెడ్డి, యశ్ రంగినేని నిర్మించిన ఈ చిత్రాన్ని డి. సురేశ్‌బాబు సమర్పిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కేవీఆర్ మహేంద్ర దర్శకునిగా పరిచయం అవుతున్నారు. జూలై 12న సినిమాని విడుదల చేయబోతున్నామని నిర్మాతలు తెలిపారు. ''శివాత్మిక, ఆనంద్ అద్భుతంగా నటించారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్రం టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. దాంతో 'దొరసాని' చిత్రంపై అంచనాలు పెరిగాయి. ఆ మధ్య విడుదల చేసిన 'నింగిలోన పాలపుంత నవ్వులొంపెనే...' బాగా హిట్టయింది. ఈ చిత్రంలోని మరో పాట 'కలవరమై..'ను సోమవారం విడుదల చేస్తాం. ఈ పాటకు కూడా మంచి స్పందన వస్తుందనే నమ్మకం ఉంది. కల్మషం లేని ప్రేమకథ మా 'దొరసాని'' అంటున్నారు దర్శక–నిర్మాతలు. ప్రశాంత్. ఆర్ విహారి ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు.

## ఇలాంటి సినిమాలనే యూత్ ఆదరిస్తున్నారు

**- వెంకటేశ్**



● వెంకటేశ్‌తో కృష్ణ, గౌతంరాజు

కమెడియన్ గౌతమ్‌రాజు తనయుడు కృష్ణ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'కృష్ణారావ్ సూపర్ మార్కెట్'. శ్రీనాథ్ పులకరం దర్శకత్వం వహించారు. ఇటీవల ఈ చిత్రం టీజర్ రిలీజైంది. రిలీజైన ఈ చిత్రం టీజర్‌ను వెంకటేశ్ అభినందిస్తూ– ''కృష్ణారావ్ సూపర్‌మార్కెట్' టీజర్ నాకు చాలా బాగా నచ్చింది. రియలిస్టిక్‌గా ఉంది. ప్రస్తుతం ఇలాంటి సినిమాలనే యూత్ ఎంకరేజ్ చేస్తున్నారు. కృష్ణ నటుడిగా మంచి గుర్తింపు పొందాలని కోరుకుంటున్నాను. టీమ్ అందరికీ ఆల్‌ది బెస్ట్'' అన్నారు వెంకటేశ్. ''త్వరలోనే రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం. సపోర్ట్ చేసిన వెంకటేశ్‌గారికి కృతజ్ఞతలు'' అన్నారు గౌతంరాజు. ''టీజర్ అందర్నీ ఆకట్టుకుంటుంది. సినిమా మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం'' అన్నారు కృష్ణ.



● జాన్వీ కపూర్

## నా వయసు పది!

రెండుపదుల వయసు దాటి రెండేళ్లు దాటినా ఇప్పటికింకా తన వయసు నిండా పదేళ్లే అంటున్నారని నిట్టూరుస్తున్నారు యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్. 'చాలా యంగ్ ఏజ్‌లో ఇండస్ట్రీలోకి వచ్చారు. ఈ భావన మీకు ఎలా అనిపిస్తుంది?' అన్న ప్రశ్నను జాన్వీ ముందు ఉంచితే... ''ప్రాపర్ డైట్ అండ్ వర్కౌట్స్‌తో ఫిజికల్‌గా నేను బాగానే ఉన్నాను. కానీ మెంటల్‌గా కొంచెం స్ట్రాంగ్ కావాల్సి ఉంది. నేను మానసికంగా చాలా యంగ్‌గా ఉంటానని, పదేళ్ల వయసు ఉన్న అమ్మాయిలా ప్రవర్తిస్తానని కొందరు నాతో అంటుంటారు. అందుకే నేను మానసికంగా త్వరగా ఎదగాలి అనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం 'రూహి అఫ్జా' అనే హారర్ మూవీలో రాజ్‌కుమార్ రావుతో కలిసి నటిస్తున్నారు జాన్వీ. అలాగే 'కార్గిల్ గాళ్' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌లో కూడా నటిస్తున్నారామె. గత ఏడాది 'ధడక్' సినిమాతో ఆమె సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## జై సేన విజయం సాధించాలి

**- గోపీచంద్**



● గోపీచంద్‌తో సముద్ర, సునీల్...

శ్రీకాంత్, సునీల్, శ్రీ, పృథ్వీ, ప్రవీణ్, కార్తికేయ ప్రధాన తారాగణంగా వి. సముద్ర దర్శకత్వంలో రూపొందిన సినిమా 'జై సేన'. వి. విజయలక్ష్మి సమర్పణలో వి. సాయి అరుణ్‌కుమార్ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన గోపీచంద్ మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. శ్రీకాంత్‌గారితో పాటు కొంత మంది కుర్రాళ్లు నటించారు. సునీల్‌ది స్పెషల్ రోల్. ఈ సినిమా విజయం సాధించాలి. సముద్ర ఇంకా మంచి సినిమాలు చేయాలి'' అన్నారు. ''శ్రీకాంత్, సునీల్ పాత్రలు హైలైట్‌గా ఉంటాయి. నలుగురు యువహీరోలు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. వారి పాత్రలకు ఇంపార్టెన్స్ ఉంటుంది'' అన్నారు సముద్ర. ''త్వరలోనే రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు సహ–నిర్మాత పి. శిరీష్ రెడ్డి.

## రొమాంటిక్ ఎంటర్‌టైనర్

నందు, ప్రియాంకా శర్మ జంటగా నటించిన చిత్రం 'సవారి'. 'బంధం రేగడ్' అనే ఇండిపెండెంట్ మూవీతో అందరి దృష్టిని ఆకర్షించిన సాహిత్ మోతుకూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కాల్వ నరసింహ స్వామి ప్రొడక్షన్స్, నిషా ఫిలింస్ పతాకాలపై సంతోశ్ మోతుకూరి, నిషాంక్ రెడ్డి కుడితి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలైంది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''ఔట్ అండ్ ఔట్ న్యూ ఏజ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. జంతు నేపథ్యంలో యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. ఈ సినిమాలో గుర్రం పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ఫ్రెష్ స్టోరీతో నిర్మించిన మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: మోనిశ్ భూపతిరాజు.



● ప్రియాంక, నందు







సాక్షి ఫ్యామిలీ సన్నిధి
విజయవాడ ॥ ఆదివారం
23-6-2019

## సంగీత సాహిత్యం



# తక్కువేమి మనకు..


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి.. నను బ్రోవమని చెప్పవే/ నను బ్రోవమని చెప్పు నారీ శిరోమణి జనకుని కూతురా.. జననీ జానకమ్మా!/ లోకాంతరంగుడు..శ్రీకాంత నిను గూడి..ఏకాంతమున ఏకశయ్యానున్నా వేళ నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ.. /ఆద్రీజావినుతూడు..భద్రగిరీశుడు..నిద్రా మేల్కొనూ వేళ..నెరతలో బోధించి నను బ్రోవమని చెప్పవే..సీతమ్మ తల్లీ !–అంటూ కీర్తన చేశాడు రామదాసు.ఈ కీర్తన వినని తెలుగువారుండరు. మనకున్న వాగ్గేయకారుల్లో అన్నమయ్య, త్యాగయ్య, శ్యామశాస్త్రిలను గురించి వారి కీర్తనలను గురించి ఇప్పటిదాకా కొంత తెలుసుకున్నాం. ఇప్పుడు రామదాసు గురించి ఆయన కీర్తనల గురించి తెలిపే ప్రయత్నం చేస్తాను. ఈ వాగ్గేయకారులు సంగీతాన్ని నాదోపాసనగా స్వీకరించి వాగ్గేయకారులైనారు. వారికి ఎప్పుడెప్పుడు ఏ సందర్భాలలో ఏది చెప్పుకోవాల్సి వచ్చినా పరమాత్మకే చెప్పుకున్నారు.

గోల్కొండ సామ్రాజ్యంలో నేలకొండపల్లె అనే గ్రామంలో కంచర్ల లింగన్న, కామాంబ దంపతులకు పుట్టిన గోపన్న అనే పిల్లవాడే భక్తరామదాసుగా తదనంతర కాలంలో ప్రాచుర్యం పొందాడు. పుట్టినప్పటి నుంచీ రామభక్తి ఏర్పడింది. ఆయన చిన్నతనంలో కబీర్ దాసుగారు రామనామ మంత్రోపదేశం చేశారు. ఎంత పొంగిపోయారంటే..''తారకమంత్రము కోరిన దొరికెను, ధన్యుడనైతిని ఓరన్నా' అని చిందులు వేసాడు. వివాహమయింది. ఒక కుమారుడు. పేరు రఘురాముడు. దాచుకోవడం చేత కాదు. ఎవరు కనబడినా సీతారాములుగా భావించి అన్న సంతర్పణ చేసేయడంతో ఐశ్వర్యమంతా కొండకరిగినట్లు కరిగిపోయింది. తల్లిదండ్రులు గతించారు. భార్యకు పుట్టింటివారు పెట్టిన నగలు కూడా కరిగిపోయాయి. గోల్కొండ తానీషా దగ్గర మంత్రులుగా పనిచేస్తున్న ఆయన మేనమామలు అక్కన్న, మాదన్నలు తీసుకెళ్ళి భద్రాచలం తహశీల్దారుగా ఉద్యోగం వేయించారు.

అక్కడ జీతం డబ్బులు చేతికందిన రోజునుంచీ మళ్ళీ అన్నదానాలే. పన్నులు వసూలు చేయడానికి వెళ్లినప్పుడల్లా రైతుల దగ్గర కొంత సొమ్ము చందాల కింద సేకరించారు. భద్రాచల రామచంద్రమూర్తికి దేవాలయ నిర్మాణం చేసారు. కానీ ఉత్సవాలు, వేడుకలు, ఆభరణాలు చేయడానికి సరిపడా నిధులు సమకూర లేదు. పన్నుల రూపేణా ప్రభువుకు కట్టవలసిన సొమ్ము 6 లక్షల వరహాలున్నాయి.

ఈ సొమ్ముని కట్టకపోతే మాత్రం ఏం, ప్రభుత్వ ఖజానాలో కావాల్సినంత ఉంది కదా అని భావించి దానితో ఆలయ నిర్మాణం పూర్తి చేసి, స్వామికి కావలసిన వాహనాలు, ఆభరణాలూ అన్నీ చేయించారు. గిట్టనివాళ్ళు ఫిర్యాదు చేస్తే.. తానీషా నిలదీసాడు.'వాడిన మాట నిజమే, కానీ నా స్వంతానికి వాడలేదు. రామ కైంకర్యానికి వాడాను. ప్రభువుగా మీరు చేయవలసిన పనిని మీ అనుమతి లేకుండా స్వతంత్రించి చేసాను. ఇది నా అపరాధమే' అని బదులిచ్చారు. ఆయన వెంటనే కారాగార శిక్ష వేసారు.

'నా రాముడికోసం ఏదయినా అనుభవిస్తాను' అనుకున్నారు. అప్పుడు గోల్కొండలో రామదాసు శిక్ష అనుభవించిన బందీఖానా ఇప్పటికీ ఉంది. చేతులకి ఇనుప సంకెళ్ళు వేసి చీకటి గదిలో ఉంచారు. వండుకు తినమని పావుశేరు బియ్యం, కేవలం ఉప్పు మాత్రం ఇచ్చారు. గోడమీద సీతారాముల బొమ్మలు చెక్కుకుని వాటికి నివేదన చేసి ఆ క్షారాన్నాన్ని క్షీరాన్నంగా భావించి తినేవారు. తలమీద పెద్ద పెద్ద బరువులు పెట్టి భగభగమండే ఎండలో నిలబెట్టి కొరడాలతో కొట్టేవారు. చర్మం లేచిపోయి నెత్తురోడుతూంటే ....''తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు...' అని ఆ చక్రం పట్టుకున్న రామచంద్రమూర్తి నాకు అండగా ఉండగా నాకొచ్చిన లోటేమిటి... అని తన్మయత్వంతో కీర్తనను ఆలపించారు. భటులు వెళ్ళి తానీషాకు చెబితే ఆయన ఆశ్చర్యపోయారట. రామదాసు, అన్నమయ్యవంటి వాగ్గేయకారులుండగా 'తక్కువేమిటి మనకు...'

## గురు సన్నిధి

### శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి



మానస సంచరరే బ్రహ్మణి..... అంటూ మనసును సున్నితంగా మందలించినా, రామ నామ మహిమను చెబుతూ పిబరే రామ రసం... అని కీర్తించినా, గోపాలుడ్ని భజించమంటూ భజరే గోపాలం... అంటూ ఆలపించినా... ఆ కీర్తనల వెనుక గుర్తొచ్చేది ఓ మహాకవి. తన కీర్తనలతో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలనే త్రివేణీ సంగమాన్ని సృష్టించిన ఆ మహాయోగి, సంగీత సామ్రాట్టే కాదు... అద్వైత తత్వవేత్త కూడా. ఆయనే శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతీ స్వామివారు.

కర్ణాటక సంగీతంలో అత్యుత్తమమైనవిగా పరిగణించే వీరి కీర్తనలు వింటుంటే మనసు పరబ్రహ్మంతో సంగమిస్తుంది. ఆధ్యాత్మిక భావం అంతరంగాన్ని ప్రక్షాళనచేసి అద్వైతామృతవర్షాన్ని కురిపిస్తుంది.

**'గురుపాదాలను ఆశ్రయించి.....'**

బ్రహ్మేంద్రుల అసలు పేరు శివరాముడు. తండ్రి మోక్ష సోమసుందర అవధాని. తల్లి పార్వతమ్మ. తమిళనాడులో స్థిరపడ్డా.... వీరి పూర్వీకులు కర్నూలు ప్రాంతం వారే! చిన్నవయసులోనే వేద శాస్త్రాలతోపాటుగా సంగీతాన్ని అభ్యసించారు సదాశివ బ్రహ్మేంద్రులు. వివాహం అయిన కొంత కాలానికి వైరాగ్యభావనతో ఇల్లువిడచి యోగాన్వేషణకై అడవులలో తిరుగుతూ ఆనాటి కంచి కామకోటి పీఠ శంకరాచార్యులు శ్రీ పరమశివేంద్ర సరస్వతీస్వామి వారిని కలుసుకున్నారు. ఆయన వీరికి సన్యాస దీక్ష ప్రసాదించి సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతిగా ప్రకటించారు. వారి వద్దనే శిష్యరికం చేస్తూ బ్రహ్మసూత్రాలు, పతంజలి సూత్రాలకు భాష్యం రచించారు శ్రీ సదాశివులు. జ్ఞానుల ఆంతరంగిక అనుభూతిని తెలుపుతు ఆత్మ విద్యావిలాసం అన్నగ్రంథం ఎంతో మందికి మోక్షమార్గాన్ని చూపింది. వీటితోపాటు పలు అంశాలపై రాసిన తమ రచనలన్నింటిని గురుపాదాలకు సమర్పించారు.

* * *

**'నాలుగునెలలు సమాధిలో.....'**

ఒకసారి వీరు నదిఒడ్డున సమాధి స్థితిలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా వరదవచ్చి అంతా ముంచేసింది. అందరు హెచ్చరిస్తున్నా సదాశివులు ఏమీ పట్టనట్టు కూర్చునుండి పోయారు. వారి శరీరం వరదలో కొట్టుకుపోయి ఇసుకలో కూరుకుపోయింది. నాలుగు నెలల తర్వాత రైతులు అదే ప్రదేశంలో ఇసుక తవ్వుతుంటే శరీరం బయట పడింది. సమాధిస్థితిలో ఉన్న సదాశివులు లేచి మాట్లాడకుండా అక్కడినుండి వెళ్లి పోయారు. ఆశ్చర్యపోవడం జనాల వంతైంది. ఇలాంటి అలౌకిక మహిమలెన్నింటినో వారి జీవితంలో ప్రదర్శించారు.

* * *

**మోక్షసాధనకు కీర్తనలు**

శ్రీసదాశివ బ్రహ్మేంద్ర సరస్వతిస్వామివారు సంస్కృతంలో రాసిన ఇరవై నాలుగు కీర్తనలలో శ్రీరాముని పరంగా అయిదు, శ్రీ కృష్ణునిపై ఎనిమిది కీర్తనలు, ఆత్మబోధగా ఐదు, గురువులైన పరమశివేంద్రులను కీర్తిస్తూ ఒకటి, గంగానది పరంగా ఒకటి ఉండగా, మిగిలిన నాలుగు కీర్తనలు బ్రహ్మానందమంటే ఏమిటో వివరిస్తాయి. గంభీరమైన ఆత్మబోధతోపాటు సంగీతా మాధుర్యం తొణికిసలాడే ఈ కీర్తనలు మోక్ష సాధనకు సోపానాలు.

సన్యాస జీవనాన్ని గడుపుతూ, మోక్ష మార్గంలో సంగీతాన్నే సాధనగా మలచుకున్న శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతీస్వామి వారు తమిళనాడులోని నెరూర్‌లో భౌతికదేహాన్ని వదిలారు. వీరి దివ్య అధిష్ఠానాన్ని దర్శించేందుకు సామాన్య భక్తులేగాక విశేషంగా శృంగేరి పీఠ పరంపరలోని పీఠాధిపతులు సైతం వెళ్లి వారిని అర్చించటం ఆచారంగా వస్తున్నది. ప్రతి ఏటా ఐదురోజులపాటు జరిగే వీరి ఆరాధనలలో సంగీతోత్సవాలు ప్రత్యేక ఆకర్షణ.

**– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని**
వేదపండితులు

## బౌద్ధవాణి

# దుఃఖ కారకాలు!



పూర్వం విదేహ రాజ్యంలోని మిథిలా నగరాన్ని నిమి అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆయనకు రాజ్యకాంక్ష ఎక్కువ. నిరంతరం యుద్ధాల్లో మునిగి తేలేవాడు. ప్రశాంతత ఎరగడు. నిద్రకూడా కరువే. నింతరం భయమే! ఎవరు ఎప్పుడు దాడి చేస్తారో, ప్రమాదం ఏ మూల నుండి పొంచుకు వస్తుందో అనే భయం వెన్నంటే ఉండేది. ఆయనకు రాజ్యం పెరిగిన కొద్దీ రక్షణ భయం పెరిగిపోయింది.

ఒకరోజున సేనల్ని వెంట తీసుకుని పొరుగు రాజ్యంపై యుద్ధానికి బయలు దేరాడు. దారిలో ఒక జంతు కళేబరం పడి ఉంది. అక్కడ కుక్కలు కాట్లాడుకుంటున్నాయి. గద్దలు చేరి పొడుచుకు తింటున్నాయి. ఆహారం తమకే చెందాలని ప్రతిదీ మరోదానితో తన్నులాటకు దిగుతోంది. గుర్రం వేగాన్ని ఆపి రాజు నెమ్మదిగా పోతున్నాడు.

అంతలో మంచి జబ్బముక్కను చీల్చి, గోళ్లతో పట్టుకుని ఒక గ్రద్ద ఆకాశంలోకి లేచింది. దాని వెంట కొన్ని గ్రద్దలు పడ్డాయి. మిగిలిన గద్దలు దాన్ని పొడిచాయి. తన్నాయి. నానాహింసలూ పెట్టాయి. బాధ భరించలేక ఆ మాంసం ముక్కని వదిలి పెట్టింది గ్రద్ద. ఆ వదిలిన ముక్కను మరో గ్రద్ద తన్నుకుపోయింది. ఇక గ్రద్దలన్నీ దాని వెంట పడ్డాయి. పొడిచాయి. తన్నాయి. చివరికి అదీ వదిలి పెట్టింది. ఆ ముక్కని మరో గ్రద్ద పట్టుకుంది. అదీ తన్నులు తింది.

రాజు వెళ్తూ ఈ తతంగం అంతా చూశాడు. ''ఆ మాంసం ముక్క ఏ గ్రద్ద దగ్గర ఉందో, దానికి తన్నులు తినక తప్పలేదు. మరెవరికీ పంచకుండా అదొక్కటే తినాలనే దాని దురాశే అది తన్నులు తినడానికి కారణం. ఏ గ్రద్ద అయితే ఆ మాంసాన్ని వదులుకుందో దానికి దుఃఖోపశమనం కలిగింది. ప్రస్తుత నా పరిస్థితి ఇలాగే ఉంది. మాంసం ముక్కని పట్టుకుని, దురాశతో దూరంగా పోతున్న గ్రద్ద పరిస్థితీ, నా స్థితీ ఒక్కటే. అందుకే దుఃఖంతో మునిగిపోయాను. మనస్సుకి శాంతిలేకుండా పోయింది. మాంసం ముక్కని వదిలించుకున్న ప్రతి గ్రద్దా దుఃఖాన్ని వదిలించుకుంది''అని ఆలోచించి, సేనాపతిని పిలిచి– ''సేనాపతీ! సైన్యాన్ని వెనక్కి మరలించు'' అని ఆజ్ఞలిచ్చాడు. అలా నిమిరాజు యుద్ధాలు మాని, కొంతకాలం ప్రజారంజకంగా పాలించాడు. ప్రజలకూ, ఆయనకూ యుద్ధభీతి పోయింది. మరికొన్నాళ్లకు రాజ్యాన్ని మంత్రి మండలికి అప్పజెప్పి రాజ్యత్యాగం చేసి మౌనిగా మారాడు. పరమ ధార్మికుని జీవితం గడిపాడు.

హింస, దురాశ, దురాక్రమణలూ ఇవన్నీ దుఃఖ కారకాలే అని బుద్ధుడు చెప్పిన చక్కని సందేశాత్మక కథ ఇది.

**– డా. బొర్రా గోవర్ధన్**

## సువార్త

# ఆకలి కేకలు లేని సమాజ నిర్మాణమే దైవాభీష్టం...



ఆకలి కేకలు లేని సమాజ నిర్మాణమే దైవాభీష్టం... పేదవాళ్ళు దేవుని విస్మరణకు గురైన వాళ్ళు, ధనవంతులు దేవుని ప్రియబిడ్డలు అన్న ఆలోచన తప్పు అని బైబిల్ ఖండిస్తోంది. అసలు పేదరికం, పేదవాడూ లేని వ్యవస్థ గురించి బైబిల్ మాట్లాడదు. ఎందుకంటె మనిషి ఆచరణలో అది అసాధ్యం, పైగా అంతా పెట్టుబడిదారులు, రాజులు, భూస్వాములే అయితే మరి భూమిని సాగు చేసేవాళ్ళెవరు? పంటపండించి ప్రజలందరికీ అన్నం పెట్టేవారెవరు? అయితే నిరుపేదలు, కార్మికులు లేదా పనివారి హక్కుల పరిరక్షణా ఉద్యమానికి మాత్రం దేవుడే రథసారధి!!' బీదలను కనికరించేవాడు, దేవునికి తన ధనాన్ని అప్పుగా ఇచ్చినట్టే. అందుకు దేవుడు అతనికి ప్రత్యుపకారం చేస్తాడు' అన్న ఒక్క బైబిల్ వాక్యం చాలు దేవుడు పేదల పక్షపాతి అని చెప్పడానికి (సామెతలు 19:17). వనరులన్నీ దేవుడే ఎంతో సమృద్ధిగా ఇచ్చినా వాటి యాజమాన్యాన్ని తెలివిగా మనిషి తన గుప్పిట్లోకి తెచ్చుకున్నాడు. అసలు ఆకలి కేకలు, నిరుపేదలు ఉండకూడని సమసమాజ వ్యవస్థకే దేవుడు పునాది వేసినా, కొందరి మనోదౌర్బల్యం మరికొందరి దౌష్టీకం వల్ల ప్రపంచ సంపదంతా కొద్దిమంది గుప్పిట్లోకి వెళ్లగా, అత్యధిక ప్రజలు అరకొర వనరులతో, ఇంకా చాలా మంది ఆకలి కోరల్లో చిక్కుకొన్న నేటి ఆర్థిక, సామాజిక అసమానతలు నెలకొన్నాయి. అయినా దేవుడు పేదల్ని, కార్మికుల్ని, కూలీలను విస్మరించవద్దంటూ ఎన్నో ఆదేశాలిచ్చాడు. పొలాల్లో పంట కోసేటప్పుడు పనలన్నీ కొయ్యకుండా, కొన్ని పనుల్ని పరదేశులు, పేదల కోసం వదిలేయాలని దేవుడు స్పష్టంగా ఆదేశించాడు (లేవీ 19:9,10). ఏరోజుకారోజు పనివాడి కూలీని సూర్యాస్తమయానికి ముందే ఇవ్వకపోవడం పాపమవుతుందని, అప్పుడు వాళ్ళ పక్షంగా తాను చొరవతీసుకోవలసి ఉంటుందని కూడా దేవుడు హెచ్చరించాడు (ద్వితీ 24:15). దేవుడెప్పుడూ పేదలు, బలహీనులు, నిరాశ్రయుల పక్షమేనని చెప్పడానికే ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును ఒక నిరుపేదవాడిగా, అత్యంత సాత్వికుడుగా ఈ లోకానికి రక్షకుడుగా పంపగా, ఆ ప్రభువు తల దాచుకోవడానికి కూడా స్థలం లేనటువంటి వాడుగా పేదలతో మమేకమై దేవుని ప్రేమను, మహిమను అద్భుతంగా ప్రకటించాడు. భూస్వాములు, పెట్టుబడిదారుల అహంకారాన్ని, నిరంకుశత్వాన్ని, దోపిడీని ఎండగడుతూ 'ధనవంతులు దేవుని రాజ్యంలోకి ప్రవేశించడం దుర్లభమని', 'ఆత్మవిషయమై దీనులైనవారే ధన్యులు, పరలోకరాజ్యము వారిదే' అని యేసుప్రభువు బోధించాడు. నిరుపేదల ఆలనా పాలనా, దారిద్ర్య నిర్మూలన మనిషికి దేవుడిచ్చిన ఒక అత్యంత పవిత్రమైన సామాజిక బాధ్యత. యేసుప్రభువు తన త్యాగం, బోధలు, తన జీవనశైలి ద్వారా 'క్రైస్తవాన్ని' దారిద్ర్యానికి, పేదలు, బలహీనుల దోపిడీకి వ్యతిరేకంగా, ధనవంతుల అహంకారానికి చెంపపెట్టులాంటి తిరుగులేని ఒక ఆయుధంగా ఆవిష్కరించాడు. ఎన్ని లక్షల అద్భుతమైన ప్రసంగాలు, ఎన్ని కోట్ల సుదీర్ఘ ప్రార్థనలు చేశామని కాక, ఎంతమంది నిరుపేదలు, బలహీనులు, నిరాశ్రయులకు ఆశ్రయంగా, ఆశీర్వాదకరంగా ఉన్నామన్నదే దేవుడు విశ్వాసిని ఆశీర్వదించేందుకు వాడే నిజమైన కొలబద్ద (మత్తయి 25:34–46).

పేదరికంలేని ప్రపంచాన్ని ఎలాగూ మనం నిర్మించుకోలేకపోయాం. కానీ పేదల ఆక్రందనలు వినిపించని సమాజాన్ని నిర్మించుకోవడం మాత్రం ఇంకా మన చేతుల్లోనే ఉంది, అందుకు ఇంకా ఆలస్యం కాలేదు. నీవు విత్తిన గింజలకు అవసరమైన వర్షాన్ని అనుకూల సమయంలో నేనే కురిపిస్తాను, అనూహ్యమైన సమృద్ధిని ఇస్తాను అని దేవుడే బైబిల్లో అందుకు జవాబిచ్చాడు (ద్వితీ 11:14, యెషయా 30:23). సర్వశక్తుడైన దేవుడే ఆశీర్వదిస్తానంటే, దాన్ని అడ్డుకోగల శక్తి ఈ లోకంలో ఉందా? దేవునికే చిరకాలం మహిమ కలుగును గాక.

**– రెవ.డా.టి.ఎ.ప్రభు కిరణ్**
prabhukirant@gmail.com

నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్

## ఆలయం.. ఆగమం

# నిర్మాల్యద్వారం... సోమసూత్రం



ఆలయప్రదక్షిణ చేస్తూ భక్తులు ఆలయం ఎడమవైపుకు రాగానే అక్కడ నిర్మాల్యద్వారం కనిపిస్తుంది. నిర్మాల్యద్వారం అంటే కేవలం ఆలయంలోని అభిషేకతీర్థం బయటకు రావడానికి మార్గం మాత్రమే కాదు. భక్తులు ఈ భాగం ద్వారా నేరుగా దైవీకశక్తిని గ్రహించవచ్చు. అందుకే ఈ భాగాన్ని గర్భగుడిలోని మూలమూర్తిని ఏ శిలతో నిర్మిస్తారో ఆ పురుషశిలతోనే దీన్ని కూడా నిర్మిస్తారు.

అనంతవిశ్వశక్తి ఆలయం పైభాగంలో ఉన్న విమానశిఖరం స్తూపి నుండి నేరుగా గర్భగుడిలోని మధ్యభాగంలో ప్రతిష్ఠించబడిన శివలింగం నడిభాగంపై పడుతుంది. శివలింగంపై నిరంతరం పడే జలధారతో కలిసి ఆ శక్తి నేరుగా పీఠం నుండి కిందికి జాలువారి చివరికి నిర్మాల్య ద్వారం గుండా బయటికి వస్తుంది. జాగ్రత్తగా గమనిస్తే ఆలయవిమానం పైభాగం ముకుళం (పూమొన)వలె ఉంటుంది. ఈ నాళం చివరి భాగంలో కూడా ముకుళం ఉంటుంది. ఆలయస్తూపి నుండి శక్తి ప్రవేశించి నాళముకుళం ద్వారా అధోముఖంగా ప్రవహించి భూమిలోకి వెళ్లిపోతుంది. ఈ సమయంలో కుడిచేతి నడిమివేలిని ఆ నిర్మాల్యద్వారం కొనకు ఆనించి దానిని మన నడినెత్తిపై తాకించడం వలన మన తలలోని సహస్రారం జాగృతం అవుతుంది. అనేక యోగమార్గాల నవలంబించి కఠోర సాధనతో కదిలే సహస్రారం కేవలం ఈ చిన్న ప్రక్రియతోనే చలించే అవకాశం ఉంది. అందుకే ఎన్నిసార్లు అవకాశం ఉంటే అన్నిసార్లు ఇలా చేయడం వలన ఆత్మజ్ఞానం లభిస్తుంది. ఇది ఆలయదర్శన సంప్రదాయ విధులలో ముఖ్యమైనది. చాలా మంది భక్తులు దీనిని ఆచరిస్తారు. పైగా నిర్మాల్య ద్వారం సహాయంతో ఆలయం నిర్మించిన వారెవరో కనిపెట్టవచ్చు. విష్ణ్వాలయాల్లో నాళం సాదాగానే ఉంటుంది. శివాలయాల్లో ఎక్కువగా గోముఖమే కనిపిస్తుంది. నిర్మాల్య ద్వారానికి ఉన్న ఎన్నో పేర్లలో ఇదొకటి. ఇంకా ఈ భాగానికి ప్రణాలం, జలధార అంబుమార్గం, జలనిర్గమ నాళం, సోమసూత్రం అనే పేర్లు కూడా ఉన్నాయి. సోమసూత్రం చాలా ప్రసిద్ధి కలిగిన పేరు. శివాలయాల్లో శివాభిషేకతీర్థం ప్రవహించడానికి ఏర్పాటు చేసిన మార్గమే సోమసూత్రం. ప్రదక్షిణ చేసే భక్తులు సోమసూత్రం దాటకూడదు. అలా చేస్తే శివాపరాధంగా భావించాలని ఆగమశాసనం. శివాలయాల్లో అభిషేకతీర్థం గోముఖం నుండి నేరుగా చండీశ్వరుడి ముఖంపై పడాలనే నియమాలను కూడా శిల్పశాస్త్ర గ్రంథాలు చెప్పాయి.

**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

## ఇస్లామ్ వెలుగు

# తప్పు చేస్తే దైవం చూస్తూ ఊరుకోడు

పూర్వం మూసా అలైహిస్సలాం కాలంలో ఖారూన్ అనే రాజు ఉండేవాడు. పరమ అహంకారి, దుర్మార్గుడు, దైవధిక్కారి. ఒకసారి మూసా ప్రవక్త ఖారూన్ వద్దకు వెళ్ళి, 'నీ దగ్గర జకాత్ వసూలు చేయమని అల్లాహ్ నన్ను ఆదేశించాడు. కనుక జకాత్ చెల్లించు' అన్నారు.

ఖారూన్ జకాత్ నిరాకరించడమే కాకుండా, ప్రజల్ని రెచ్చగొడుతూ, 'మూసా జకాత్ పేరుతో మీ సొమ్మునంతా కాజేయాలని చూస్తున్నాడు. ఇంతకు ముందు కూడా నమాజ్ పాటించమని చెప్పాడు. మీరంతా ఆయన చెప్పినట్లు చేశారు. ఇప్పుడు జకాత్ అంటూ మీ సొమ్ము కాజేయడానికి మళ్ళీ వచ్చాడు. ఇప్పుడు కూడా అలాగే వింటారా.. అతని మాటల్ని?' అంటూ ప్రశ్నించాడు. దానికి ప్రజలంతా 'లేదు..లేదు.. మేము వినం. మీరే ఏదైనా ఉపాయం ఆలోచించండి.' అన్నారు.

ఖారున్ వెంటనే ఉపాయం ఆలోచించి, ఒక మహిళను పిలిపించాడు. ఆమెకు విలువైన కానుకలను ఆశ జూపి, మూసాపై వ్యభిచార నింద వేసేలా ఒప్పించాడు.

తరువాత ఖారూన్ మూసా దగ్గరికి వెళ్ళి, 'బనీ ఇస్రాయేలీయులందరినీ సమావేశ పరిచి అల్లాహ్ ఆజ్ఞలు, ఆదేశాలేమేమి ఉన్నాయో, అవన్నీ నువ్వు వాళ్ళకు తెలియజేస్తే మంచిది...' అన్నాడు.

మూసా అలైహిస్సలాం దీనికి అంగీకరించారు. వెంటనే ఖారూన్ ప్రజలందరినీ సమావేశపరిచాడు. అందరి సమక్షంలో మూసాప్రవక్త దైవాదేశాలను విడమరిచి చెప్పడం ప్రారంభించారు. అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదని... వివాహితుడు వ్యభిచారానికి పాల్పడితే రాళ్ళతో కొట్టాలనీ చెప్పారు.

అప్పుడు, ఖారూన్, అతని అనుచరులు 'ఒక వేళ మూసానే వ్యభిచారానికి పాల్పడితే..?'అని ప్రశ్నించారు.

'దైవాదేశం ఎవరికైనా ఒకటే.. నన్ను కూడా రాళ్ళతో కొట్టి చంపాల్సిందే.' అన్నారు మూసా.

'అయితే నువ్వు వ్యభిచార నేరానికి పాల్పడ్డావు.' అన్నాడు ఖారూన్.

మూసా ఆశ్చర్యచకితుడై, 'నేనా..? వ్యభిచారమా..?' అంటూ రెండుచెవులూ మూసుకున్నారు.

'అవును.. నువ్వే..' అంటూ, ముందే ఒప్పందం చేసుకున్న మహిళను ప్రవేశపెట్టి, 'చెప్పు.. మూసా చేసిన ఘనకార్యం.' అన్నాడు ఖారూన్ .

మూసా కూడా ఆ మహిళనుద్దేశించి, 'ప్రమాణం చేసి చెప్పు.. నువ్వు చెప్పదలచుకున్నదేమిటో నిజాయితీగా చెప్పు..' అన్నారు.

'ప్రమాణం చేసి చెబుతున్నాను. నాతో మీకు అక్రమ సంబంధం ఉందని మీపై వ్యభిచార నింద మోపితే, విలువైన కానుకలు ఇస్తామని ఆశజూపి నన్ను ఇక్కడికి తీసుకొచ్చారు.' అని చెప్పింది ఆ మహిళ.

ఈ మాటలకు మూసా బోరున విలపిస్తూ సజ్దాలో పడిపొయ్యారు. అదే స్థితిలో మూసాపై దైవవాణి అవతరించింది.

'విలపించవద్దు. వారిని శిక్షించడానికి నీకు మేము భూమిపై అధికారాన్ని ప్రసాదించాము.' అని వినిపించింది దైవవాణి.

మూసా ప్రవక్త తలపైకెత్తి, 'వీళ్ళను మింగేయి' అని భూమిని ఆదేశించారు.

దీంతో వారికాళ్ళు భూమిలో కూరుకుపోయ్యాయి. కాళ్ళను చీలమండల వరకు కరిచి పట్టేసింది.

ఖారూన్, అతని సహచరులందరూ కంపించిపోతూ.. మూసాను వేడుకోవడం ప్రారంభించారు.

మూసా మళ్ళీ భూమిని ఆదేశించారు. దాంతో భూమి వారిని మెడల వరకు మింగేసింది.

నిరుపేదల హక్కు అయినటువంటి 'జకాత్' నెరవేర్చకపోవడం, పరనిందలు వేయడం లాంటి ఘోర దుర్మార్గాలకు అల్లాహ్ తరఫున అవతరించిన శిక్ష ఇది.

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

## భాగవత చిత్రణ

**దేహి సుఖముగోరి దేహంబు గతియించు**
**దేహి విడువలేడు దేహమెపుడు**
**దేహి యస్మదీయ దేహంబు కొరకు వై**
**దేహమీగదయ్య దేవతలకు**



సందర్భం: దేవతలందరూ కలసి తమకు కంటకంగా ఉన్న వృత్రాసురుడనే రాక్షసుని బారి నుంచి తమను రక్షించమని కోరుతూ శ్రీ మహావిష్ణువును శరణుజొచ్చారు. వెంటనే విష్ణువు ప్రత్యక్షమై వారికి అభయమిచ్చి ''మీకు శుభమగుగాక! మీరందరూ ఒక పని చేయాలి. దధీచి అనే ఒక మహనీయుడున్నాడు. అతడు నాకు పరమ భక్తుడు. ఆత్మజ్ఞానం పొందిన అతని శరీరం ఇప్పుడు అమిత తేజోవంతమై ఉంది. మీరందరూ అతడిని యాచించి అతడి వెన్నెముకను తీసుకు రావాలి. ఆ వెన్నెముకతో విశ్వకర్మ ద్వారా ఒక ఖడ్గాన్ని తయారు చేయించుకోవాలి. ఆ ఆయుధంతో మాత్రమే వృత్రుని శిరస్సును ఛేదించవచ్చు'' అని చెప్పాడు.

విష్ణుమూర్తి ఆనతి మేరకు దేవతలు దధీచిని సమీపించి 'ప్రతిజీవుడూ సుఖాన్ని కోరుకుని లోకంలో దేహాన్ని ధరిస్తాడు. అందువల్ల సుఖాలకు ఆధారమైన దేహాన్ని ఎవ్వరూ, ఎప్పుడూ విడువలేరు. కానీ ఇప్పుడు మేము నీ దేహాన్ని కోరటానికి వచ్చాడు. నీ దేహాన్ని దేవతలమైన మాకు ప్రసాదించు'' అని ఆ మహామునిని ప్రార్థించిన సందర్భంలోనిది ఈ పద్యం.

దధీచి ఆనందంతో వారికి తన దేహాన్ని ఇచ్చాడు. అతని వెన్నెముక నుండి వజ్రాయుధం తయారైంది. దేవతల కోరిక దధీచిని మహా త్యాగిగా చేసింది.

**డా. చెలికాని మురళీకృష్ణారావు**

## ప్రశ్నోత్తర భారతం



261. మార్గమధ్యంలో ఎవరు అడ్డగించారు?
262. సాల్వుడు, భీష్ముడు ఇద్దరి మధ్య యుద్ధం ఎలా జరిగింది?
263. హస్తినకు వచ్చి భీష్ముడు ఏం చేశాడు?
264. అంబ భీష్మునితో ఏమని పలికింది?
265. భీష్ముడు ఏం చేశాడు?
266. విచిత్రవీర్యుని వివాహం చేసుకున్న అంబిక, అంబాలికలు ఎటువంటివారు?
267. విచిత్రవీర్యుని మరణంతో ఏం జరిగింది?
268. భీష్మునితో సత్యవతి ఏమన్నది?

-నిర్వహణ: డా. పురాణపండ వైజయంతి

**జవాబులు:** 261) మార్గమధ్యంలో సాల్వుడు అడ్డగించి, 'భీష్మా! ఇతర రాజులను ఓడించానని విర్రవీగకు. నన్ను ఎదిరించి నిలువలేవు' అని భీష్ముడిని ఎదిరించాడు. 262) సాల్వుడు వేల బాణాలు గుప్పించాడు, భీష్ముడు వాటిని మధ్యలోనే నరికాడు. భీష్ముడు వేసిన ఒకే ఒక బాణం సాల్వుని రథసారథిని, గుర్రాలను, రథాన్ని కూల్చింది. సాల్వుడు ఓడిపోయి, పారిపోయాడు. 263) అంబ, అంబిక, అంబాలికలను సత్యవతికి అప్పగించాడు. 264) మహానుభావా! నన్ను సాల్వుడు వరించాడు. ధర్మం ఆలోచించి, నీకు తోచినది చేయి... అంది. 265) శాస్త్రవేత్తలను సంప్రదించి, అంబను సాల్వుని దగ్గరకు పంపటానికి నిశ్చయించాడు. 266) ఇద్దరూ సుందరులు, సొగసరులు, విచిత్రవీర్యుడు వారి వ్యామోహంలో కామాంధుడు అయ్యాడు. కామమే వృత్తిగా జీవించి, వ్యాధిగ్రస్థుడై, మరణించాడు. 267) శంతనుని వంశం అంతరించే ప్రమాదం ఏర్పడింది. 268) భీష్మా! ఈ ప్రమాదం నుంచి నీవే తప్పించాలి. వంశం అంతరించనున్నది. నువ్వు రాజ్యపాలన స్వీకరించు, సంతానం కూడా పొందు... అంది.

## ధర్మజిజ్ఞాస

### శ్రీవారు మూడునామాల వాడిగా ప్రసిద్ధి చెందడానికి కారణమేంటి?

శ్రీవారిని తలచుకోగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది ఏడుకొండలు, మూడు నామాలు. మూడునామాలు శ్రీవారి రూపుకే ప్రత్యేకంగా కనిపిస్తాయి... ఈ మూడునామాలను తిరుమల కొండపై పెద్దగా కనిపించేలా ఏర్పరచారు. ఇంతకీ మూడు నామాల విశిష్టత ఏమిటో చూద్దామా?



సాక్షాత్తూ ఆ శ్రీ మహావిష్ణువు ధరించినవే మూడు నామాలు. మొదటిసారి రామానుజాచార్యులు స్వయంగా తన స్వహస్తాలతో శ్రీవారికి మూడు నామాలు అలంకరించారట. అలా...శ్రీనివాసుడికి తిరునామాలు అలంకరించడం ఆనవాయితీగా మారింది. శ్రీవారి మూడు నామాలకు ఉపయోగించే తెలుపు, ఎరుపు బొట్టు వెనక చాలా పరమార్థం ఉంది. తెలుపు నామాలు సత్వగుణాన్ని తెలియజేస్తాయి. సత్వగుణం మనల్ని ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని సూచించేది నిలువు బొట్టు. ఇక ఎరుపు రంగు అనురాగానికి ప్రతీక. అంటే ఎరుపు లక్ష్మీ స్వరూపం, శుభసూచకం, మంగళకరమైనది. కాబట్టి తెలుపు నామాల మధ్యలో ఎరుపు చూర్ణం ఉపయోగిస్తారు... శ్రీవారి మూడు నామాలకు మరో అర్థం కూడా ఉంది. వైష్ణవుల్లో వడగలై, తెంగలై అనే రెండు తెగలున్నాయి. వడగలై అనే వాళ్లు యు ఆకారంలో నామం దిద్దుకుంటారు. తెంగలైవారు ఆంగ్ల అక్షరం వై ఆకారంలో తిరునామం దిద్దుకుంటారు. అయితే ఈ రెండు ఆకారాలకు మధ్యస్థంగా తమిళ అక్షరం ప ను పోలి ఉంటుంది. దీన్నే తిరుమణి కావుగా పిలుస్తారు. అలా శ్రీవారికి మూడు నామాలు ప్రత్యేకమైయ్యాయి. శ్రీవారికి ప్రతి శుక్రవారం అభిషేకం తర్వాత 16 తులాల పచ్చ కర్పూరం, ఒకటిన్నర తులం కస్తూరితో మూడు నామాలు అలంకరిస్తారు. అవి మళ్లీ గురువారం వరకూ అలానే ఉంటాయి. గురువారం స్వామివారి నేత్రాలు కనిపించేలా నామాన్ని కొంతవరకు తగ్గిస్తారు. అంటే ఎప్పుడూ శ్రీవారు కళ్లు నామాలతో మూసి ఉంటారు. శుక్రవారం ఉదయం మాత్రమే అభిషేక సేవ సమయంలో శ్రీవారు మూడు నామాలు లేకుండా భక్తులకు దర్శనమిస్తారు...

ఈ సమయంలో నేత్ర దర్శనం, నిజపాద దర్శనం చేసుకునే అరుదైన, మహత్తరమైన అవకాశం భక్తులకు లభిస్తుంది. శుక్రవారం అభిషేకం తర్వాత మూడు నామాలు అలంకరిస్తే మరలా శుక్రవారం అభిషేకం సమయం వరకు ఈ నామం అలాగే ఉంటుంది. అంటే వారానికి ఒకసారి మాత్రమే శ్రీవారికి మూడు నామాలు దిద్దుతారు.

## సద్గురు వాణి

కర్మ పని చేసే తీరు విషయంలో అజ్ఞానం గల సామాన్య ప్రజ 'దుష్టులకే సుఖాలెందుకు? మంచివాళ్లకి కష్టాలెందుకు?' అని ఆవేశంగా ఆలోచిస్తారు. దేవుడి మీద, కర్మ మీద నమ్మకాన్ని కోల్పోతారు. మనంచేసే ప్రతికర్మకి మనం జవాబుదారీ అన్న విశ్వాసం కలిగి ఉంటే చెడు చేయడానికి భయపడతారు. సమాజాన్ని దోపిడీ చేసేవారు కర్మ విషయంలో పూర్తిగా అజ్ఞానులు కాబట్టే, నిర్భయంగా చెడు పనులు చేస్తూ భవిష్యత్ జన్మలని అంధకార బంధురం చేసుకుని తమకి తాము అన్యాయం చేసుకుంటున్నారు. అయితే, కనీసం ఈ జన్మలో అయినా మేలుకుని ఇతరులకు చెడు చేయకుండా ఉంటే వచ్చే జన్మలైనా మంచివి లభిస్తాయి.


విజయ్

## బిగిల్ కొట్టు

ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ప్రత్యర్థులను హడలెత్తించేలా ఆడారు తమిళ నటుడు విజయ్. ఈ ఆట ఈ ఏడాది దీపావళికి వెండితెరపైకి వస్తుంది. అట్లీ దర్శకత్వంలో విజయ్ హీరోగా రూపొందుతున్న సినిమాకు 'బిగిల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అలాగే శనివారం విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్, సెకండ్ లుక్‌ను విడుదల చేశారు. ఈ లుక్స్ చూస్తుంటే విజయ్ క్యారెక్టర్‌లో మూడు నాలుగు షేడ్స్ ఉంటాయని అర్థం అవుతోంది. ఇక్కడున్న ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఒక గెటప్‌లో యంగ్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా కనిపిస్తున్న విజయ్, ఇంకో లుక్‌లో కత్తి పట్టుకుని మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ సినిమాలో నయనతార కథానాయికగా నటిస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి సినిమా విడుదల కానుంది. అన్నట్లు.. 'బిగిల్' అంటే విజిల్ అని అర్థం.


విజయ్ సేతుపతి

## గుడ్ ఫాదర్

ఇద్దరు పిల్లలున్నప్పుడు ఒకరికి ఏదైనా ఇచ్చి మరొకరికి ఇవ్వకపోతే బావుండదనుకుంటారు పేరెంట్స్. ఇలానే అనుకుని తన కూతుర్ని తన తదుపరి చిత్రంలో నటింపజేస్తున్నారు విజయ్ సేతుపతి. 'నానుమ్ రౌడీదాన్' సినిమాలో విజయ్ సేతుపతి చిన్నప్పటి పాత్రలో అతని తనయుడు సూర్య నటించాడు. విడుదలకు సిద్ధమైన విజయ్ సేతుపతి 'సిందుబాద్'లోనూ సూర్య ఓ పాత్ర చేశాడు. విజయ్ సేతుపతి నటిస్తున్న 'సంఘ తమిళన్' చిత్రంలో అతని కుమార్తె శ్రీజ నటించనుందట. విజయ్ చందర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ''వాడిని (సూర్య) యాక్ట్ చేయించి తనని (శ్రీజ) యాక్ట్ చేయించకపోతే తనని వదిలేసినట్టు తను బాధపడకూడదు. అందుకే ఈ సినిమాలో యాక్ట్ చేయిస్తున్నాను'' అని పేర్కొన్నారు విజయ్ సేతుపతి.


దిశా పాట్నీ


రామ్

## ఆరు రోజులు ఆలస్యంగా...

డబుల్ ధిమాక్ ఇస్మార్ట్ శంకర్ ప్లాన్‌లో చాన్న మార్పు జరిగింది. అనుకున్నదానికన్నా ఆరు రోజులు ఆలస్యంగా రాబోతున్నాడు. రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఇస్మార్ట్ శంకర్'. పూరి జగన్నాథ్, చార్మి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా టాకీ పార్టు పూర్తయింది. ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుగుతుంది. ఈ చిత్రాన్ని ముందుగా జూలై 12న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు జూలై 18న రిలీజ్ డేట్‌ను ఫైనలైజ్ చేశారు. ''ఇటీవల విడుదల చేసిన టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. జూలై 12న క్రికెట్ ప్రపంచకప్‌లో కీలకమైన పోటీలు ఉన్నాయి. 14న ఫైనల్ మ్యాచ్. సినిమా కలెక్షన్స్‌పై ప్రభావం చూపకూడదని 18కి వాయిదా వేశాం'' అని చిత్రబృందం పేర్కొంది. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, ఆశిష్ విద్యార్థి, గెటప్ శీను, సుధాంశు తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు మణిశర్మ స్వరకర్త.


సాయిధరమ్

## ప్రతి రోజూ పండగే!

'చిత్రలహరి' సినిమాతో ఓ డీసెంట్ సక్సెస్‌ను ఖాతాలో వేసుకున్నారు సాయిధరమ్ తేజ్. ఇప్పుడు ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ కథనంపై దృష్టిపెట్టారాయన. మారుతి దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. ఇందులో రాశీ ఖన్నా కథానాయికగా నటించనున్నారు. ఈ సినిమాకు 'ప్రతి రోజూ పండగే' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరుగుతుందని తెలిసింది. రెగ్యులర్ షూటింగ్‌ని 27న మొదలుపెట్టనున్నారట. ఇంకో విశేషం ఏంటంటే.. తమిళ నటుడు సత్యరాజ్ ఈ చిత్రంలో ఓ కీలకపాత్రలో నటించనున్నారని తెలిసింది.


అదా శర్మ
వెబ్ సిరీస్ కోసం కలర్డ్ హెయిర్‌తో...

## హాలిడే కానీ వర్క్ డే!

తమిళ, తెలుగు, హిందీ భాషల్లో హీరోయిన్‌గా ప్రూవ్ చేసుకున్న అదా శర్మ ఇప్పుడు డిజిటల్ రంగం వైపు కూడా దృష్టి పెట్టారు. 'హాలిడే' అనే వెబ్ సిరీస్ చేయడానికి ఆమె అంగీకరించారు. ''హాలిడే వెబ్ సిరీస్ కోసం మారిషస్ వచ్చాం. కొత్త హెయిర్ కలర్ డిజైన్ ట్రై చేశాను. ఏ హీరోయిన్ అయినా నా హెయిర్ స్టైల్‌తో ఇన్‌స్పైర్ అయినట్లయితే.. వారు నాకు కాపీరైట్ చార్జెస్ పే చేయాలి (సరదాగా)'' అని పేర్కొన్నారు అదా శర్మ. మారిషస్‌లో కొన్ని రోజుల పాటు ఈ చిత్రీకరణ జరుగుతుంది. అదా వెబ్ సిరీస్‌లో నటించడం ఇదే తొలిసారి. ఇక సినిమాల విషయానికి వస్తే.. తెలుగులో రాజశేఖర్ హీరోగా నటించిన 'కల్కి' సినిమాలో అదా శర్మ ఒక హీరోయిన్‌గా నటించారు. అటు హిందీలో 'బైపాస్ రోడ్, కమాండో 3' సినిమాలు చేస్తున్నారు.

## అప్పుడు కాలు.. ఇప్పుడు చేయి!

వరుస గాయాలతో హీరోయిన్ దిశా పాట్నీ ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల సల్మాన్ ఖాన్ 'భారత్' సినిమా షూటింగ్ సమయంలో దిశా కాలికి గాయమైన సంగతి గుర్తుండే ఉంటుంది. తాజాగా మరోసారి దిశా గాయపడ్డారు. మోహిత్ సూరి దర్శకత్వంలో రూపొందుతున్న 'మలాంగ్' సినిమాలో దిశాపాట్నీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూట్‌లోనే ఆమె చేతికి గాయమైంది. సీన్ కంప్లీట్ చేశాకే దిశా హాస్పిటల్‌కి వెళ్లారు. పెద్ద గాయం కాకపోవడంతో నో రెస్ట్ అంటున్నారు దిశా. ఆదిత్యా రాయ్ కపూర్, కునాల్ కేము, అనిల్ కపూర్ ఈ సినిమాలో కీలక పాత్రలు చేస్తున్నారు. రొమాంటిక్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.


అమలాపాల్

## నగ్నంగా ఇరవై రోజులు!

ఇటీవల కాలంలో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయింది 'ఆడై' అనే తమిళ సినిమా టీజర్. అందులో అమలాపాల్ నగ్నంగా కనిపించడమే అందుకు కారణం. ఆమె గట్స్‌కి ప్రేక్షకులు షాక్ అయ్యారు. అది కేవలం సినిమాలో ఓ సన్నివేశం అని ఊహించారు. కానీ సినిమాలో కొంత పోర్షన్ వరకూ అమలాపాల్ ఒంటిమీద నూలుపోగు కూడా లేకుండా కనిపిస్తారని సమాచారం. రత్నకుమార్ దర్శకత్వంలో అమలాపాల్ ముఖ్యపాత్రలో నటించిన చిత్రం 'ఆడై'. అంటే 'బట్టలు' అని అర్థం. ఈ సినిమాలో నగ్నంగా కనిపించే సన్నివేశాలను 20 రోజులపాటు షూట్ చేశారట చిత్రబృందం. చిత్రానికి ఇవే ఎంతో కీలకంగా నిలవబోతున్నాయని సమాచారం. ఈ ఇరవై రోజులూ చాలా తక్కువమంది చిత్రబృందంతో జాగ్రత్తగా చిత్రీకరణ జరిపారట. కథలో ఎంత బలం ఉంటే అమలాపాల్ ఈ సాహసం చేయడానికి అంగీకరించారో ఊహించుకోవచ్చు. మరోవైపు ఈ సన్నివేశాలకు సెన్సార్ బృందం అంగీకారం తెలపకపోవచ్చని, నగ్నసన్నివేశాలను బ్లర్ చేయడమో, కట్ చేయడమో జరిగే అవకాశం ఉందని తమిళ పరిశ్రమలో చర్చ మొదలైంది. మరి.. బట్టలు కత్తెరకు గురవుతాయా? వేచి చూడాలి. 'ఆడై' తెలుగులో 'ఆమె' పేరుతో రిలీజ్ కానుంది.


'ఆడై'లో అమలాపాల్


కొండా కృష్ణంరాజు, రూపేశ్, శివ, వినాయక్, సలోని, సి. కల్యాణ్

## శివ పెద్ద దర్శకుడు కావాలి - వీవీ వినాయక్

మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై శివకుమార్ బి. దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రం '22.'. రూపేశ్‌కుమార్ చౌదరి, సలోని మిశ్రా నాయకానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రం బ్యానర్ లోగో ఆవిష్కరణ, టైటిల్ ఎనౌన్స్‌మెంట్ కార్యక్రమం శనివారం జరిగింది. లోగోను సి. కల్యాణ్ ఆవిష్కరించగా, టైటిల్‌ను వీవీ వినాయక్ ఎనౌన్స్ చేశారు. వినాయక్ మాట్లాడుతూ– ''శివ నా దగ్గర చాలా సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశాడు. క్రమశిక్షణ, డెడికేషన్ ఉన్నవాడు. బీఏ రాజుగారి ద్వారా శివకు ఈ సినిమా చాన్స్ వచ్చింది అనుకుంటారు అందరూ. కానీ తానే సొంతంగా దర్శకునిగా అవకాశం దక్కించుకున్నాడు. ఈ సినిమా టైటిల్ '22'. ఈ రోజు జూన్ 22. వచ్చే నెల 22న రెగ్యులర్ షూటింగ్ ఆరంభమవుతుంది. శివ పెద్ద దర్శకుడు కావాలని కోరుకుంటున్నా'' అన్నారు. ''వెబ్ సిరీస్‌తో తన టాలెంట్‌ను ప్రూవ్ చేసుకొని సినిమా చాన్స్ దక్కించుకోవటం సామాన్యమైన విషయం కాదు. నాకు 'ఈరోజుల్లో' సినిమా ఎలా ట్రెండ్ మార్క్ అయ్యిందో అలా శివకు '22' ట్రెండ్ మార్క్ అవ్వాలని కోరుకుంటున్నా'' అన్నారు మారుతి. సి.కల్యాణ్ మాట్లాడుతూ– ''జయగారు ఎక్కడున్నా సంతోషిస్తారు. శివ దర్శకుడు అవ్వాలని బలంగా ఆమె కోరుకునేది. తక్కువ టైమ్‌లో శివ దర్శకునిగా ఎక్కువ సినిమాలు చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు. శివ మాట్లాడుతూ– ''మారుతి, పూరి జగన్నాథ్, వీవీ వినాయక్ గార్ల దగ్గర దర్శకత్వ శాఖలో చేశాను. నేను వెబ్ సిరీస్ చేసిన ప్రొడక్షన్‌లోనే సినిమా చేసే అవకాశం రావటం హ్యాపీగా ఉంది. దర్శకురాలు బి.జయగారు మా అమ్మ అని అందరికీ తెలుసు. ఆమె దగ్గర ప్రొడక్షన్ శాఖలో మెళకువలు నేర్చుకున్నా. నా స్ట్రగుల్స్‌లో తోడుగా ఉంటూ ప్రతిక్షణం ముందుకు నడిపించారు మా నాన్న బీఏ రాజు'' అన్నారు. ''డైరెక్టర్ శివగారు నాకు వెబ్ సిరీస్‌లో నటించే అవకాశం ఇచ్చారు. మళ్లీ తన సినిమాలో హీరోగా చాన్స్ ఇచ్చినందుకు థ్యాంక్స్'' అన్నారు రూపేష్. ''ఫలక్‌నామా దాస్' తర్వాత చేస్తున్న సినిమా ఇది. చాలా ఇంట్రెస్టింగ్ పాత్ర చేస్తున్నా'' అన్నారు సలోని. నిర్మాత కొండా కృష్ణంరాజు, సంగీత దర్శకులు సాయి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## నాన్న ఎప్పుడూ నా వెనకుంటారు

నటుడికి తొలి సినిమా చాలా ముఖ్యం. ఏ అడ్డంకులు లేకుండా మంచి హిట్ సాధించాలనుకోవడం సహజం. అలాంటిది ఎంతో కష్టపడి తీసిన సినిమా బాగా రాలేదని మళ్లీ మొదటి నుంచి తీయాలని నిర్మాతలు అనుకుంటే? ఆ యాక్టర్ కాన్ఫిడెన్స్‌లో కచ్చితంగా డిస్టర్బెన్స్ వస్తుంది. అయితే విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్‌కి ఇలా జరిగినా కాన్ఫిడెన్స్ కోల్పోలేదు. 'అర్జున్ రెడ్డి' తమిళ రీమేక్ ద్వారా ఇండస్ట్రీకి పరిచయం కానున్నారు ధృవ్. మొదట బాలా దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'వర్మ' టైటిల్‌తో తీశారు. ఆ చిత్రాన్ని ఆపేసి, 'ఆదిత్యవర్మ' పేరుతో మళ్లీ షూటింగ్ మొదలుపెట్టి, పూర్తి చేశారు. 'ఆదిత్య వర్మ' పూర్తి కావడం వెనక తన తండ్రి సహకారం ఉందని భావోద్వేగంతో ధృవ్ రాసిన లేఖ సారాంశం ఈ విధంగా... ''సెట్‌ను ప్రతిరోజూ సందర్శిస్తూ, మమ్మల్ని మా శక్తిమేరకు పని చేసేలా ప్రోత్సహిస్తూ, మా అందరి విజన్‌ను ఎప్పటికప్పుడు గైడ్ చేస్తూ నన్ను 'ఆదిత్య వర్మ'ను చేశారు మా నాన్న. నా మీద నాకున్న నమ్మకాన్ని కోల్పోనివ్వకుండా, నా వెనకే ఉంటూ, నాకన్నీ నేర్పిస్తూ ఉన్నావు, ఉంటావు కూడా నాన్నా! నువ్వు లేకుండా ఏదీ అంత సులువుగా జరిగేది కాదు. నన్నెవరో అడిగారు.. 'సినిమాకు అంత కష్టపడ్డారు కదా, టీజర్‌లో మీ నాన్నగారి పేరెక్కడా? అని. ఆయన పేరు నా పేరు వెనక, ఆయనెప్పుడూ నా వెనక ఉంటారు' అని బదులిచ్చాను. నువ్వు గర్వపడేలా చేస్తాను నాన్నా'' అని పేర్కొన్నారు. 'ఆదిత్య వర్మ' టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది.


విక్రమ్, ధృవ్ విక్రమ్


కార్తీ

## ఐ లవ్ యూ చెబుతారా?

కన్నడ, తెలుగు భాషల్లో హీరో ఉపేంద్రతో 'ఐ లవ్ యూ' చెప్పించారు దర్శకుడు ఆర్. చంద్రు. ప్రేమలో కొత్తకోణం చూపించాం అంటూ తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 14న రిలీజ్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా తమిళంలో రీమేక్ కాబోతోందని తెలిసింది. ఈ తమిళ రీమేక్‌ను కూడా ఒరిజినల్ చిత్రాన్ని తెరకెక్కించిన ఆర్. చంద్రునే డైరెక్ట్ చేస్తారట. ''ఈ సినిమాను తమిళంలో రీమేక్ చేయడం సంతోషంగా ఉంది. ఇంకా నటీనటులను ఫైనలైజ్ చేయలేదు. ఈ ప్రాజెక్ట్‌లో కార్తీ నటిస్తే బావుంటుంది అనుకుంటున్నాను. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ త్వరలో చేస్తాం'' అని దర్శకుడు పేర్కొన్నారు. మరి తమిళంలో కార్తీ 'నాన్ ఉన్నై కాదలిక్కరేన్' అని చెబుతారా? అదేనండీ... తమిళంలో ఐ లవ్ యూ చెబుతారా? వేచి చూడాలి.


కరీనా, ఆమిర్

## ముచ్చటగా మూడోసారి...

... స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు ఆమిర్ ఖాన్, కరీనా కపూర్. అమిర్ హీరోగా 'సీక్రెట్ సూపర్ స్టార్' మూవీ ఫేమ్ అద్వైత్ చందన్ దర్శకత్వంలో 'లాల్‌సింగ్ చద్దా' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. అతుల్ కులకర్ణి స్టోరీ అందించారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కరీనా కపూర్‌ను అనుకుంటున్నారని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఆ వార్తలే నిజమయ్యాయి. ఈ చిత్రంలో కరీనా కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారని చిత్రబృందం అధికారికంగా తెలిపింది. ఇంతకుముందు త్రీ ఇడియట్స్, తలాష్ సినిమాల్లో కలిసి నటించారు అమిర్ అండ్ కరీనా. ఇప్పుడు కమిట్ అయిన 'లాల్‌సింగ్ చద్దా' మూడో సినిమా. హాలీవుడ్ ఆస్కార్ విన్నింగ్ ఫిల్మ్ 'ఫారెస్ట్ గంప్'కి ఇది హిందీ రీమేక్. ఈ సినిమా కాకుండా 'అంగ్రేజీ మీడియం' చిత్రంలో నటిస్తున్నారు కరీనా కపూర్.


తారకరత్న

## కాకతీయుడు వస్తున్నాడు

తారకరత్న హీరోగా వి. సముద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాకతీయుడు'. లగడపాటి శ్రీనివాసరావు నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ముగిశాయి. ఇటీవల సెన్సార్ పూర్తయింది. ''సముద్ర దర్శకత్వంలో పలు విజయవంతమైన చిత్రాలు రూపొందాయి. యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్మెంట్ కంటెంట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది. జూలై రెండోవారంలో సినిమా విడుదలకు ప్లాన్ చేస్తున్నాం'' అని నిర్మాత అన్నారు. ''తారకరత్న బాడీ లాంగ్వేజ్‌కి సరిపడే కథా, కథనాలతో ఈ చిత్రం రూపొందింది'' అన్నారు సముద్ర.












# భారత్ అజేయభేరి

దక్షిణాఫ్రికా మెడలు వంచాం... ఆస్ట్రేలియాపై అదరగొట్టేశాం... పాకిస్తాన్ పని పట్టేశాం... అఫ్గానిస్తాన్ ఎంతలే అనుకుంటే... ఆ జట్టే మనకు చుక్కలు చూపింది. 400 కొడదామనో, సెంచరీలు, అర్ధ సెంచరీలు బాదుకుందామనో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను... నెమ్మదిగా ఉన్న పిచ్‌పై స్పిన్‌తో కళ్లెం వేసింది. ఛేదనలో బలమైన బౌలింగ్‌ను తట్టుకుంటూ కోహ్లి సేనకు ఈ ప్రపంచ కప్‌లో తొలి ఓటమి రుచి చూపించేలా కనిపించింది. కానీ, బుమ్రా, షమీ పేస్‌తో పడగొట్టడంతో పోరాడి ఓడామన్న సంతృప్తి మిగుల్చుకుంది.

- హ్యాట్రిక్‌తో చెలరేగిన పేసర్ షమీ
- రాణించిన కోహ్లి, జాదవ్
- అఫ్గాన్‌పై 11 పరుగులతో విజయం
- కడదాకా పోరాడిన నబీ
- తదుపరి మ్యాచ్ గురువారం వెస్టిండీస్‌తో

**సౌతాంప్టన్:** కూనే అనుకుంటే అఫ్గానిస్తాన్ కొమ్ములు విసిరింది. ప్రపంచ కప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న భారత్‌ను ఠారెత్తించింది. అయితే, ఒత్తిడిలో తలొంచింది. పరిస్థితులను అనుకూలంగా మల్చుకున్న కోహ్లి సేన ప్రత్యర్థి నుంచి విజయాన్ని లాక్కుంది. రెండు జట్ల మధ్య శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 11 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. కెప్టెన్ విరాట్ కోహ్లి (63 బంతుల్లో 67; 5 ఫోర్లు), మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ కేదార్ జాదవ్ (68 బంతుల్లో 52; 3 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. ఆఫ్ స్పిన్నర్ ముజీబుర్ రహ్మాన్ (1/26) పొదుపుగా బౌలింగ్ చేశాడు. బౌలింగ్‌లో మెరిసిన ఆల్‌రౌండర్లు మొహమ్మద్ నబీ (55 బంతుల్లో 52; 4 ఫోర్లు, సిక్స్, 2/33), రహ్మత్ షా (63 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1/22)లు ఛేదనలోనూ అఫ్గాన్‌ను గెలుపు దిశగా నడిపించారు. పేసర్లు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' జస్‌ప్రీత్ బుమ్రా (2/39), మొహమ్మద్ షమీ (4/40) కీలక సమయాల్లో భాగస్వామ్యాలను విడగొట్టడంతో ప్రత్యర్థి 49.5 ఓవర్లలో 213 పరుగులకే ఆలౌటైంది. భారత్ తదుపరి మ్యాచ్‌ను గురువారం మాంచెస్టర్‌లో వెస్టిండీస్‌తో ఆడనుంది.

### ఎంతో అనుకుంటే ఇంతేనా?

పిచ్ పరిస్థితిని పసిగట్టాడో ఏమో కాని అఫ్గాన్ కెప్టెన్ నైబ్... ముజీబ్‌తో బౌలింగ్ దాడిని ప్రారంభించి ఆశ్చర్యపర్చాడు. దీనికి తగ్గట్లే అతడు అద్భుత ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రోహిత్ శర్మ (1)ను తన రెండో ఓవర్లోనే బౌల్డ్ చేసి కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టాడు. మరో ఎండ్‌లో అఫ్తాబ్ అలమ్ బౌలింగ్‌లో రెండేసి ఫోర్లు కొట్టి కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 30; 2 ఫోర్లు), కోహ్లి జోరు పెంచేందుకు ప్రయత్నించినా ముజీబ్ మాత్రం వారికి అవకాశం ఇవ్వలేదు. అతడి తొలి స్పెల్ (6 ఓవర్లు)లో 18 పరుగులే రావడం గమనార్హం. ఇబ్బందిగా నెట్టుకొచ్చిన రాహుల్... నబీ ఓవర్లో రివర్స్ స్వీప్‌నకు యత్నించి వికెట్ సమర్పించుకున్నాడు. సాధికారికంగా ఆడిన కోహ్లి 48 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. కెప్టెన్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 58 పరుగులు జోడించిన విజయ్ శంకర్ (41 బంతుల్లో 29; 2 ఫోర్లు) పరిస్థితి చక్కబడుతుండగా రహ్మత్ షా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అదనపు బౌన్స్ అయిన నబీ బంతిని కట్ చేయబోయి కోహ్లి ఔటయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు 30.3 ఓవర్లలో 135/4. ఈ దశలో జాదవ్, ధోని (52 బంతుల్లో 28; 3 ఫోర్లు) ద్వయాన్ని ప్రత్యర్థి స్పిన్నర్లు కట్టిపడేశారు. 6 ఓవర్లపైగా వీరు బౌండరీనే కొట్టలేకపోయారు. మూడో బ్యాట్ మార్చాక ధోని ఓ ఫోర్ సాధించగలిగాడు. ఓవర్లు తరిగిపోతుండటంతో స్కోరు పెంచే ఉద్దేశంతో రషీద్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి ధోని స్టంపౌటయ్యాడు. దీంతో 57 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. హార్దిక్ పాండ్యా (7) ఈసారి బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. చివరి ఓవర్లో అర్ధసెంచరీ (66 బంతుల్లో) పూర్తి చేసుకున్న జాదవ్, షమీ (1)లను నైబ్ పెవిలియన్ చేర్చాడు.

## షంషేర్ షమీ

మ్యాచ్‌లో కోహ్లి బ్యాటింగ్ ఎంత నాణ్యంగా సాగిందో... షమీ బౌలింగ్ అంతే స్థాయిలో సాగింది. భువనేశ్వర్ గాయంతో తప్పుకోవడంతో ఈ ప్రపంచ కప్‌లో తొలి మ్యాచ్ ఆడిన షమీ అందుకు న్యాయం చేశాడు. అతడి తొలి స్పెల్ (4-1-6-1) అయితే మరింత పకడ్బందీగా సాగింది. రెండో స్పెల్‌లో కాస్త పరుగులిచ్చినా... మూడో స్పెల్‌లో మాత్రం ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు అవకాశం ఇవ్వలేదు. ఇక యార్కర్ లెంగ్త్ బంతులతో సాగిన తన చివరి రెండు ఓవర్ల స్పెల్ మ్యాచ్ మనవైపు మొగ్గేలా చేసింది. కుర్రాడు ఇక్రమ్ అలిఖిల్ (10 బంతుల్లో 7 నాటౌట్)ను ఒత్తిడికి గురి చేస్తూ 48వ ఓవర్‌ను షమీ అద్భుతంగా వేసి 3 పరుగులే ఇచ్చాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ తొలి బంతినే నబీ ఫోర్ కొట్టినా... సడలకుండా అతడితో పాటు అఫ్తాబ్ అలమ్ (0), ముజీబ్ (0)లను ఔట్ చేసి హ్యాట్రిక్‌తో భారత్‌ను గెలిపించాడు.

### కలవరపెట్టినా గెలవలేకపోయారు...

ఓపిక, తెలివిగా ఆడితే ఛేదించదగిన లక్ష్యంతో దిగిన అఫ్గాన్‌ను హజ్రతుల్లా (10)ను బౌల్డ్ చేయడం ద్వారా షమీ తొలి దెబ్బకొట్టాడు. రెండో వికెట్‌కు కెప్టెన్ నైబ్ (42 బంతుల్లో 27; 2 ఫోర్లు)తో 44 పరుగులు, మూడో వికెట్‌కు హష్మతుల్లా షాహిది (45 బంతుల్లో 21; 2 ఫోర్లు)తో 42 పరుగులు జోడించి రహ్మత్ షా భారత శిబిరంలో ఆందోళన రేకెత్తించాడు. ఇలాగైతే కష్టమని భావించిన కోహ్లి 29వ ఓవర్లో బుమ్రాను రంగంలోకి దించడం ఫలితాన్నిచ్చింది. అతడు రెండు బంతుల వ్యవధిలో రహ్మత్ షా, హష్మతుల్లాను ఔట్ చేయడం, అష్గర్ అఫ్గాన్ (8)ను చహల్ వెనక్కు పంపడంతో ఉపశమనం లభించింది. 90 బంతుల్లో 95 పరుగులు చేయాల్సిన స్థితిలో ఆరో వికెట్‌కు నబీ, నజీబుల్లా జద్రాన్ (23 బంతుల్లో 21; 2 ఫోర్లు) వేగంగా 36 పరుగులు జత చేసి కలవరపెట్టారు. జద్రాన్‌ను హార్దిక్ ఔట్ చేశాక నబీ, రషీద్‌ఖాన్ (14)లు 24 పరుగులు జోడించి ఉత్కంఠ పెంచారు. బుమ్రా వేసిన 47వ ఓవర్లో నబీ సిక్స్ బాదడంతో మ్యాచ్ చేజారినట్లే కనిపించింది. 49వ ఓవర్లో బుమ్రా ఐదు పరుగులే ఇవ్వడంతో చివరి ఓవర్లో 16 పరుగులు అందుకోవడం అఫ్గాన్ తరం కాలేకపోయింది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | 0.849 | 10 |
| న్యూజిలాండ్ | 5 | 4 | 0 | 1 | 1.591 | 9 |
| భారత్ | 5 | 4 | 0 | 1 | 0.809 | 9 |
| ఇంగ్లండ్ | 6 | 4 | 2 | 0 | 1.457 | 8 |
| శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.119 | 6 |
| బంగ్లాదేశ్ | 6 | 2 | 3 | 1 | -0.407 | 5 |
| వెస్టిండీస్ | 5 | 1 | 3 | 1 | 0.272 | 3 |
| దక్షిణాఫ్రికా | 6 | 1 | 4 | 1 | -0.193 | 3 |
| పాకిస్తాన్ | 5 | 1 | 3 | 1 | -1.933 | 3 |
| అఫ్గానిస్తాన్ | 6 | 0 | 6 | 0 | -1.712 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రాహుల్ (సి) హజ్రతుల్లా (బి) నబీ 30; రోహిత్ (బి) ముజీబ్ 1; కోహ్లి (సి) రహ్మత్ (బి) నబీ 67; విజయ్ శంకర్ ఎల్బీ (బి) రహ్మత్ 29; ధోని (స్టంప్డ్) ఇక్రమ్ (బి) రషీద్ ఖాన్ 28; జాదవ్ (సి) (సబ్) నూర్ అలీ (బి) గుల్బదిన్ 52; పాండ్యా (సి) ఇక్రమ్ (బి) అఫ్తాబ్ 7; షమీ (బి) గుల్బదిన్ 1; కుల్దీప్ నాటౌట్ 1; బుమ్రా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 224.**

**వికెట్ల పతనం:** 1-7, 2-64, 3-122, 4-135, 5-192, 6-217, 7-222, 8-223.

**బౌలింగ్:** ముజీబ్ 10-0-26-1, అఫ్తాబ్ 7-1-54-1, నైబ్ 9-0-51-2, నబీ 9-0-33-2, రషీద్ 10-0-38-1, రహ్మత్ షా 5-0-22-1.

**అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్:** హజ్రతుల్లా (బి) షమీ 10; నైబ్ (సి) శంకర్ (బి) పాండ్యా 27; రహ్మత్ (సి) చహల్ (బి) బుమ్రా 36; హష్మతుల్లా (సి అండ్ బి) బుమ్రా 21; అష్గర్ (బి) చహల్ 8; నబీ (సి) పాండ్యా (బి) షమీ 52; నజీబుల్లా (సి) చహల్ (బి) పాండ్యా 21; రషీద్ (స్టంప్డ్) ధోని (బి) చహల్ 14; ఇక్రమ్ నాటౌట్ 7; అఫ్తాబ్ (బి) షమీ 0; ముజీబ్ (బి) షమీ 0; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 213.**

**వికెట్ల పతనం:** 1-20, 2-64, 3-106, 4-106, 5-130, 6-166, 7-190, 8-213, 9-213, 10-213.

**బౌలింగ్:** షమీ 9.5-1-40-4, బుమ్రా 10-1-39-2, చహల్ 10-0-36-2, పాండ్యా 10-1-51-2, కుల్దీప్ 10-0-39-0.


నబీ

**2** ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ తీసిన రెండో భారత బౌలర్ షమీ. 1987లో చేతన్ శర్మ ఈ ఘనత సాధించాడు.

**50** ప్రపంచకప్ చరిత్రలో భారత్‌కు ఇది 50వ విజయం. ఆస్ట్రేలియా (67), న్యూజిలాండ్ (52) విజయాలతో ముందున్నాయి.

# వెస్టిండీస్ లక్ష్యం 292

- విలియమ్సన్ అద్భుత సెంచరీ
- న్యూజిలాండ్‌ను గట్టెక్కించిన కెప్టెన్
- అండగా నిలిచిన టేలర్



కాట్రెల్ (4/56)

**మాంచెస్టర్:** కెప్టెన్ అంటే కేన్ విలియమ్సనే. గడ్డు పరిస్థితుల నుంచి ఒడ్డున పడేసేదాకా అతను కనబరిచిన పోరాటం అద్భుతం. ఓపెనర్లిద్దరు డకౌటైన ఇన్నింగ్స్‌ను అన్నీ తానై ఆఖరిదాకా నడిపించాడు. అతని పోరాటంతో శనివారం జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ముందు కివీస్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. విలియమ్సన్ (154 బంతుల్లో 148; 14 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత శతకం సాధించాడు. టేలర్ (95 బంతుల్లో 69; 7 ఫోర్లు) రాణించాడు. విండీస్ బౌలర్ కాట్రెల్‌కు 4 వికెట్లు దక్కాయి.

### గప్టిల్ 0... మున్రో 0...

టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ అందుకు తగినట్లే కివీస్ పనిపట్టింది. ఇన్నింగ్స్ తొలిబంతికే గప్టిల్ (0)ను ఔట్ చేసిన కాట్రెల్ ఐదో బంతికి మున్రో (0)ను బౌల్డ్ చేశాడు. రెండో బంతికే క్రీజులోకి వచ్చిన విలియమ్సన్... టేలర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. దీంతో మ్యాచ్ గడిచేకొద్ది ఆరంభంలో విండీస్‌కు దక్కిన ఆనందం కాస్తా ఆవిరవుతూ వచ్చింది. 10 ఓవర్లలో 30/2 స్కోరు కాస్తా 20 ఓవర్లు ముగిసేసరికి 81/2కు చేరింది. వీరిద్దరు విండీస్ బౌలర్లకు కొరకరాని కొయ్యలుగా మారారు. మార్చి మార్చి బౌలింగ్ చేసినా వీరిద్దరిలో ఏ ఒక్కరిని ఏమార్చలేకపోయారు. కుదురుగా ఆడిన విలియమ్సన్ 75 బంతుల్లో అర్ధసెంచరీ చేసుకోగా... టేలర్ 68 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేశాడు. ఇలా జట్టు స్కోరు మరో వికెట్ కోల్పోకుండా వందకు... మెల్లిగా 150 పరుగులకు చేరింది. ఇన్నింగ్స్‌ను కుదుటపరిచిన ఈ జోడీని ఎట్టకేలకు గేల్ విడదీశాడు. టేలర్‌ను ఔట్ చేయడంతో మూడో వికెట్‌కు 160 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అనంతరం లాథమ్ (12), నీషమ్ (28) పెద్దగా స్కోర్లేమీ చేయకపోయినా... విలియమ్సన్ ఆటతీరుతో జట్టు స్కోరు పుంజుకుంది. ఈ క్రమంలో 124 బంతుల్లో సెంచరీ సాధించిన కెప్టెన్ ఆ తర్వాత నింపాదిగానే ఆడుతూ స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. చివరకు భారీ సెంచరీగా మలుచుకుంటున్న దశలో కాట్రెల్... విలియమ్సన్‌ను ఔట్ చేశాడు. డెత్ ఓవర్లలో గ్రాండ్‌హోమ్ (16), సాన్‌ట్నర్ (10) మెరిపించలేకపోవడంతో జట్టు 300 మార్క్ అందుకోలేకపోయింది. బ్రాత్‌వైట్‌కు 2 వికెట్లు దక్కాయి.



విలియమ్సన్

**వెస్టిండీస్ 164/7**

లక్ష్యఛేదనలో వెస్టిండీస్ కుప్పకూలింది. కడపటి వార్తలు అందే సమయానికి ఆ జట్టు 27 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. గేల్ (87), హెట్‌మైర్ (54) మూడో వికెట్‌కు 122 పరుగులు జోడించారు.

# ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ బెర్త్ సొంతం

**హిరోషిమా:** ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ టోర్నీకి భారత మహిళల హాకీ జట్టు అర్హత సాధించింది. హిరోషిమాలో జరుగుతోన్న మహిళల హాకీ సిరీస్ ఫైనల్స్ టోర్నీలో చిలీపై విజయం సాధించి క్వాలిఫయర్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. శనివారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 4–2 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరపున గుర్జిత్ కౌర్(22, 37వ నిమిషంలో), నవ్‌నీత్ కౌర్(31వ నిమిషంలో), రాణి రాంపాల్(57వ నిమిషంలో)లు గోల్స్ సాధించగా... చిలీ తరపున కరోలినా గార్సియా(18వ నిమిషంలో), మాన్యుల ఉరోజ్ (43వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. ఆట 18వ నిమిషంలో కరోలినా గార్సియా గోల్‌తో చిలీ ఖాతా తెరిచింది. అయితే షాక్ నుంచి త్వరగానే తేరుకున్న భారత్ 22వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్ పోస్ట్‌లోకి నెట్టి గుర్జిత్ కౌర్ స్కోరును సమం చేసింది. తర్వాత మరింత దూకుడును పెంచిన భారత్ ప్రత్యర్థి గోల్ పోస్టుపైకి దాడులను ముమ్మరం చేసింది. ఆట 31వ నిమిషంలో ఫీల్డ్ గోల్ చేసిన నవ్‌నీత్ కౌర్ భారత్‌కు 2–1 ఆధిక్యాన్నిచ్చింది. 37వ నిమిషంలో మరో గోల్ సాధించిన గుర్జిత్ కౌర్ భారత్ స్కోర్‌ను 3–1కు తీసుకెళ్లింది. చిలీ తరపున మాన్యుల ఉరోజ్ 43వ నిమిషంలో గోల్ సాధించి భారత్ ఆధిక్యాన్ని 3–2కు తగ్గించింది. 4వ క్వార్టర్‌లో భారత్ తరపున గోల్ సాధించిన రాణి రాంపాల్ భారత విజయాన్ని ఖాయం చేసింది. మ్యాచ్‌లో భారత్ 2 గ్రీన్ కార్డులను పొందగా, చిలీ 1 గ్రీన్ కార్డును పొందింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య జపాన్ 3–1తో పెనాల్టీ షూటౌట్‌లో రష్యాపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించింది. నిర్ణీత సమయంలో ఇరుజట్లు ఒక్కో గోల్ చేయడంతో షూటౌట్ అనివార్యమైంది. ఆదివారం భారత్, జపాన్‌ల మధ్య టైటిల్ పోరు జరగనుంది.






TRADEMARKS OWNED BY PERNOD RICARD GROUP OF COMPANIES
FRANCHISEES, BOTTLERS AND DISTRIBUTORS INVITED. INTERESTED PARTIES MAY PLEASE CONTACT + 91 44 4292 5040



డైరెక్ట్ ప్లాన్. ఎటువంటి కమీషన్ లేకుండా స్వయంగా పెట్టుబడి పెట్టండి
MUTUAL FUNDS నిజమే మరి
మ్యూచువల్ ఫండ్స్ మీకోసం ఎలా నిజమైనవో, తెలుసుకునేందుకై సందర్శించండి: mutualfundssahihai.com
మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్‌లోని నష్టభయాలకు లోబడి ఉంటాయి, స్కీముకి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్‌ని జాగ్రత్తగా చదవండి.

# కృత్రిమ కిడ్నీ వచ్చేస్తోంది!

## రెండేళ్లలో అందుబాటులోకి తేనున్న శాస్త్రవేత్తల బృందం.. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ముమ్మరంగా పరిశోధనలు

## ఇప్పటికే జంతువులపై ప్రయోగాలు విజయవంతం.. త్వరలోనే మనుషులపై పరీక్షలకు రంగం సిద్ధం



మీరు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారా?
తరచూ డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోందా?
కిడ్నీ మార్పిడికి దాత కోసం ఎదురు చూస్తున్నారా?
నరకప్రాయం అనిపించే డయాలసిస్ వద్దని అనుకుంటున్నారా?
మీ సమస్యలన్నీ తీరే రోజు ఎంతో దూరం లేదంటున్నారు
యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్త షువో రాయ్.
ఎందుకంటారా?.... ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా
మూత్రపిండాల మాదిరిగానే పని చేసే కృత్రిమ కిడ్నీ సిద్ధమైంది కాబట్టి!!

అక్షరాలా 2.20 లక్షలు... దేశంలో ఏటా కిడ్నీ సమస్యలతో డయాలసిస్ అవసరమవుతున్న వారి సంఖ్య ఇది. ఈ సంఖ్య పెరుగుతున్నా అందుకు తగ్గట్టుగా వైద్య సదుపాయాలు మాత్రం పెరగట్లేదు. కిడ్నీ దాతలూ తక్కువగా ఉండటంతో కిడ్నీ మార్పిడి చుట్టూ నేరాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఉన్న సెంటర్లలోనే గంటలకొద్దీ నానా అవస్థలు పడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు ఎట్టకేలకు శుభవార్త. షువో రాయ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం కృత్రిమ కిడ్నీ తయారీలో విజయం సాధించడమే కాదు.. మరో రెండేళ్లలో అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యల కారణంగా శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేసే మూత్రపిండాల పనితీరు మందగిస్తుంది. సకాలంలో తగిన చికిత్స తీసుకోకపోతే పనిచేయడమూ మానేస్తాయి. ఇది కాస్తా మరణానికి దారితీస్తుంది. మూత్రపిండాలు కొంతవరకే పనిచేస్తున్న పరిస్థితుల్లో ఓ భారీ యంత్రం సాయంతో రక్తాన్ని అప్పుడప్పుడూ శుద్ధి చేసి మళ్లీ ఎక్కిస్తూంటారు. డయాలసిస్ అని పిలిచే ఈ చికిత్స ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. కొంత మందికి వారానికి ఒకసారి డయాలసిస్ అవసరమైతే ఇతరులకు నెల, రెండు నెలలకు ఒకసారి సరిపోతుంది. ఇదంతా కొంత ఖరీదైన వ్యవహారమే. అదే సమయంలో సమస్యలను పూర్తిగా తగ్గించదు కూడా. శుద్ధి చేసే క్రమంలో శరీరానికి అవసరమైన కొన్ని పదార్థాలూ నష్టపోవాల్సి ఉంటుంది.

### డయాలసిస్‌తో సమస్యలెన్నో...

ప్లాస్టిక్‌లాంటి పదార్థాలతో తయారైన ఫిల్టర్ల వాడకం దీనికి కారణం. మూత్రపిండాల్లో సహజసిద్ధంగా ఉండే నెఫ్రాన్లు ఏడు నానోమీటర్ల సైజులో ఉంటే ప్లాస్టిక్ ఫిల్టర్‌లోని రంధ్రాలు ఇంతకంటే ఎక్కువ సైజులో ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక మంది మధుమేహ రోగులున్న భారత్‌లో ఈ సమస్య పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా చీమకుర్తితోపాటు శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానంలో అత్యధిక కిడ్నీ రోగులు ఉండటం తెలిసిందే. ఏపీ సీఎం వై.ఎస్. జగన్ ప్రభుత్వం డయాలసిస్ రోగులకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినా, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో దేశవ్యాప్తంగా అందరికీ ఉచితంగా డయాలసిస్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని సంకల్పించినా అవన్నీ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన చర్యలే. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన షువో రాయ్ పరిశోధన అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

### ఎలా పనిచేస్తుంది?

శరీరంలో ఏదైనా కొత్త అవయవం చేరితే రోగ నిరోధక వ్యవస్థ వెంటనే దాన్ని నిరోధించే ప్రయత్నం చేస్తుందనే విషయం మనకు తెలిసిందే. కానీ షువోరాయ్ తయారు చేసిన కృత్రిమ కిడ్నీతో మాత్రం ఈ సమస్య రాదు. ఎందుకంటే ఇందులో రోగి కణాలనే వాడతారు. స్థూలంగా ఇది రెండు భాగాలుగా ఉంటుంది.



ఒకదాంట్లో నానోస్థాయి రంధ్రాలున్న ఫిల్టర్లు ఒక కట్టలా ఉంటాయి. సిలికాన్‌తో తయారైన ఈ ఫిల్టర్లు రక్తం ప్రవహించే వేగాన్ని ఉపయోగించుకొని రక్తంలోని విషపదార్థాలు, చక్కెరలు, లవణాలను తొలగిస్తాయి. ఫిల్టర్‌లోని రంధ్రాలు కచ్చితమైన సైజు, ఆకారంలో ఉండటం వల్ల రక్త కణాలపై ఒత్తిడి తగ్గుతుంది. లేదంటే రక్తం గడ్డకట్టి రోగికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇక రెండో భాగంలో బయో రియాక్టర్ ఉంటుంది. ఇందులో మూత్రపిండాల కణాలే ఉంటాయి. శుద్ధి చేసిన రక్తంలో తగుమోతాదులో నీళ్లు, అవసరమైన లవణాలు, చక్కెరలు ఉండేందుకు బయో రియాక్టర్‌లోని మూత్రపిండ కణాలు ఉపయోగపడతాయి. ఫిల్టర్ల ద్వారా శుద్ధి అయిన రక్తాన్ని పరిశీలించి.. ఏయే పదార్థాలు ఎంత మోతాదులో ఉన్నాయో గుర్తించడం నియంత్రణకు అవసరమైన పనులు చేసేందుకు ఒక మైక్రో కంట్రోలర్‌ను వాడతారు. గతేడాది షువో రాయ్ బృందం సిద్ధం చేసిన కృత్రిమ కిడ్నీ పరికరం నిమిషానికి లీటర్ రక్తాన్ని శుద్ధి చేయగలదని పరీక్షల్లో తేలింది. ఈ పరికరంలో వాడే బయో రియాక్టర్లను 1999 నుంచి జంతువుల్లో విజయవంతంగా పరీక్షిస్తున్నారు.

### ఎలా అమరుస్తారు

షువో రాయ్ అభివృద్ధి చేసిన కృత్రిమ కిడ్నీ సైజు చాలా చిన్నది. ముందుగా ఫిల్టర్లు ఉన్న భాగాన్ని కడుపు భాగంలో చిన్న గాటు పెట్టి మూత్రనాళాలకు కలుపుతారు. రక్తం గడ్డ కట్టే ప్రమాదాన్ని నివారించేందుకు నెలరోజులపాటు పరిశీలిస్తారు. ఆ తరువాత రక్తం సక్రమంగా శుద్ధి అవుతున్నదీ లేనిదీ చూస్తారు. ఈ దశలో బయో రియాక్టర్‌ను జోడిస్తారు. కృత్రిమ కిడ్నీని అమర్చుకున్న వారు తమ దైనందిన కార్యకలాపాలను చేసుకోవచ్చు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు కూడా ఈ కృత్రిమ కిడ్నీ ప్రత్యామ్నాయం కానుందని అంచనా. జంతు పరీక్షలు ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో త్వరలోనే మానవ పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. అమెరికాలోని కిడ్నీ రోగుల సంస్థ ఈ ప్రయోగాల్లో పాల్గొనడంతోపాటు ప్రాజెక్టు సాకారమయ్యేందుకు ఆర్థికంగానూ సాయపడతామని ఇప్పటికే ప్రకటించింది. అన్నీ సవ్యంగా సాగితే వచ్చే ఏడాదికల్లా ఈ కృత్రిమ కిడ్నీని అందుబాటులోకి తెస్తామని షువో రాయ్ చెబుతున్నారు. కిడ్నీ మార్పిడికి 5–10 ఏళ్లు పట్టొచ్చని, ఈలోగా కృత్రిమ కిడ్నీ ద్వారా రోగులు సాంత్వన పొందొచ్చని వివరించారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

### డయాలసిస్ ప్రక్రియ తొలగింపే లక్ష్యం

డయాలసిస్ ప్రక్రియను పూర్తిగా తొలగించాలన్నదే నా లక్ష్యం. రక్తాన్ని శుద్ధి చేస్తూనే సహజసిద్ధ మూత్రపిండాలు చేసే పనులన్నీ నిర్వహించే కృత్రిమ కిడ్నీని తయారు చేయాలని దశాబ్దం కంటే ఎక్కువ కాలం నుంచి ప్రయత్నిస్తున్నా. ఇప్పుడున్న పరిస్థితుల్లో తగినన్ని నిధులు అందుబాటులోకి వస్తే ఒకట్రెండేళ్లలో మానవ ప్రయోగాలను పూర్తి చేయొచ్చు. ప్రపంచంలో ఏమూల ఉన్న వారికైనా దీన్ని అందుబాటులోకి తీసుకురావచ్చు. నాతోపాటు మా బృందం మొత్తం ఇదే లక్ష్యంతో పనిచేస్తోంది.

– సాక్షితో షువో రాయ్

**10%** ప్రపంచ జనాభాలో కిడ్నీ సమస్యలతో బాధ పడుతున్న ప్రజలు

**18** మానవ మరణ కారణాల జాబితాలో కిడ్నీ జబ్బుల స్థానం

తగిన చికిత్స లభించక మరణిస్తున్న వారి సంఖ్య లక్షల్లోనే!

**20 లక్షలు** ప్రపంచవ్యాప్తంగా డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి అవసరమైన వారి సంఖ్య

**2,20,000** భారత్‌లో ఏటా కొత్తగా నమోదవుతున్న కిడ్నీ రోగులు

**4,850** దేశం మొత్తమ్మీద ఉన్న డయాలసిస్ కేంద్రాలు..

**800-3,000** డయాలసిస్‌కు అయ్యే సగటు ఖర్చు (ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కలిపి)

**3 నుంచి 4 లక్షలు** ఒక్కో కిడ్నీ రోగికి ఏడాదికి అయ్యే ఖర్చు..

## కాణిపాక వినాయకుని సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



న్యాయమూర్తులకు ప్రసాదాలు, వినాయకుడి ప్రతిమ అందజేస్తున్న ఆలయ అధికారి

**కాణిపాకం(చిత్తూరు జిల్లా):** కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు గంగారాం, విజయలక్ష్మి దర్శించుకున్నారు. అధికారులు, వేదపండితులు వారికి రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. మూషిక మండపంలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. న్యాయమూర్తులకు ఆలయ సూపరింటెండెంట్ స్వాములు, అధికారి కిషోర్ శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు.

## పొగాకు ధర తగ్గనివ్వం

- రైతులకు మేలు చేస్తాం..
- ఐటీసీ వ్యవసాయ విభాగం అధికారుల వెల్లడి

**సాక్షి, అమరావతి:** పొగాకు ధరలు తగ్గనివ్వబోమని, రైతులను ఆదుకుంటామని ఐటీసీ వ్యవసాయ విభాగం అధికారులు చెప్పారు. ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకు ధరలు తగ్గకుండా నిలకడగా ఉన్నాయని, తిరస్కరించే పొగాకు శాతం కూడా తగ్గిందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో నాణ్యమైన పొగాకు ఉత్పత్తి కాక ధర దారుణంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ అంశంపై దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబుతో ఐటీసీ వ్యవసాయ విభాగం అధిపతి సంజీవ్ రంగరాజ్, ఎంఎన్ రామ్‌ప్రసాద్, కృష్ణ కుమార్, వెంకట్రామిరెడ్డి తదితరులు శనివారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి కన్నబాబు మాట్లాడుతూ.. పొగాకు మార్కెట్లో ప్రధాన భాగస్వామి ఐటీసీయే అయినందున ధర తగ్గకుండా చూడాల్సిన బాధ్యత బోర్డుపైనే ఉందన్నారు. లో గ్రేడ్ పేరిట పొగాకును తిరస్కరించకుండా రైతులను ఆదుకోవాలని సూచించారు. దీనికి ఐటీసీ అధికారులు అంగీకరించారు. చివరి రైతు వరకు న్యాయం జరిగేలా చూడాలన్న మంత్రి ఆదేశానికి అనుగుణంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధ వల్ల లోగ్రేడ్ పొగాకు ధర కిలో రూ. 80 వద్ద నిలకడగా ఉందన్నారు.

# విద్యుత్ బస్సులపై ప్రతిపాదనలు రెడీ!

## రాష్ట్ర ప్రభుత్వమే బస్సుల కొనుగోలుకు యోచన

- కేంద్ర సబ్సిడీ కోసం ప్రణాళికలు
- ఐదు నగరాల్లో 350 బస్సుల్ని తిప్పనున్న ఆర్టీసీ
- నిర్వహణ వ్యయం తగ్గించడమే లక్ష్యం
- ఈ నెల 26న అధ్యయన కమిటీకి అధికారుల నివేదిక




**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో విద్యుత్ బస్సుల్ని నడిపేందుకు ఆర్టీసీ ప్రతిపాదనల్ని సిద్ధం చేసింది. నిర్వహణ వ్యయం భారీగా తగ్గించేందుకు 350 బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తే మేలని నిర్ణయించారు. ఇందుకు రూ. 764 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. విజయవాడ, అమరావతి, విశాఖపట్టణం, తిరుపతి, కాకినాడ నగరాల్లో విద్యుత్ బస్సులను తిప్పనున్నారు. ఏటా ఆర్టీసీ 32 కోట్ల లీటర్ల మేర డీజిల్‌ను వినియోగిస్తుండగా... ధరల పెరుగుదలతో రూ.300 కోట్ల వరకు నష్టాల్ని చవిచూస్తోంది. ఈ భారం నుంచి ఆర్టీసీని గట్టెక్కించడానికి ఇటీవల ప్రభుత్వం విద్యుత్ బస్సుల నిర్వహణపై నిపుణుల కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. డీజిల్ బస్సులు నడపడం వల్ల కి.మీ.కు డ్రైవరు జీతభత్యంతో కలిపి రూ. 38 వరకు ఖర్చవుతుంది. అదే విద్యుత్తు బస్సు నిర్వహణ ఖర్చు కి.మీ.కి రూ. 19 వరకే అవుతుందని కమిటీ తేల్చింది. ఈ నెల 26న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ రిటైర్డ్ ఐపీఎస్ ఆంజనేయరెడ్డి అధ్యక్షతన భేటీ కానుంది. ఈ కమిటీకి ఆర్టీసీ ప్రతిపాదనలు అందించనుంది.

### ఆ టెండర్లు రద్దు..

ఎన్నికల ముందు విద్యుత్ బస్సులు నడపడానికి ఆర్టీసీ ప్రైవేటు కంపెనీలతో చర్చలు జరిపింది. అయితే కి.మీ.కి రూ. 65 వరకు అవుతుందని ప్రైవేటు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఆ తర్వాత 80 విద్యుత్ బస్సులను నిర్వహించేందుకు ఆర్టీసీ టెండర్లు ఆహ్వానించింది. ఒకే ఒక్క కంపెనీ అందులో పాల్గొనగా... ఎక్సెస్ రేట్లకు టెండర్లు దాఖలు చేయడం గమనార్హం. నిర్వహణకు కి.మీ.కు రూ. 38 చెల్లించేలా ఆర్టీసీ టెండర్లలో పొందుపరిస్తే, టెండర్లలో పాల్గొన్న కంపెనీ కిలోమీటరుకు రూ. 50కి పైగా కోట్ చేసింది. ఇప్పుడు ఆ టెండర్లను రద్దు చేయాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఫేమ్–2 పథకం కింద రాయితీ అందిస్తే విద్యుత్తు బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేస్తే మేలని ప్రతిపాదనలు రూపొందించారు.

### ఛార్జింగ్ చేస్తే ఏడు నుంచి ఎనిమిది గంటలు

రాష్ట్రాల్లో ఇంధన పొదుపు చర్యలు చేపట్టేందుకు గాను ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని కేంద్రం ఫేమ్–2 పథకాన్ని నిర్వహిస్తోంది. సాధారణంగా విద్యుత్ బస్సు కొనుగోలు చేయాలంటే రూ. 2 కోట్ల నుంచి రూ. 2.5 కోట్ల వరకు ఖరీదు ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వనుంది. ఎలక్ట్రిక్ బస్సులో సీసీ కెమెరా, 31 సీట్ల సామర్థ్యం ఉంటుంది. ఆటోమేటిక్ గేర్లతో బస్సు నడుస్తుంది. రెండు గంటలు ఛార్జింగ్ చేస్తే నిరంతరాయంగా ఏడు నుంచి ఎనిమిది గంటలు బస్సు నడుస్తుందని ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

| | |
|---|---|
| ఆర్టీసీలో మొత్తం బస్సుల సంఖ్య | 11,687 |
| రోజుకు గమ్యస్థానాలకు చేరవేసే ప్రయాణికుల సంఖ్య | 68 లక్షలు |
| ఏడాదికి ఆర్టీసీ వాడుతున్న డీజిల్ (లీటర్లలో) | 32 కోట్ల లీటర్లు |
| డీజిల్ ధరలతో ఏటా ఆర్టీసీపై పడుతున్న భారం | రూ. 300 కోట్లు |
| విద్యుత్ బస్సులు తిప్పనున్న నగరాలు విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కాకినాడ, అమరావతి | |
| ప్రవేశపెట్టబోయే విద్యుత్తు బస్సుల సంఖ్య | 350 |
| ఒక్కో బస్సుకు అయ్యే వ్యయం (అంచనా) | రూ. 2.18 కోట్లు |
| 350 విద్యుత్తు బస్సులకు ఖర్చు చేయనున్న మొత్తం | రూ. 764 కోట్లు |
| ఫేమ్-2 స్కీమ్ ద్వారా కేంద్రం సాయమందిస్తే.. ఒక్కో బస్సుకు వచ్చే రాయితీ | రూ. కోటికి పైగానే.. |
| డీజిల్ బస్సు నిర్వహణ ఖర్చు | కి.మీ.కు రూ. 38 |
| విద్యుత్ బస్సు నిర్వహణ ఖర్చు | కి.మీ.కు రూ. 19 |

### కేంద్రం సాయం కోరేందుకు ప్రతిపాదనలు

రాష్ట్రంలో నడిపేందుకు ప్రభుత్వమే విద్యుత్ బస్సులను కొనుగోలు చేస్తుంది. ఇందుకు కేంద్ర సాయం కోరేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. విద్యుత్తు బస్సు నిర్వహణ వ్యయం డీజిల్ బస్సు నిర్వహణ వ్యయంతో పోలిస్తే కిలోమీటరుతో సగానికి సగం తక్కువగా ఉంది. ఈ నెల 26న అధ్యయన కమిటీతో భేటీ కానుంది. అందరం చర్చించి మెరుగైన ప్రజారవాణా వ్యవస్థ అందుబాటులోకి తెస్తాం.

– పేర్ని వెంకట్రామయ్య (నాని), రవాణా శాఖ మంత్రి

# అది అక్రమాల 'వేదిక'!

- దుర్వినియోగానికి కేరాఫ్ అడ్రస్
- మూడేళ్లపాటు టీడీపీ ఆఫీసుగా వాడుకున్న చంద్రబాబు
- పార్టీ కార్యకలాపాలన్నీ అక్కడి నుంచే
- ప్రభుత్వ భవనంలో పార్టీ కార్యక్రమాలేంటని విమర్శలొచ్చినా లెక్కలేదు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మరీ దుర్వినియోగం
- ప్రజావేదికను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే మాత్రం గగ్గోలు



ఉండవల్లిలోని ప్రజావేదిక

**సాక్షి, అమరావతి:** అధికారంలో ఉండగా తన అక్రమ నివాసం పక్కన చంద్రబాబు అనధికారికంగా కట్టించిన ప్రజావేదిక అక్రమాలు, దుర్వినియోగాలకు వేదికగా మారింది. నిన్నమొన్నటి వరకూ చంద్రబాబు సహా ఆయన కుమారుడు, టీడీపీ నేతలు దాన్ని యథేచ్ఛగా దుర్వినియోగం చేశారు. పేరుకు ప్రభుత్వ భవనమే అయినా ఇన్నాళ్లు దానిని టీడీపీ కార్యాలయంగా వాడుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలోనూ ఇష్టానుసారం వినియోగించుకున్న చంద్రబాబు.. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వదలకుండా వేలాడుతుండడం విమర్శలకు దారితీస్తోంది. దాన్ని అక్రమంగా నిర్మించడమే కాకుండా ప్రభుత్వ నిబంధనలన్నింటినీ ఉల్లంఘించి వినియోగించుకున్న బాబు.. దాన్ని తనకే ఇవ్వాలనడం చర్చనీయాంశంగా మారింది.

### నిర్మాణమే అక్రమం..

కృష్ణానదిపై అక్రమంగా నిర్మించిన భవనాన్ని తన అధికారిక నివాసంగా మార్చుకున్న చంద్రబాబు.. 2017లో దాని పక్కనే ప్రజావేదికను నిబంధనలకు విరుద్ధంగా సీఆర్‌డీఏతో కట్టించారు. ఎటువంటి అనుమతుల్లేకుండా, భారీగా అంచనాలు పెంచి నిర్మించిన దీనిని ప్రజలను కలుసుకోవాలనే సాకుతో నిర్మించారు. కానీ, ఏనాడూ ప్రజలను అందులోకి రానీయలేదు. నిర్మించిన నాటి నుంచి టీడీపీ ఆఫీసుగానే వినియోగించారు. రాష్ట్ర విభజన తర్వాత గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర కార్యాలయంగా మార్చినా చంద్రబాబు అక్కడికి వెళ్లింది రెండు, మూడుసార్లే. ప్రభుత్వ సమావేశాలతోపాటు టీడీపీ శాసనసభాపక్ష సమావేశాలు, పార్లమెంటరీ పార్టీ సమావేశాలు, పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాలు, ఇతర సమీక్షలు సైతం ఆయన అక్కడే నిర్వహించే వారు. ప్రభుత్వ ధనంతో నిర్మించిన భవనాన్ని పార్టీకి వాడుకోవడం ఏమిటనే విమర్శలొచ్చినా లెక్కచేయలేదు. ఎన్నికల సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రజావేదిక కిటకిటలాడేది. అభ్యర్థుల ఎంపిక, నాయకులతో మంతనాలు చేయడం దగ్గర నుంచి పార్టీ బాధ్యులందరూ అక్కడే ఉండి కార్యక్రమాలు నిర్వహించారు.

### లోకేశ్ సమావేశాలకు ఇదే వేదిక

ఇటీవల అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పుడు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఇక్కడే సమావేశం నిర్వహించారు. ఆయన కుమారుడు లోకేశ్ సైతం మంగళగిరి కార్యకర్తలతో ప్రజావేదికలోనే సమావేశమయ్యారు. రెండురోజుల క్రితం టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీమంత్రి దేవినేని ఉమా అక్కడే మీడియా సమావేశం నిర్వహించారు. ఇలా పార్టీ సమావేశాలకు చంద్రబాబు దాన్ని వాడుకుంటూనే తనకు కేటాయించాలని సీఎం వైఎస్ జగన్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కలెక్టర్ల సమావేశాన్ని ప్రజావేదికలో నిర్వహించాలని నిర్ణయించి స్వాధీనం చేసుకోవడంతో టీడీపీ నేతలు దానిపై రాద్ధాంతం మొదలుపెట్టారు. ప్రభుత్వ భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే వివాదాస్పదం చేయడంతోపాటు తమ వస్తువులను బయటపడేశారంటూ టీడీపీ నేతలు రచ్చ చేస్తున్నారు. అసలు అందులోకి పార్టీకి సంబంధించిన వస్తువులు, ఫైళ్లు ఎందుకు వచ్చాయనే దానికి నోరు మెదపని వారు.. తమ నుంచి అన్యాయంగా ప్రజావేదికను లాక్కున్నారని ఎదురుదాడి చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ అక్కడున్న అధికారులను దూషిస్తూ ప్రజావేదికను ఎలా స్వాధీనం చేసుకుంటారని నానాయాగీ చేశారు.

### కోడ్ ఉల్లంఘించి మరీ దుర్వినియోగం

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు సైతం చంద్రబాబు ప్రజావేదికను ఇష్టానుసారం దుర్వినియోగం చేశారు. కోడ్‌కు విరుద్ధంగా అక్కడ పార్టీ కార్యకలాపాలు నిర్వహించకూడదని తెలిసినా, ప్రతిపక్షాలు విమర్శించినా పట్టించుకోకుండా అక్కడి నుంచే పనిచేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఆయన లెక్కేచేయలేదు. ఎన్నికల ఫలితాలు వచ్చి ఓటమి పాలైన తర్వాత మౌనంగా ఉండి మళ్లీ ప్రజావేదికను పార్టీ కార్యకలాపాలకు వాడుకోవడం మొదలుపెట్టారు. తనను ఓదార్చడం కోసం నాయకులు, జనాలను అక్కడే కలుస్తున్నారు.

# అంతా అడ్డగోలు.. పైగా గగ్గోలు!

### ప్రజావేదికను అక్రమంగా నిర్మించారు

- నీటిపారుదల శాఖ అనుమతి, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కూడా లేదు
- అంచనాలు రూ.4.34 కోట్ల నుంచి 7.89 కోట్లకు పెంచేశారు
- అప్పటి మంత్రి నారాయణ నోటిమాట మీద దీన్ని కట్టేశారు
- తప్పులు చేసిన టీడీపీ దానిపై రాద్ధాంతం చేయడం సిగ్గుచేటు
- అక్రమమైనా అది ప్రభుత్వానిది కాబట్టి కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నాం
- అది చంద్రబాబు డబ్బులతోనో.. ఆయన తాత ఆస్తితోనో కట్టింది కాదు
- 'సాక్షి'తో మంత్రి బొత్స సత్యనారాయణ

**సాక్షి, అమరావతి:** కృష్ణానది కరకట్టపై గత తెలుగుదేశం ప్రభుత్వం ఎటువంటి అనుమతుల్లేకుండా ప్రజావేదికను అక్రమంగా నిర్మించిందని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. అయినా అది ప్రభుత్వానిది కావడం, అన్ని వసతులుండడంతో అక్కడ కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజావేదికను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని టీడీపీ నాయకులు తప్పుపడుతూ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో శనివారం దానికి సంబంధించి పూర్తి నివేదికను సీఆర్‌డీఏ ద్వారా ఆయన తెప్పించుకుని అందులో జరిగిన అవకతవకలను గుర్తించారు. వాటిని 'సాక్షి'కి వివరిస్తూ.. కరకట్టపై సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్మాణానికి అనుమతివ్వడం సాధ్యంకాదని 2019 సెప్టెంబరు ఆరో తేదీన నీటిపారుదల శాఖ కృష్ణా సెంట్రల్ డివిజన్ చీఫ్ ఇంజనీర్ స్పష్టంచేసినట్లు తెలిపారు. ప్రతిపాదిత ప్రాంతం కృష్ణా నది కరకట్టపై ఉండడం, వరద ప్రభావిత ప్రాంతంగా ఉండడంతోపాటు కరకట్టపై నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని లోకాయుక్త ఆదేశించిందని చెప్పారు. ప్రజావేదిక ప్లాన్‌కు సీఆర్‌డీఏగానీ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం అనుమతిగానీ లేవని ధృవీకరించినట్లు మంత్రి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా అప్పటి మున్సిపల్ మంత్రి



నారాయణ నోటి మాటతో ఈ కట్టడాన్ని నిర్మించారని.. అది కూడా అంచనాలు భారీగా పెంచేశారని తెలిపారు. ఎన్‌సీసీ కంపెనీకి తొలుత రూ.4.34 కోట్ల అంచనాతో ఈ నిర్మాణ పని అప్పగించగా ఆ తర్వాత దాన్ని రూ.8.90 కోట్లకు పెంచేశారని, చివరికి రూ.7.59 కోట్లు నిర్మాణ కంపెనీకి చెల్లించారని తెలిపారు. ఇది కూడా అప్పటి మంత్రి నారాయణ నోటి మాటగా జరిగిందని తెలిపారు. ప్రజావేదిక నిర్మాణం ఏ రకంగా చూసినా అక్రమ నిర్మాణమేనని, దాని పక్కనే ఉన్న చంద్రబాబు నివాసం కూడా అక్రమమేనని బొత్స స్పష్టంచేశారు.

### టీడీపీ రాద్ధాంతం సిగ్గుచేటు

ఈ అక్రమ నిర్మాణం గురించి టీడీపీ నేతలు రాద్ధాంతం చేయడం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం ప్రజావేదికను అక్రమంగా నిర్మించినా ప్రస్తుతానికి అన్ని వసతులతో అందుబాటులో ఉండడంవల్లే అక్కడ కలెక్టర్ల సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా వారి సామాజికవర్గానికి చెందిన వారి స్టార్ హోటళ్లలో కలెక్టర్ల సదస్సు నిర్వహించడంలేదని ప్రభుత్వానికి చెందిన భవనంలోనే నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఉండవల్లి వెళ్లి ప్రజావేదికను పరిశీలించిన మంత్రి బొత్స సత్యనారాయణ.. ప్రభుత్వ ధనంతో నిర్మించిన ప్రజావేదిక తమదంటూ టీడీపీ నేతలు గొడవ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం మారినప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు కొత్త ప్రభుత్వం అధీనంలోకి వస్తాయనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తించుకోవాలన్నారు. ప్రజావేదికలో సమావేశాలు నిర్వహించొద్దని టీడీపీ నేతలు అనడం సరికాదన్నారు. అది చంద్రబాబు డబ్బులతోనో లేక ఆయన తాత ఆస్తులతోనో కట్టింది కాదన్నారు. ప్రజావేదికపై అధికారులతో టీడీపీ నేతలు గొడవ పెట్టుకోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. అధికారులపై దాడులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బొత్స హెచ్చరించారు.

# ఒక్క బుల్లెట్ తగిలినా మసే

- అమెరికాకు ఇరాన్ ఘాటు హెచ్చరిక
- ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత
- ఇరాన్ గగనతలంలోకి వెళ్లకుండా విమానాలను మళ్లిస్తున్న భారత్


ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**టెహ్రాన్/వాషింగ్టన్:** అమెరికా, ఇరాన్ ఇంకా మాటలు తూటాలు విసురుకుంటూనే ఉన్నాయి. ఇరాన్‌పైకి యుద్ధ విమానాలు పంపించి మరీ ఆఖరి నిముషంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెనక్కి తగ్గిన నేపథ్యంలో ఇరాన్ ఘాటుగా స్పందించింది. తమపై యుద్ధంప్రకటిస్తే మధ్యప్రాచ్య దేశాలన్నీ ప్రమాదంలో పడతాయని హెచ్చరించింది. 'ఇరాన్‌కి ఒక్క బుల్లెట్ గాయమైనా ఈ ప్రాంతంలో అమెరికా, దాని మిత్రదేశాల ప్రయోజనాలన్నీ మంటల్లో కలుస్తాయి'' అని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ హెచ్చరించారు. ''మా శత్రువులు ఎవరైనా ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర పక్షాలు ఈ ప్రాంతంలో సైనికచర్యలకు దిగితే ఈ ప్రాంతం అంతా మండిపోతుంది'' అని అన్నారు. గత ఏడాది ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని అమెరికా ఏకపక్షంగా రద్దు చేసుకోవడంతో పాటు వివిధ దేశాలపై ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు వద్దంటూ ఆంక్షలు విధించిన దగ్గర్నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికా డ్రోన్‌ని ఇరాన్ కూల్చి వేసిన అవి మరింత పెరిగిపోయాయి. ఇరాన్ పైకి యుద్ధ విమానాల్ని పంపించిన అధ్యక్షుడు ట్రంప్ 150 మంది ప్రాణాలు కోల్పోతారని తెలిసే ఆఖరి క్షణంలో వెనకడుగు వేశారని కథనాలు వెలువడ్డాయి.

### అమెరికా సిబ్బందికి భద్రత పెంపు

అమెరికా, ఇరాన్ ఒకరికొకరు కవ్వింపు చర్యలకు దిగుతూ ఉండడంతో ఇరాక్ కూడా అప్రమత్తమైంది. ఇరాక్‌లోని అతి పెద్ద వైమానిక స్థావరం బాలాద్‌లో అమెరికా సిబ్బందికి భద్రతను పెంచింది. రాత్రి పూట నిఘా పెంచింది. తనిఖీలు చేపడుతోంది.

### ఇరాన్‌కు ప్రాణస్నేహితుడినవుతా: ట్రంప్

ఇరాన్ అణ్వాయుధాలను త్యజిస్తే గొప్ప దేశంగా మారుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ..'అణ్వాయుధాలను వదిలిస్తే ఇరాన్‌కు ప్రాణ స్నేహితుడిని అవుతా. ఇదే జరిగితే ఇరానియన్లు ధనవంతులుగా మారి సంతోషంగా ఉంటారు. ఇరాన్‌ను మళ్లీ గొప్పగా చేద్దాం' అని చెప్పారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలుండటాన్ని అంగీకరించబోమన్నారు. యుద్ధపిపాసి అన్న వారే తనను ఇప్పుడు శాంతి కపోతంగా అభివర్ణిస్తున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## విమానాలు దారి మళ్లిస్తున్న భారత్



**న్యూఢిల్లీ:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతున్న నేపథ్యంలో భారత్ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్ గగనతలంలోకి మన దేశానికి చెందిన విమానాలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నట్టు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వెల్లడించారు. ఆ విమానాలన్నింటినీ దారి మళ్లిస్తున్నట్టు తెలిపారు. ''అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి. అందుకే అన్ని విమానయాన సంస్థలు కేంద్ర పౌర విమానయాన శాఖతో నిరంతరం సంప్రదింపులు జరపాలి. ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ విమానాలను దారి మళ్లిస్తాం'' అని ట్వీట్ చేశారు. బాలాకోట్ దాడుల తర్వాత ఇప్పటికే పాకిస్తాన్ గగనతలం మీదుగా మన విమానాలేవీ ప్రయాణించడం లేదు. ఇప్పుడు ఇరాన్ మీదుగా వెళ్లకుండా నియంత్రణలు విధిస్తే అమెరికా, యూరోప్ దేశాలు, మధ్య ప్రాచ్య దేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాల పరిస్థితి గందరగోళంలో పడుతుందని ఎయిర్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని లోహాని వ్యాఖ్యానించారు.

## మరోసారి 'గ్రే' జాబితాలో పాక్

- యాక్షన్ ప్లాన్ అమలులో పాక్ విఫలమయిందన్న ఎఫ్ఏటీఎఫ్
- తీరు మారకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**న్యూఢిల్లీ:** అక్రమ నగదు చెలామణి, ఉగ్రవాదులకు ఆర్థికసాయం నిలిపివేత విషయంలో పాకిస్తాన్ ఘోరంగా విఫలమైందని ది ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) తెలిపింది. తాము నిర్దేశించిన 27 పాయింట్ల కార్యాచరణ ప్రణాళిక(యాక్షన్ ప్లాన్)ను పాక్ అమలు చేయలేకపోయిందని విమర్శించింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌ను మరోసారి 'గ్రే జాబితా'లోనే కొనసాగిస్తున్నామని వెల్లడించింది. ఈ సెప్టెంబర్ చివరికల్లా ఈ లక్ష్యాలను చేరుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అమెరికాలో సమావేశమైన ఎఫ్ఏటీఎఫ్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ఎఫ్ఏటీఎఫ్ అధికార ప్రతినిధి స్పందిస్తూ..'పాకిస్తాన్ నిర్ణీత లక్ష్యాలను చేరుకోనందున ఆ దేశాన్ని 'గ్రే జాబితా'లో ఉంచాలని నిర్ణయం తీసుకున్నాం. తమ భూభాగంలోని ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందకుండా కచ్చితమైన, విశ్వసించదగ్గ స్థాయిలో, శాశ్వత ప్రభావం చూపేలా చర్యలు తీసుకోవాలని పాక్‌ను ఎఫ్ఏటీఎఫ్ ఆదేశించింది. గడువులోగా అంటే ఈ ఏడాది సెప్టెంబర్‌లోపు ఎఫ్ఏటీఎఫ్ కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని స్పష్టం చేసింది' అని తెలిపారు.

**అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ కన్నెర్ర..**

ఉగ్రసంస్థలు లష్కరే తోయిబా(ఎల్ఈటీ) చీఫ్ హఫీజ్ సయీద్, జైషే మొహమ్మద్(జేఈఎం) అధినేత మసూద్ అజర్‌లపై సరైన చర్యలు తీసుకోవడంలో పాక్ విఫలమైందని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎఫ్ఏటీఎఫ్ కార్యాచరణ ప్రణాళికను పూర్తిస్థాయిలో అమలుచేయడానికి పాకిస్తాన్ చర్యలు తీసుకోవాలని భారత్ డిమాండ్ చేసింది.

## గర్భవతులకు చేరువగా అంగన్‌వాడీలు

### కేంద్రాల మార్పునకు రాష్ట్రాలకు అనుమతి



**న్యూఢిల్లీ:** గర్భవతులను, చిన్నపిల్లలను దృష్టిలో ఉంచుకొని వారికి మరింత చేరువగా పోషకాహారాన్ని అందించేందుకు కేంద్రం సిద్ధమైంది. రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాకు అంగన్‌వాడీ సెంటర్లను లబ్ధిదారులకు అనువుగా మార్చుకొనేందుకు అనుమతి ఇచ్చింది. సాధారణంగా పట్టణాల్లో 5 కిలోమీటర్లు, పల్లెల్లో 3 కిలోమీటర్లు, గిరిజన ప్రాంతాల్లో 1.5 కిలోమీటర్ల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు ఉండాలి. ఇంతకు మించి దూరం ఉన్న కేంద్రాలన్నీ ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోనున్నామని అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ సేవా పథకం కింద కేంద్రం 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను అనుమతినిచ్చింది. బాలింతలు, గర్భవతులు, చిన్న పిల్లల తల్లులకు అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను మార్చుకోవడానికి (రీలొకేట్) కేంద్రం తాజాగా అనుమతి ఇచ్చింది. తల్లీపిల్లలకు పోషకారాన్ని అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించింది. వీటి ద్వారా దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది లబ్ధి పొందుతుండగా, వీరికి పథకాలను చేరవేయడానికి 26 లక్షల మంది అంగన్‌వాడీలు పని చేస్తున్నారు.

## అమ్రిశ్‌పురికి 'డూడుల్' నివాళి




**ముంబై:** ప్రసిద్ధ భారతీయ నటుడు అమ్రిశ్‌పురి 87వ జయంతి సందర్భంగా గూగుల్ ప్రత్యేక నివాళులర్పించింది. పుణేకు చెందిన కళాకారుడు దేబాంగ్షు మౌలిక్ రూపొందించిన స్పెషల్ డూడుల్‌ను గూగుల్ శనివారం తన హోం పేజీలో పొందుపరిచింది. 1932 జూన్ 22న పంజాబ్‌లో జన్మించిన పురి, 1971లో వచ్చిన 'రేష్మా ఔర్ షెరా'చిత్రం ద్వారా తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. తర్వాత శ్యామ్ బెనెగల్ రూపొందించిన 'నిశాంత్' 'మంతన్' సినిమాల్లో పనిచేశారు. హిందీ, మరాఠీ, కన్నడ, పంజాబీ, మలయాళం, తెలుగు, తమిళం, ఇంగ్లిష్ సహా వివిధ భాషల్లో 200కి పైగా చిత్రాల్లో నటించారు. 1987లో వచ్చిన 'మిస్టర్ ఇండియా'లో మొగాంబోగా అతని నటన అందరికీ గుర్తుండిపోతుంది. ఆస్కార్ అవార్డు గెలుచుకున్న 'గాంధీ' చిత్రంలో ఖాన్ అనే సహాయక పాత్ర ద్వారా పురి హాలీవుడ్‌లో అడుగుపెట్టారు.

## అమెరికాలో విమానం కూలి 9 మంది మృతి

**హోనలులు:** అమెరికాలో స్కై డైవ్ ఆపరేషన్‌కు ఉపయోగించిన ఓ చిన్న విమానంలో అగ్ని ప్రమాదం జరగడంతో కూలిపోయింది. దీంతో ఆ విమానంలో ప్రయాణిస్తున్న 9 మంది మృతి చెందినట్లు హవాయి అధికారులు తెలిపారు. ఈ ఘటన ఓహూ ఉత్తర తీరంలోని డిల్లింఘమ్ సమీపంలోని విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. 'ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండింగ్‌కు ముందు పూర్తిగా మంటల్లో కాలిపోవడాన్ని మేం చూశాం. ఎయిర్‌పోర్టు చుట్టూ ఉన్న కంచె సమీపంలో మంటల్లో విమానం కూలిపోయింది' అని హోనలులు అగ్నిమాపక అధికారి మాన్యువల్ నీవ్స్ వెల్లడించారు. ఈ విమానాన్ని స్కై డైవ్ ఆపరేషన్‌కు ఉపయోగించారని, ఆ విమానంలో వెళ్లిన వారి కుటుంబసభ్యులు వారి రాక కోసం ఎయిర్ పోర్టులో ఎదురు చూస్తున్నారని ఆయన చెప్పారు. మృతుల వివరాలు తెలియరాలేదని చెప్పారు.

## ముజఫర్‌పూర్ ఆస్పత్రి సమీపంలో అస్థిపంజరాలు

**ముజఫర్‌పూర్:** బిహార్‌లో ముజఫర్‌పూర్ సమీపంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీకృష్ణ మెడికల్ కాలేజీ అండ్ ఆస్పత్రి (ఎస్‌కేఎంసీహెచ్)కి ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతంలో అస్థి పంజరాలు లభించడం కలకలం రేపుతోంది. మెదడువాపు వ్యాధి లక్షణాలతో వందలాదిగా చిన్నారులు ఈ ఆస్పత్రిలోనే మృతి చెందడం ఆందోళన కలిగిస్తుండగా ఆ ప్రాంతంలోనే లెక్కకు మించి అస్థిపంజరాలు కనిపించడంపై ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. అస్థి పంజరాల్లో ఒకట్రెండు కాలిన గాయాలతో ఉన్నట్టు తేలడం, విసిరేసినట్టుగా ఉండడం, బుట్టల్లో కుక్కి ఉంచడం వెనుక కారణాలు అంతుచిక్కడం లేదు. చిన్నారుల మరణాలపై విచారణ నిమిత్తం వచ్చిన బృందం, పోలీసులు ఈ ప్రాంతాన్ని సందర్శించింది.

## ఆయుధ వ్యాపారి భండారిపై కేసు

**న్యూఢిల్లీ:** భారత వాయుసేన కోసం 75 ఫిలాటస్ శిక్షణ విమానాలకోసం 2009లో కుదుర్చుకున్న ఒప్పందంలో జరిగిన అవినీతి కేసులో ఆయుధ వ్యాపారి సంజయ్ భండారి, ఇతరులపై సీబీఐ కేసులు నమోదు చేసింది. ఈ ఒప్పందం విలువ రూ.2895 కోట్లని శనివారం దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఢిల్లీలోని సంజయ్‌బండారి ఇల్లు, ఆఫీసులపై తొమ్మిదిచోట్ల సీబీఐ దాడులు చేసింది. సీబీఐ మూడేళ్లపాటు జరిపిన విచారణలో ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాలను సంపాదించింది. ఈ కేసులో వైమానిక దళానికి చెందిన కొందరు అధికారులను, ఫిలాటస్ సంస్థను కూడా విచారించనున్నట్లు సమాచారం.

**బిజినెస్**

## అమెరికాలో డాక్టర్ రెడ్డీస్ విటమిన్ కే1 జనరిక్ ఔషధం

**న్యూఢిల్లీ:** డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కంపెనీ అమెరికా మార్కెట్లో విటమిన్ కే1 జనరిక్ ఔషధాన్ని ప్రవేశపెట్టింది. విటమిన్ కే1కు జనరిక్ ఔషధమైన ఫైటోనాడియోన్ ఇంజెక్టబుల్ ఎమల్సన్ యూఎస్‌పీ(సింగిల్ డోజ్ యాంపుల్స్)ను అమెరికా మార్కెట్లోకి తెచ్చామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగిసిన ఏడాదికి విటమిన్ కే1 అమ్మకాలు 4.66 కోట్ల డాలర్లని పేర్కొంది.

**దువ్వాడ ప్లాంట్లకు ఫార్మ్ 483**

మరోవైపు విశాఖపట్టణంలోని దువ్వాడ సమీపంలోని తమ రెండు ప్లాంట్లను ఈ నెల 21న అమెరికా ఎఫ్‌డీఏ(ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) తనిఖీ చేసిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. ఈ తనిఖీ అనంతరం రెండు అభ్యంతరాలతో కూడిన ఫార్మ్483ను యూఎస్ఎఫ్‌డీఏ జారీ చేసిందని పేర్కొంది. నిర్దేశిత గడువులోగా ఈ అభ్యంతరాలను సరిదిద్దుతామని వివరించింది.

# జడ్జీలను పెంచండి

- మాజీ జడ్జీలను నిర్ణీతకాలానికి తిరిగి నియమించండి
- ప్రధాని మోదీకి సీజేఐ జస్టిస్ గొగోయ్ లేఖలు



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టుతో పాటు అన్నిహైకోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్ తెలిపారు. దేశంలో న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలపై గొగోయ్ శనివారం ప్రధాని నరేంద్ర మోదీకి మూడు లేఖలు రాశారు. ఈ సందర్భంగా హైకోర్టుల్లో జడ్జీల పదవీవిరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచాలని కోరారు. అలాగే గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్న కేసుల్ని పరిష్కరించేందుకు పదవీవిరమణ చేసిన జడ్జీలను నిర్ణీతకాలానికి మళ్లీ విధుల్లో తీసుకోవాలని సూచించారు. 'సుప్రీంకోర్టులో ప్రస్తుతం 58,669 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. కానీ తగినంత మంది న్యాయమూర్తులు లేకపోవడంతో ఈ కేసులను విచారించలేకపోతున్నాం. మీకు(మోదీకి) గుర్తుందనుకుంటా. 1988లో సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 18 నుంచి 26కు చేరుకుంది. అనంతరం రెండు దశాబ్దాల తర్వాత అంటే 2009లో సీజేఐతో కలిపి జడ్జీల సంఖ్య 31కి చేరుకుంది. సుప్రీంకోర్టు తన విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని, ఇందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మిమ్మల్ని కోరుతున్నాను. దీనివల్ల కోర్టు మెట్లు ఎక్కే ప్రజలకు నిర్ణీత సమయంలోగా న్యాయం దొరుకుతుంది' అని లేఖలో గొగోయ్ తెలిపారు. సుప్రీం, హైకోర్టుల్లో జడ్జీల పోస్టులకు అర్హులైనవారి సంఖ్య పెరిగినప్పటికీ, అదే స్థాయిలో న్యాయమూర్తుల సంఖ్య మాత్రం పెరగలేదన్నారు.

**హైకోర్టుల్లో తీవ్రమైన కొరత..**

హైకోర్టుల్లో జడ్జీల కొరత తీవ్రంగా వేధిస్తోందని జస్టిస్ గొగోయ్ ప్రధాని మోదీకి రాసిన తన రెండో లేఖలో తెలిపారు. 'ప్రస్తుతం దేశంలోని అన్నిహైకోర్టుల్లో కలిపి 39 శాతం అంటే 399 జడ్జి పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఈ ఖాళీలను వీలైనంత త్వరగా భర్తీ చేయాలి. శక్తివంచనలేకుండా కృషి చేస్తే తప్పించి ఈ ఖాళీలను భర్తీచేయడం సాధ్యం కాదు. అలాగే హైకోర్టుల్లో న్యాయమూర్తుల పదవీవిరమణ వయసును 62 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచాలని మిమ్మల్ని(ప్రధాని) కోరుతున్నా. ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగ సవరణను చేపట్టండి. గతంలో పార్లమెంటరీ స్థాయీసంఘాలు కూడా దీన్ని సూచించాయి' అని జస్టిస్ గొగోయ్ వెల్లడించారు. పదవీవిరమణ చేసిన సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల సేవలను వినియోగించుకునే అంశాన్ని పరిశీలించాలని ఆయన మరో లేఖలో కోరారు. నిర్ణీత కాలానికి వీరిని న్యాయమూర్తులుగా నియమించేందుకు వీలుగా రాజ్యాంగంలోని 128, 224ఏ అధికరణలకు సవరణ చేయాలని సూచించారు. దీనివల్ల అపార అనుభవం ఉన్న జడ్జీలు మరింత ఎక్కువకాలం సేవలు అందించడం వీలవుతుందని పేర్కొన్నారు.

## సీఐఏ గూఢచారికి ఇరాన్ ఉరిశిక్ష

**టెహ్రాన్:** అమెరికాకు ఇరాన్ రహస్య సమాచారాన్ని చేరవేస్తున్న జలాల్ హాజీ జవెర్ అనే రక్షణశాఖ కాంట్రాక్టర్‌ను ఉరితీసినట్లు ఇరాన్ సైన్యం తెలిపింది. అమెరికా నిఘా సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) కోసం ఇతను పనిచేసేవాడని వెల్లడించింది. పక్కా సాక్ష్యాధారాలతో జలాల్‌ను పట్టుకున్నామనీ, అతని ఇంట్లో ఇరాన్ రక్షణశాఖకు సంబంధించి కీలక పత్రాలు, నిఘాపరికరాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొంది. జలాల్‌ను ఇరాన్ మిలటరీ కోర్టు దోషిగా తేల్చిందనీ, ఆయనకు కరాజ్ నగరంలోని రాజయ్ షాహ్రె జైలులో మరణశిక్షను అమలుచేశామని చెప్పింది. జలాల్‌తో కలిసి గూఢచర్యానికి పాల్పడ్డ నేరానికి ఆయన మాజీ భార్యకు 15 ఏళ్ల జైలుశిక్ష పడిందన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తాజా ఘటన ఎటుదారితీస్తుందో అని ప్రపంచదేశాల్లో ఆందోళన నెలకొంది.

## బెంగాల్‌లో మళ్లీ అల్లర్లు

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని భాత్పరలో శనివారం మళ్లీ అల్లర్లు చెలరేగాయి. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. గురువారం ఉత్తర 24 పరగణలో జరిగిన అల్లర్లలో ఇద్దరు మరణించగా 11 మంది గాయపడిన సంగతి తెలిసిందే. బాధితులను పరామర్శించడానికి కేంద్ర మాజీ మంత్రి, బర్ధామన్–దుర్గాపూర్ ఎంపీ ఎస్ఎస్ అహ్లువాలియాతో పాటు ఎంపీలు, మాజీ పోలీసు అధికారులు సత్యపాల్ సింగ్, బీడీ రామ్ కూడా వచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ మరణించిన ఇద్దరూ బీజేపీ కార్యకర్తలని తెలిపారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు, హోం మంత్రి అమిత్‌షాకు నివేదిక అందిస్తామన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను పోలీసులు, తృణమూల్ కాంగ్రెస్ కొట్టిపారేశాయి. ఈ సందర్భంగా రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. పోలీసులు వారిని అదుపు చేసేందుకు లాఠీచార్జి జరపాల్సి వచ్చింది.

## 'బడ్జెట్ హల్వా' తయారీ

**ఆరంభమైన బడ్జెట్ పత్రాల ముద్రణ**


హల్వా తయారీ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర అధికారులు

**న్యూఢిల్లీ:** 'బడ్జెట్ హల్వా'ఉత్సవం శనివారం సాయంత్రం ఇక్కడి ఆర్థిక శాఖ ప్రధాన కార్యాలయం నార్త్‌బ్లాక్‌లో జరిగింది. సాధారణంగా బడ్జెట్ పత్రాల ముద్రణను హల్వా తయారీతో ఆరంభిస్తారు. ఈ ఆనవాయితీలో భాగంగానే వచ్చే నెల 5న ప్రవేశపెట్టే బడ్జెట్‌కు సంబంధించిన పత్రాల ముద్రణను ప్రారంభించే కార్యక్రమానికి ముందు హల్వా ఉత్సవం చోటు చేసుకుంది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్థిక శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్, రెవెన్యూ కార్యదర్శి అజ్ భూషణ్ పాండే, దీపమ్ కార్యదర్శి అతను చక్రవర్తి, ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ తదితరులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. హల్వా సంరంభంలో భాగంగా పెద్ద కడాయిలో హల్వాను తయారు చేసి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు, బడ్జెట్ తయారీకి సంబంధించిన సిబ్బందికి వడ్డించారు. ఈ సిబ్బంది... బడ్జెట్ తయారీ నుంచి లోక్‌సభలో ప్రవేశపెట్టేవరకూ ఆర్థిక మంత్రిత్వ శాఖ భవనంలోనే ఉంటారు. బయటి ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు ఉండవు. ఉన్నతాధికారులకు మాత్రమే ఇంటికి వెళ్లడానికి అనుమతి ఉంటుంది.

**ఆర్థిక నిపుణులతో ప్రధాని భేటీ..**

ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థికవేత్తలు, పారిశ్రామిక నిపుణులతో శనివారం సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ నిర్వహించిన ఈ సమావేశంలో ఆర్థిక వేత్తలు, వివిధ పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, గణాంకాలు, పథకాల అమలు శాఖ సహాయ మంత్రి ఇంద్రజిత్ సింగ్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్‌లు కూడా హాజరయ్యారు.

# కాంగ్రెస్ పగ్గాలు గహ్లోత్‌కు?



**లో**క్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేసిన దగ్గర నుంచి కొత్త అధ్యక్షుడెవరన్నది చర్చనీయాంశమయింది. రాజీనామాను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తిరస్కరించినా, పదవిలో కొనసాగాల్సిందిగా పలువురు సీనియర్లు బతిమాలినా రాహుల్ గాంధీ ససేమిరా అంటున్నారు. దాంతో సోనియా గాంధీ, అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్, ఏకే ఆంటోనీ, కేసీ వేణుగోపాల్‌తో కూడిన కమిటీ కొత్త అధ్యక్షుడి కోసం వెదుకులాట మొదలు పెట్టింది. ఈ ప్రక్రియలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ పేరు తెరపైకి వచ్చింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీతో అనుబంధం ఉన్న గహ్లోత్ అధ్యక్ష పదవికి సరైన వారని నాయకత్వం భావిస్తోందని తెలిసింది. గెహ్లాట్‌కు పార్టీ పగ్గాలు అప్పగించడం ద్వారా కాంగ్రెస్‌లో కుటుంబ పాలన నడుస్తోందన్న విపక్షాల విమర్శకు తెరదించవచ్చని కాంగ్రెస్ నాయకత్వం ఆలోచిస్తోందని సమాచారం. అందుకు గహ్లోత్‌ను ఒప్పించిందని సీనియర్ నాయకుడొకరు ధ్రువీకరించారు. గహ్లోత్‌కు అధ్యక్ష పదవి ఖరారయిందని నవభారత్ టైమ్స్ పత్రిక పేర్కొంది. జూన్ 19న రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న గహ్లోత్ కొద్దిసేపు రాహుల్‌తో ఏకాంతంగా సమావేశమవడం ఇందుకు బలం చేకూరుస్తోంది. రాహుల్ అధ్యక్ష పదవిలో కొనసాగేలా చూసేందుకు నేతలు విఫలయత్నం చేశారు. రాహుల్ నిర్ణయాన్ని సోనియా వ్యతిరేకించారు. రాజీనామా చేస్తే దక్షిణాదిన పార్టీ దెబ్బతింటుందని చిదంబరం హెచ్చరించారు. అయినా రాహుల్ పట్టు వీడలేదు. పార్టీ పగ్గాలు స్వీకరించడానికి ప్రియాంక కూడా సుముఖంగా లేరు. దాంతో కొత్త నేత ఎంపిక అనివార్యమయింది. గాంధీ కుటుంబానికి అత్యంత విధేయుడిగా పేరున్న 68 ఏళ్ల గహ్లోత్‌కు పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. గతంలో రెండు సార్లు సీఎంగా పని చేసిన ఆయన మూడోసారి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. గహ్లోత్‌ను పార్టీ అధ్యక్షుడిని చేసి సీఎం పదవిని సచిన్ పైలట్‌కు ఇవ్వాలని తద్వారా ఆ ఇద్దరి మధ్య విభేదాలకు తెరదించాలని అధిష్టానం ఆలోచిస్తోందని సమాచారం. గహ్లోత్ ఒప్పుకోకపోతే ముకుల్ వాస్నిక్, మనీష్ తివారీ, శశి థరూర్ పేర్లు పరిశీలనలో ఉన్నాయని ఆ పత్రిక తెలిపింది. కాగా, ఈ వార్తలను గహ్లోత్ తోసిపుచ్చారు. ఇదిలా ఉండగా, పార్టీకి నలుగురు వరకు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించే విషయం కూడా పరిశీలనలో ఉందని తెలుస్తోంది.

## ట్రంప్ అత్యాచారం చేశారు

**మరో రచయిత్రి ఆరోపణ • తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు**



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తగా ఉన్న సమయంలో అమ్మాయిలతో వ్యవహారాలు చాలా నడిపాడని, లైంగికంగా వేధించాడని ఆరోపణలు ఇప్పటికే చాలా ఉన్నాయి. తాజాగా రచయిత్రి ఈ జీన్ కరోల్ కూడా 1995 సమయంలో ట్రంప్ తనపై అత్యాచారం చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఆమె తన జీవితంలోని అనుభవాల్ని న్యూయార్క్ మ్యాగజైన్ కవర్ స్టోరీలో రాస్తూ ఈ ఆరోపణలు చేశారు. మన్‌హట్టన్‌లో బెర్గ్‌డోర్ఫ్ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో తనను కలిసిన ట్రంప్ గర్ల్ ఫ్రెండ్‌కి ఒక గౌను కొన్నానని, అది వేసుకొని చూస్తే ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుందంటూ కోరారని వెల్లడించారు. అందుకు అంగీకరించి డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లగా ట్రంప్ తనపై అత్యాచారం చేశారని పేర్కొన్నారు. కరోల్ తాను రాసిన కొత్త పుస్తకం వాట్ డూ వి నీడ్ మెన్ ఫర్ పుస్తకం నుంచి కొన్ని భాగాలతో ఈ కథనం రాశారు. ఈ పుస్తకం విడుదల కావల్సింది. ఈ కథనంపై ట్రంప్ స్పందించారు. అసలు కరోల్‌ని తన జీవితంలో ఎప్పుడూ కలవలేదని ట్రంప్ ఒక ప్రకటన విడుదల చేశారు. కరోల్ తన పుస్తకం అమ్మకాలు పెంచుకోవడానికే ఈ కట్టు కథ అల్లి వదిలిందన్నారు. ఆధారాలు లేకుండా న్యూయార్క్ మ్యాగజైన్ ఇలాంటి కథనాన్ని ఎలా ప్రచురిస్తుందని నిలదీశారు. అంత పెద్ద స్టోర్‌లో కెమెరాలు ఉండవా? సేల్స్ అటెండర్స్ ఉంటారు కదా? డ్రెస్సింగ్ రూమ్‌లో అత్యాచారం ఎలా సాధ్యం ? బెర్గ్‌దోర్ఫ్ గుడ్‌మ్యాన్ స్టోర్ వాళ్లు ఎలాంటి వీడియోలు లేవని ధ్రువీకరించారు. ఎందుకు లేవంటే అలాంటి ఘటనే జరగలేదని ఆ ప్రకటనలో వెల్లడించారు. ట్రంప్ అధికారం పీఠం ఎక్కిన దగ్గర్నుంచి కనీసం 20 మంది మహిళలు ఆయనకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేశారు.

# ఎడారి కమ్ముకొస్తోంది



**భా**రత దేశంలో నేలతల్లి నెర్రలు విచ్చుకుంటోంది. పచ్చదనంతో కళకళలాడుతూ వ్యవసాయానికి ఉపయోగపడాల్సిన భూమి ఎందుకూ పనికి రాకుండా ఎడారిగా మారిపోతోంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ తాజా అంచనాలు, ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ నివేదిక ప్రకారం భారత్‌లో 90 శాతం రాష్ట్రాల్లో ఎడారీకరణ విస్తరించింది. దీంతో వ్యవసాయ రంగం కుదేలైపోతోంది. భారత్‌లో 328.72 మిలియన్ హెక్టార్ల భౌగోళిక ప్రాంతం ఉంటే అందులో 96.4 మిలియన్ హెక్టార్ల ప్రాంతం ఎడారిగా మారిపోయింది. అంటే 30శాతం భూమి ఎందుకూ పనికి రాకుండా పోయిందన్న మాట. మొత్తం 29 రాష్ట్రాలకు గాను 26 రాష్ట్రాల్లో గత పదేళ్లలో ఎడారి ప్రాంతం బాగా పెరిగింది. ఎనిమిది రాష్ట్రాల్లో పరిస్థితి మరీ ఘోరం. 40–70% ఎడారిగా మారిపోయిందని ఆ నివేదిక వెల్లడించింది.. రాజస్థాన్, ఢిల్లీ, గోవా, మహారాష్ట్ర, జార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో రోజురోజుకీ సారవంతమైన భూములు తగ్గిపోతున్నాయి. ఇక మిజోరంలో లంగ్లే ప్రాంతంలో నేల పెళుసుబారడం మరీ ఎక్కువగా పెరిగిపోతోంది. 5.8శాతంగా ఇది ఉంది. 2003–2011 మధ్యలో అత్యధికంగా1.8 మిలియన్ హెక్టార్ల భూమి ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఇక ఆంధ్రప్రదేశ్ 14.35 శాతం , తెలంగాణలో 31.40 శాతం భూములు నిరుపయోగంగా మారాయి. ఏపీలో అనంతపురం జిల్లాలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. దేశం మొత్తం మీద అతి తక్కువ వర్షపాతం కురిసిన జిల్లాల్లో అనంతపురం ఒకటి. తెలంగాణలో నల్లగొండ జిల్లాలో అధికంగా ఎడారీకరణ జరుగుతోంది.

**ఎందుకీ పరిస్థితి ?**

నీటి వనరుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అతివృష్టి అనావృష్టి పరిస్థితుల కారణంగా ఉత్పాదక భూమి పంటలు పండడానికి అనుగుణంగా లేకపోవడాన్నే ఎడారీకరణ అంటారు. దీని కారణంగా నీటి వనరులు తగ్గిపోతాయి. మొక్కలు పెరగవు. వన్యప్రాణులకు స్థానం ఉండదు.

**ఎడారిలో పూలు పూస్తాయా !**

దేశంలో ఎడారీకరణ తగ్గిస్తామని భారత్ ఐక్యరాజ్య సమితి సదస్సులో 1994లోనే సంతకాలుచేసింది. 2030 నాటికి వ్యర్థంగా మారిన భూముల్ని సాగుకు అనుగుణంగా చేయాలన్న లక్ష్యంతో ఉంది. ఈ సెప్టెంబర్‌లో భారత్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ పద్నాలుగో సదస్సు (కాప్–14)కి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సదస్సు సందర్భంగా వచ్చే మూడున్నరేళ్లలోనే ఎంపిక చేసిన రాష్ట్రాలైన హర్యానా, మధ్యప్రదేశ్ మహారాష్ట్ర, నాగాలాండ్ అటవీ భూముల్ని పెంచుతామని హామీ ఇవ్వనుంది. నీటి వనరుల సంరక్షణ, పచ్చదనం పెంపు, భూ సార పరిరక్షణ, జీవవైవిధ్యం పెంపు వంటి చర్యల ద్వారా భారత్ ఎడారిలో పూలు పూయించనుంది.

### దేని కారణంగా ఎంత ఎడారీకరణ

| | |
|---|---|
| 11% | భారీగా వర్షాలు కురిసి మట్టి కొట్టుకుపోవడం |
| 5.6% | గాలి బీభత్సం |
| 0.78% | మానవ ఆక్రమణలు |
| 8.9% | పచ్చదనం కోల్పోవడం |
| 1.1% | ఉప్పు నీళ్లు వచ్చి సారవంతమైన భూముల్ని నాశనం చేయడం |

1847 జూన్ 22న హాన్సన్ గ్రెగరీ.. అమెరికాలో దోనట్‌ను తొలిసారిగా రూపొందించినట్లు నమ్ముతారు.



# ఎగిరే పైకెగిరే..!




కాలుష్యం.. ట్రాఫిక్.. ఈ రెండు చాలు నగర జీవనం ఎంత దుర్భరంగా ఉంటుందో తెలిపేందుకు. అయితే కొన్ని నగరాల్లో వీటి నుంచి మెట్రోరైలు కొంత ఉపశమనం కలిగిస్తుంది. కానీ అంతకు మించిన ఉపశమనాన్ని మనకు అందించేందుకు ఉబర్ సంస్థ మరో ముందడుగు వేసింది. గాల్లో ఎగిరే ట్యాక్సీ కార్లను మన ముందుకు తెచ్చింది. దీన్ని చూసేందుకు హెలికాప్టరో.. కారో కూడా అర్థం కాదు. నలుగురు ఎంచక్కా ఈ కారులో వెళ్లొచ్చు. నార్త్ స్టార్ అనే కంపెనీతో కలిసి ఉబర్ ఈ కారును డిజైన్ చేసింది. ఇటీవల అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగిన ఉబర్ ఎలివేట్ సమ్మిట్–2019లో ఈ కారును ప్రదర్శనకు ఉంచింది. అయితే 2020లో తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెడతామని, 2023 వరకు ఎయిర్ ట్యాక్సీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతానికి అమెరికాలో మాత్రమే ఈ వెసులుబాటు కల్పించనుంది. అతి త్వరలోనే మన దగ్గరికి కూడా రావాలని కోరుకుందాం.

# పాటవింటే చాలు వండేయొచ్చు!

ఆర్ యూ హంగ్రీ? ఆర్ యూ హంగ్రీ?...అయితే పాటేస్కోండి చాలు... క్షణాల్లో మీ చేతులు మీకు తెలయకుండానే లయబద్ధంగా గరిటెతిప్పుతాయి. ఇదే చిట్కాతో వంటలపాటలను పాడేస్తూ కేరళ ఉర్ల్ కళంగ్ కర్రీ, తెలుగువారి దద్ధోజనం, ఆలూ పాస్తా, మటన్ బిర్యానీ, చిన్నారులు మెచ్చే బట్టర్ చికెన్ ఏదైనా సరే క్షణాల్లో వండేస్తూ నెటిజన్లను కట్టిపడేస్తున్నారు బెంగాలీ ఆంటీ సావన్‌దత్తా. ఇష్టంగా చేస్తే వంట కూడా ఒక కళ. ఆ కళ వంట బట్టాలంటే బోర్‌కొట్టే రొటీన్ వంటల కార్యక్రమంలా కాకుండా సరికొత్తగా వంటబట్టించాలనుకున్న సావన్ దత్ అనే బెంగాలీ ఆంటీ ఏపీ, తెలంగాణలతో సహా దక్షిణాది స్పెషల్ వంటకాలతో భోజనప్రియులను వంటింట్లోకి నడిపించేస్తున్నారు. ఇప్పటికే కుప్పలుతెప్పలుగా యూట్యూబ్‌లో వంటలకార్యక్రమాలుంటే ఇందులో కొత్తేముందీ అనుకోకండి. ఇక్కడ వంటలన్నీ పాటల రూపంలో ఉంటాయి. వంటకు కావాల్సిన పదార్థాల నుంచి, వండే విధానం వరకూ అందమైన బ్యాక్‌గ్రౌండ్‌లో చక్కటి హావభావాలతో వండిచూపించడమే సావన్ దత్తా స్పెషాలిటీ. బెంగాలీ ఫ్యావరెట్ వంటకాలైన ఝల్ మురీ, కలకత్తా మటన్ బిర్యానీ, కోశా మాంగ్సో, సహా దత్తా వీడియో వంటకాలు పాటల రూపంలో హోరెత్తిస్తున్నాయి. ఆమె రిలీజ్ చేస్తోన్న ఒక్కో పాటా ఒక్కో కొత్త ప్రదేశంలో, కొత్త మ్యూజిక్‌తో సరికొత్తగా ప్రారంభం అవుతుంది. దత్తా ''సాంగ్ బ్లాగ్''పేరు మెట్రోనోమ్. ఇంకేం, ఆర్ యూ హంగ్రీ... ఆర్ యూ హంగ్రీ అంటూ ఓ పాటేసుకోండి మరి..



## ప్రేమ జంట ఆత్మహత్య

**పశ్చిమగోదావరి జిల్లాలో ఘటన**



మద్దిక్షేత్రంలో శేఖర్, పోసమ్మల సెల్ఫీ

**జంగారెడ్డిగూడెం రూరల్ :** చదువుకునే రోజుల్లో ఏర్పడిన స్నేహం ప్రేమగా మారింది. కలిసి జీవిద్దామని కలలుగన్నారు. కానీ వారి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో విషగుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలో శనివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఘటనలో నాగంపల్లి శేఖర్ (20) అక్కడికక్కడే మృతిచెందగా.. తెల్లం పోసమ్మ జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. బుట్టాయిగూడెం మండలం నూతిరామన్నపాలేనికి చెందిన శేఖర్, పోలవరం మండలం సరిపల్లికుంటకు చెందిన తెల్లం పోసమ్మ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. 2017లో కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీరు ఇంటర్ చదువుతున్న రోజుల్లో వీరి మధ్య ప్రేమ చిగురించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం వారు గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. సోషల్ మీడియాలో పెట్టిన ఫొటోలను బట్టి వీరు అక్కడ వివాహం చేసుకున్నట్టు తెలుస్తోంది. మద్దిక్షేత్రంలో గడిపిన వీరిద్దరూ గుర్వాయిగూడెంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. శనివారం ఉదయం పోసమ్మ వాంతులు చేసుకోవడాన్ని లాడ్జి సిబ్బంది, అక్కడివారు గమనించారు. అప్పటికే శేఖర్ గుళికలు తిని మృతిచెంది ఉన్నాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన పోసమ్మను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- మృతులందరూ హైదరాబాద్ వాసులు
- అతి వేగమే ప్రమాదానికి కారణమన్న పోలీసులు



పల్టీలు కొట్టి పొలాల్లో పడిన కారు, (ఇన్‌సెట్‌లో) మృతులు సుజాత, గోపీకృష్ణ, విజయకుమార్

**రొంపిచర్ల (నరసరావుపేట):** గుంటూరు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రొంపిచర్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన వియ్యంకుల వరసయ్యే అన్నంగి, సిద్దంశెట్టి కుటుంబాలకు చెందిన ఆరుగులు శనివారం ఉదయం కారు (ఏపీ 36 ఏఈ 3535)లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని జొన్నవాడ అమ్మవారి ఆలయానికి బయల్దేరారు. అతి వేగంగా వస్తున్న కారు గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం సంతగుడిపాడు సమీపంలో అద్దంకి– నార్కెట్‌పల్లి రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొడుతూ రోడ్డుకు దూరంగా పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో సిద్దంశెట్టి సుజాత (52) అక్కడికక్కడే మృతి చెందగా, అన్నంగి విజయకుమార్ (62), సిద్దంశెట్టి గోపీకృష్ణ (54) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. డ్రైవర్ వినీత్, అన్నంగి తిరుపతమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అలాగే అన్నంగి పూజిత, చైతన్య స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. చైతన్య ఫిర్యాదు మేరకు రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవటం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## మూగపిల్లలు పుట్టారని..

- కుమారుడిని చంపి తల్లి ఆత్మహత్య
- తమిళనాడులో ఘటన



శక్తివేల్‌తో తల్లి అశ్విని (ఫైల్)

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** పుట్టిన ఇద్దరు కొడుకులూ మూగవారని ఆ తల్లి కలత చెందింది. చిన్న కుమారుడిని హతమార్చి తానూ తనువు చాలించింది. ఈ దారుణమైన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. చెన్నై పోరూరుకు చెందిన మహేష్ (25), అశ్విని (22) దంపతులకు.. ప్రదీప్ (4), శక్తివేల్ (2) అనే ఇద్దరు కుమారులున్నారు. మూగ, చెవిటివాడైన పెద్ద కుమారుడికి ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించి ప్రస్తుతం స్పీకింగ్ థెరపీ ఇప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా రెండేళ్లు దాటుతున్నా చిన్న కుమారుడికి మాటలు రాకపోవడంతో వైద్యులకు చూపించారు. ఈ చిన్నారికి కూడా మూగ, చెవుడని చెప్పారు. పెద్ద కుమారుడి వైద్యం కోసం ఇప్పటికే రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో మరో బిడ్డ కూడా మూగవాడని తేలడంతో ఆ తల్లి మానసికంగా కుంగిపోయింది. శుక్రవారం మహేష్ తన పెద్ద కుమారుడిని అత్తవాళ్ల ఇంట్లో వదిలిపెట్టి రాగా ఇంటి లోపలివైపు గడియ వేసిఉంది. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో బద్దలుకొట్టి లోనికి వెళ్లి చూడగా అశ్విని ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. మంచంపై చిన్న కుమారుడు విగతజీవిలా పడిఉన్నాడు. ముఖంపై దిండుపెట్టి శక్తివేల్‌ను తల్లే హత్యచేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

# తన్నీర్.. తన్నీర్!

**తమిళనాడులో తీవ్రస్థాయిలో నీటి కష్టాలు**

- ఎడారిని తలపిస్తున్న జలాశయాలు
- చెన్నైలో ఆస్పత్రులు, బడులు, మాన్షన్లు మూత
- వర్క్ ఫ్రంహోంకు ఆదేశించిన ఐటీ కంపెనీలు
- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్న అపార్ట్‌మెంట్ వాసులు
- నిర్మాణరంగానికి రూ.10వేల కోట్ల నష్టం
- రోడ్డునపడిన 50 లక్షల మంది కార్మికులు
- 2000 తర్వాత ఇదే అత్యంత దారుణమైన పరిస్థితి






చెన్నై పరంగిమలై మెట్రోరైల్వేస్టేషన్‌లో టాయిలెట్లను మూసివేసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, చెన్నై

తమిళనాడు ప్రజలు తన్నీర్.. తన్నీర్.. అంటూ అలమటిస్తున్నారు. రాజధాని చెన్నై సహా రాష్ట్ర వ్యాప్తంగా నీటి కష్టాలు విశ్వరూపం దాల్చాయి. ముఖ్యంగా గ్రేటర్ చెన్నై గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. చెన్నై దాహార్తిని తీర్చే జలాశయాలు ఎడారిలా మారిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం పరితపిస్తున్నారు. నిత్యావసరాలకు, కాలకృత్యాలకు సైతం నీరు దొరక్క ఖాళీ బిందెలు చేతబట్టి వాటర్ ట్యాంకుల కోసం ఎదురుచూస్తున్నారు. అనేక ప్రాంతాల్లో రోడ్లపై బైఠాయిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరం తరువాత చెన్నై ఇంతటి దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటోంది. నగరంలోని అపార్టుమెంటు వాసులు ఆన్‌లైన్ ద్వారా నీటి ట్యాంక్ బుక్ చేసుకోవాల్సిన కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నారు. సాధారణ హోటళ్లు, స్టార్ హోటళ్లు, ప్రయివేటు సంస్థలు, కార్పొరేట్ కార్యాలయాలకు, పరిశ్రమలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. తాగునీటిని సమకూర్చలేని ఐటీ సంస్థలు 'వర్క్ ఫ్రం హోం' చేయాలని ఉద్యోగులకు ఆదేశాలిచ్చాయి. 6వేల లీటర్ల ట్యాంక్ రూ.475, 9వేల లీటర్ల ట్యాంక్ రూ.700 తాగునీటి శాఖకు చెల్లిస్తూ ఆన్‌లైన్ బుక్ చేసుకుంటే ఏడు రోజుల తరువాత వాటర్ ట్యాంక్ వస్తుంది. అదీ సదరు వినియోగదారు వారానికి ఒకసారి మాత్రమే బుక్ చేసుకోవాలని షరతు విధించారు. నగరంలోని కొన్ని ప్రయివేటు పాఠశాలలు నీటి ఇబ్బందులతో రెండురోజులు సెలవులు ప్రకటించాయి. చెన్నై నగరంలో 15 ఉమెన్ మాన్షన్లను మూసివేయగా పురుషుల మాన్షన్లలో నీటి సరఫరా వేళలను బోర్డులపై ప్రకటించి ఆచరించాలని ఆదేశించారు. ఆసుపత్రులు నీరులేక అల్లాడుతున్నాయి. నగరంలోని మెట్రోరైల్వేస్టేషన్లలో టాయిలెట్లకు తాళాలు వేశారు.



నీళ్ల కోసం జనం పాట్లు

### అడుగంటిన జలాశయాలు

గత ఏడాది రుతుపవనాలు ముఖం చాటేయడంతో తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో వ్యవసాయ బావులు, చెరువులు, జలాశయాలన్నీ ఎండిపోయాయి. దాదాపు రెండు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మంగళవారం నాటి సమాచారం ప్రకారం చెన్నై దాహార్తిని తీర్చే పూండి, చోళవరం, చెంబరబాక్కం, రెడ్‌హిల్స్ జలాశయాలు నెలరోజుల కిందటే పూర్తిగా ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. 1465 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటి నిల్వసామర్థ్యం కలిగిన వీరాణం జలాశయం మాత్రమే 530 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటి నిల్వతో ఒకింత ఆదుకుంటోంది. సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే నెమ్మిలి, మీంజూరులోని నీటి నిర్లవణీకరణ కేంద్రాలు 180 మిలియన్ లీటర్ల నీటిని అందిస్తున్నాయి. చెన్నై దాహం కోసం రోజుకు 830 మిలియన్ లీటర్లు అవసరం కాగా 525 మిలియన్ లీటర్లను మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారు. చెన్నై తాగునీటి అవసరాల కోసం తెలుగుగంగ పథకం కింద నెల్లూరు జిల్లాలో కండలేరు జలాశయం ద్వారా ఏడాదికి 12 టీఎంసీలను తమిళనాడు పొందాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కండలేరులో కేవలం 4.5 టీఎంసీ మాత్రమే ఉంది. కనీసం 6.5 టీఎంసీలకు పైగా ఉంటేగానీ కండలేరు జలాశయం నుంచి నీటిని పొందలేరు. తాగునీటి సరఫరా శాఖ 1005 ట్యాంకర్ల ద్వారా నగరంలో నీటిని సరఫరా చేస్తున్నా చాలడంలేదు. ఈ నీటి కటకటను కొందరు ప్రయివేటు వ్యాటర్‌క్యాన్ వ్యాపారస్తులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. చెన్నై కొట్టివాక్కం సెందామరై కన్నన్ వీధిలో ఓం ఎస్ఆర్‌వీపీ ఆక్వా అనే సంస్థ మరుగుదొడ్డి గుంటను పోలిన నేలమాగాణి తొట్టిలో నీటిని నిల్వచేసి దుర్గంధభూయిష్టమైన తాగునీటిని సరఫరా చేస్తుండగా అధికారులు సీలు వేశారు.

### విస్తరించిన నగరం..పెరిగిన జనాభా..

నగరం నలుమూలలా విపరీతంగా విస్తరించడమే నీటి సమస్యకు ప్రధాన కారణమని తాగునీటి శాఖ అధికారులు చెబుతున్నారు. 2011లో 178 చదరపు కిలోమీటర్లు ఉన్న చెన్నై నగరం ఇప్పుడు 426 చదరపు కిలోమీటర్లకు విస్తరించిందని తెలిపారు. విస్తరించిన ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పైప్‌లైన్లను అమర్చే పనులు కొనసాగుతున్నాయి. శివారు ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలు, స్టార్ హోటళ్లు బోర్లువేసుకుని ఇన్నాళ్లూ అవసరాలు తీర్చుకుంటున్నారు. అయితే రెండేళ్లలో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోవడం, మెట్రోవాటర్ సరఫరా లేనికారణంగా ఈ ఏడాది క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాగా నీటి కరువు పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాసు హైకోర్టు మంగళవారం ఆక్షేపించగా, ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి బుధవారం జిల్లా కలెక్టర్లతో అత్యవసర సమావేశం అవుతున్నారు.

### నీటి కోసం రెండు హత్యలు

రాష్ట్రంలో విశ్వరూపం దాల్చిన తాగునీటి ఎద్దడి ప్రజల్లో విపరీత ధోరణులకు దారితీస్తోంది. దాహం తీర్చుకునేందుకు ప్రాణం తీసేందుకైనా సిద్ధమనే దుర్మార్గం పెరిగిపోయింది. రెండువారాల్లో ఇద్దరు హతమయ్యారు. అక్రమంగా నీటి ట్యాంకర్‌ను దాచిపెట్టిన వ్యక్తిని నిలదీసిన ఓ సామాజిక కార్యకర్త, వీధి కొళాయి వద్ద తగాదాలో మరో వ్యక్తి హత్యకు గురయ్యారు. మరో మహిళ కత్తిపోట్లకు గురైంది. కాగా నీటి కోసం లోతుగా తవ్విన గుంతలో పడి భవతారిణి అనే మూడేళ్ల చిన్నారి చనిపోయిన విషాదం పుదుక్కోట్టై జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది.

### నిర్మాణరంగానికి రూ.10 వేల కోట్ల నష్టం

ఈనీటి ఎద్దడి నిర్మాణరంగంపై కూడా ప్రభావం చూపింది. నీరు అందుబాటులోకి లేకపోవడంతో భవన నిర్మాణపనులు, అపార్టుమెంటుల నిర్మాణాలు అనేక చోట్ల నిలిచిపోయాయి. భవన నిర్మాణ రంగం సుమారు రూ.10వేల కోట్ల నష్టాన్ని ఎదుర్కొంటోంది. ఇక ఈ రంగంపైనే ఆధారపడి బతుకుతున్న 50 లక్షల మంది కార్మికులు పనుల్లేక రోడ్డున పడ్డారు.

### దుస్థితికి ప్రభుత్వాలే కారణం

తమిళనాడులో నీటి దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వాల పోకడే కారణమని సీనియర్ ఐఏఎస్ అధికారి సహాయం వ్యాఖ్యానించారు. చెన్నై చుట్టుపక్కల ప్రాంతాల్లోని 1,500 చెరువుల్లో పూడికతీత, పునరుద్ధరణ పనులు చేపట్టాలని తాను 20 ఏళ్ల క్రితమే ప్రభుత్వానికి సిఫార్సు చేశానన్నారు. అయితే ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో అత్యంత నిజాయితీగలిగిన అధికారిగా పేరొందిన ఆయన చెబుతున్న విషయాల్లో ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి.

# దేవుడి భూముల లీజులపై సమీక్ష

- ఐదేళ్లుగా జరిగిన ఒప్పందాల పరిశీలన
- ప్రతి ఆలయం నుంచి వివరాల సేకరణ
- అక్రమాలు రుజువైతే ఒప్పందాల రద్దుకు సర్కారు సిద్ధం

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో గత ఐదేళ్లుగా టీడీపీ హయాంలో జరిగిన దేవుడి భూముల అమ్మకాలు, లీజు ఒప్పందాలపై సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ రికార్డుల్లో దేవుడి భూములుగా ఉన్న వాటికి సైతం దేవదాయ శాఖ ద్వారా నిరభ్యంతర సర్టిఫికెట్లు (ఎన్‌వోసీ) జారీ చేయడంపైనా సమీక్షకు ప్రభుత్వం సమాయత్తమైంది. దేవుడి భూములను లీజుకిస్తూ చేసుకున్న ఒప్పందాల వివరాలను వెంటనే పంపాలంటూ దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్‌మోహన్‌సింగ్ ఆ శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. ఆలయాల వారీగా లీజు ఒప్పందాలు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక లీజుల ఒప్పందాలపై వేర్వేరుగా నివేదికలు అందజేయాలని కమిషనర్‌ను ఆదేశించారు.

### పలుచోట్ల 33 ఏళ్ల లీజులు

పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అధిక విలువ ఉండే దేవుడి భూములను టీడీపీ సర్కారు 33 ఏళ్ల పాటు తమకు కావాల్సిన వారికి కట్టబెట్టడంపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమయ్యాయి. సాధారణంగా దేవుడి భూములను లీజుకివ్వదలిస్తే బహిరంగ వేలం నిర్వహించి కేవలం మూడేళ్ల కాల పరిమితితో అప్పగించాలని దేవదాయ శాఖ చట్టం చెబుతోంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం దేవుడి భూములను 11 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి కూడా ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీనికితోడు నాటి మంత్రి మండలి పలుచోట్ల ఏకంగా 33 ఏళ్ల పాటు లీజుకిస్తూ తీర్మానాలు చేసింది. ఈ నేపథ్యంలో మూడేళ్ల లోపు కాలపరిమితితో చేసుకున్న ఒప్పందాలు, మూడేళ్ల కంటే ఎక్కువ గడువుతో చేసుకున్న లీజు ఒప్పందాల వివరాలను పంపాలని రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖను ఆదేశించింది. ఈ వివరాలు అందిన వెంటనే నిబంధనలకు విరుద్ధంగా జరిగిన లీజు ఒప్పందాలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు తొలుత సమీక్షించే అవకాశం ఉంది. అనంతరం దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన దీర్ఘకాలిక ఒప్పందాలతోపాటు అక్రమాలు జరిగినట్లు భావిస్తున్న లీజులపై విచారణ జరపాలని ప్రభుత్వం యోచిస్తోంది. అక్రమాలు, అవినీతి తేలితే ఆ ఒప్పందాలను రద్దుచేసి తిరిగి లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అధికారులు చెబుతున్నారు.

**రాష్ట్రంలో దేవుడి భూముల వివరాలు.. (ఎకరాల్లో)**

| | |
|---|---|
| దేవదాయశాఖ ఆధీనంలోని ఆలయాల పేరుతో ఉన్న భూములు | 4,09,229.99 |
| వ్యవసాయానికి పనికి వచ్చే భూమి | 1,51,297.07 |
| అర్చకులు, ఇతర సర్వీసుదారుల ఆధీనంలో ఉన్న భూమి | 1,01,027.92 |
| వ్యవసాయానికి పనికిరాని అటవీ, కొండ భూములు | 39,995.87 |
| అక్రమణదారుల ఆధీనంలో ఉన్న భూములు | 67,525.06 |
| గడువు ముగిసినా కౌలుదారులు ఖాళీ చేయని భూములు | 3,613.62 |
| దేవదాయ శాఖ ఉపయోగించుకుంటున్న భూమి | 35,117.41 |
| ప్రభుత్వ అవసరాలకు తీసుకొని పరిహారం చెల్లించని భూమి | 10,653.04 |

తెలంగాణ

### శారదా పీఠానికి రెండెకరాల స్థలం కేటాయింపు

**రూపాయికి ఎకరం చొప్పున ధర ఖరారు**

**సాక్షి, హైదరాబాద్:** విశాఖ శారదా పీఠానికి హైదరాబాద్ నగరంలోని కోకాపేటలో రూపాయికి ఎకరం చొప్పున నామమాత్రపు ధరతో రెండు ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆలయ సముదాయం, వేద భాష గోష్టి మఠం, సంస్కృతి విద్యా సంస్థ, విద్యార్థుల వసతి గృహం, భోజన శాల, కన్వెన్షన్ హాల్‌తో కూడి శాఖా పీఠాన్ని నెల కొల్పడానికి నగరంలో స్థలం కేటాయించాలని విశాఖ శారదా పీఠం ధర్మాధికారి గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. గండిపేట మం డలం కోకాపేటలోని సర్వే నంబర్ 240లో ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమిని శారదా పీఠానికి కేటాయించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న ఈ స్థలం మార్కెట్ విలువ ఎకరాకు రూ.12 కోట్లని నివేదించారు. ఈ నేపథ్యంలో స్థలాన్ని హెచ్ఎండీఏ నుంచి వెనక్కి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం శారదా పీఠానికి కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

# పెళ్లి పేరుతో రూ.10 కోట్లకు టోకరా

- 9 మంది యువతుల జీవితాలతో చెలగాటం
- తమిళనాడులో యువకుడి అరెస్ట్



చక్రవర్తి

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** భారీగా డబ్బు సంపాదించేందుకు వివాహ వేదికలనే పెట్టుబడిగా చేసుకున్నాడో ప్రబుద్ధుడు. పెళ్లి పేరుతో నమ్మించడం, మాయమాటలతో లోబరుచుకోవడం, డబ్బును దోచుకోవడం వృత్తిగా చేసుకున్నాడు. ఇలా 9 మంది యువతుల నుంచి రూ.10 కోట్ల వరకు కాజేశాడు. అతని ఉచ్చులో పడిన చెన్నైకి చెందిన ఓ ప్రముఖ వైద్యురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో బండారం బట్టబయలైంది. తమిళనాడు తిరువణ్ణామలైకి చెందిన చక్రవర్తి (35)ని ఈనెల 17న అదుపులోకి తీసుకుని ఐదు రోజులుగా చేపట్టిన విచారణతో శనివారం ఈ ఘోరాలు వెలుగు చూశాయి. ఇంజనీరింగ్ పట్టభద్రుడైన చక్రవర్తి రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో బాగా సంపాదించి కొన్నాళ్లకు అంతా పోగొట్టుకున్నాడు. లగ్జరీ జీవితాన్ని కొనసాగించలేక 2012లో మోసగాడిగా మారాడు. మ్యాట్రిమొని, వివాహవేదిక వెబ్‌సైట్‌ల ద్వారా యువతులకు వల వేసి డబ్బు సంపాదించవచ్చని ఓ ప్రభుత్వ అధికారి ఇచ్చిన సలహాను ఆచరణలో పెట్టాడు. వయసు మీదపడుతున్నా పెళ్లికాని యువతులు, వితంతువులు, భర్తను వదిలేసిన వారే లక్ష్యంగా వల విసిరాడు. ఖరీదైన దుస్తుల్లో వారిని కలుసుకుని ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ పెళ్లి చేసుకుందామని నమ్మించేవాడు. ఇతని చర్యలకు సంబరపడిపోయిన యువతులు పెళ్లి పీటలు ఎక్కకముందే సొమ్ముతో పాటు శరీరాన్ని సమర్పించుకున్నారు. పెళ్లిపై ఒత్తిడి తేగానే మాయమైపోయేవాడు. చెన్నైలోని ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేసే ఒక యువతి వివాహవేదిక వెబ్‌సైట్‌లో 2016లో వివరాలను నమోదు చేసుకుంది. వివాహితుడైన విషయాన్ని దాచిపెట్టి తాను అమెరికా దేశం వాషింగ్టన్‌లో వైద్యునిగా పనిచేస్తున్నానని చెప్పడంతో అతడిని వివాహం చేసుకునేందుకు నిర్ణయించుకుంది. తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ప్రేమికురాలిగా మారింది. కొన్నిరోజుల తర్వాత తాను భారత్ వచ్చానని, నేరుగా కలుసుకోవాలని భావిస్తున్నానని చెప్పాడు. దీంతో చెన్నై క్రోంపేటలోని ఒక ప్రైవేటు అతిథి గృహంలో ఇద్దరూ రాత్రంతా గడిపారు. పెళ్లి చేసుకుందామని ఆమె కోరగా ఇటీవలే తన తల్లి చనిపోయిందని.. ఏడాది వరకు శుభకార్యాలు చేయకూడదని దాటవేశాడు. ఇలా కొన్నేళ్లపాటు ఇద్దరూ చనువుగా మెలిగారు. తాను భారత్‌లోనే స్థిరపడి తిరువణ్ణామలైలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయబోతున్నానని చెప్పడంతో రూ.6.90 కోట్లను అతడి వ్యాపారానికి సహాయం చేసింది. ఏడాదిగా పెళ్లి ప్రస్తావన దాటవేస్తూ అకస్మాత్తుగా అదృశ్యం కావడంతో ఆమె చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. చక్రవర్తిని అరెస్ట్ చేశారు. ఇతని బారినపడి 9 మంది యువతులు సర్వం సమర్పించుకుని రూ.10 కోట్ల వరకు నష్టపోయారు. పెళ్లిళ్ల పేరుతో యువతుల నుంచి కాజేసిన డబ్బుతో తిరువణ్ణామలై, వేలూరు, విళుపురం జిల్లాల్లో కొనుగోలు చేసిన అనేక ఇళ్లు, భూములు, 3 లగ్జరీ కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చక్రవర్తిపై ఇంకా అనేక ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించాలని క్రైంబ్రాంచ్ పోలీసులు నిర్ణయించారు.

State Economy Fame NAGARJUNA Sir
APPSC TSPSC Gr-2 NEW BATCH
Demo @ 11 a.m. 27-6-2019
Special Batch ECONOMY
NAGARJUNA's STUDY CIRCLE
ASHOK NAGAR, HYDERABAD.
040-27604111 / 9989104111

YVRAO-HYD
NEET
Batch started
20 Students Batch - Ac
Super tips in PHY & CHEM
9100060601, 603

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.